డిసెంబర్ 77

74

సృజన

చల్లారిన సంసారాలు
మరణించిన జన సందోహం
అసహాయుల హాహాకారాల్
చరిత్రలో మూలుగుతున్నవి

• • •

కరువులలో వరదలలో
కటిక దరిద్రుల అవస్థ
పెను చీకటి, తిరుగుబాటు
భీభత్సపు మెరుపుదాడి
కనులముందు చిత్రించే
గతిలేని జనాల బాధ
కడుపు తరుక్కొని పోయే
కన్నీళుల విషాద గాథ

కవి హృదయపు కనుమలలో
గర్జించిన పర్జన్యం

— శ్రీశ్రీ

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక

74

డిసెంబర్ 1977

"నాకప్పుడు పదమూడేండ్లుంటాయ్. మా నాన్న అనేక మంది అతిథుల్ని ఇంటికి ఆహ్వానించాడు. వాళ్ళ సమక్షంలోనే మా యిద్దరిమధ్య ఒక వివాదం తలెత్తింది. వారందరి ఎదుటనే సోమరిననీ అప్రయోజకుడననీ నన్ను మా నాన్న నిందించాడు. నాకు బాగా కోపం వచ్చింది. నే నాయన్ని తిట్టి ఇంటి నుండి వెళ్ళిపోయాను. మా అమ్మ నా వెంట పరుగెత్తుకొచ్చి వెనక్కి రమ్మని బతిమాలింది. మా నాన్నకూడా నా వెంటపడ్డాడు. తిడుతూనే వెనక్కి రమ్మని ఆజ్ఞాపిస్తున్నాడు. నేనొక కుంట (చెరువు) అంచుకు వెళ్ళి ఆయన ఇంకేమాత్రం దగ్గరకొచ్చినా అందులో దూకుతానని బెదిరించాను. ఈ పరిస్థితిలో అంతర్యుద్ధాన్ని నిలిపివేయాలని వాదప్రతివాదన లొచ్చాయి. నేను క్షమాపణ చెప్పుకోవాలని మా నాన్న పట్టుబట్టాడు. నన్ను కొట్టబోనని మాటయిస్తే అలా చెయ్యడానికి నే నంగీకరించా. ఆ విధంగా యుద్ధం ముగిసింది. బహిరంగ తిరుగుబాటు చెయ్యటం ద్వారా నా హక్కుల్ని రక్షించుకొనడానికి నేను ప్రయత్నించినపుడు మా నాన్న సడలింపు చేస్తాడనీ, నేను భయపడుతూ లొంగిపోయినప్పుడల్లా ఆయన మరింతగా తిడుతూ కొడుతూ వుంటాడనీ నాకర్థ మయ్యింది."

— మావో

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా రు. 15 ఈ సంచిక రు. 1-50

సృజన

డిసెంబర్ 1977 మాసపత్రిక 74

సంపాదకీయం	3
'నిర్లక్ష్యం తుఫానులో నిరుపేదల హత్య' (వార్తలు)	4
నక్సల్‌బరి (కవిత) – ఎ. ఆర్.	5
గిరిజనుడా! (పాట) – వంగపండు ప్రసాదరావు	6
భూమి భాగోతం (పరిచయం)	8
నెత్తురు నిజం (కవిత) – నిఖిల్	10
భూమయ్య - కిష్టాగౌడ్ (సంస్మరణ)	10
'వేటమృగం' (వార్తాచిత్రం) – వై. కాశీపతి	19
విప్లవనారి మొలినాధక్ (వ్యాసం)	20
సుబ్బారావు పాణిగ్రాహి (సంస్మరణ) – రేక	23
లేచెను విప్లవ జ్వాలా! (పాట) – సుబ్బారావు పాణిగ్రాహి	28
పాఠశాల (కథ) – 'ఉపాధ్యాయ'	29
తీర్పు (పాలస్తీనా కథ)	49
చేదు పాట (పాట) – విజయ్	52
బాదరాయని సంబంధం (కవిత) – రామయ్య	52
అప్రూవర్ (కవిత) – ప్రజ	53
వంచకుల నీతిశాస్త్రం (కవిత) – భిక్షం	54
జనం పాటలు (సమీక్ష) – జీ. డి.	55
స్వేచ్ఛ : బూర్జువా భ్రమలు (పరిశీలన) – క్రిస్టాఫర్ కాడ్వెల్	58
లేఖలు	65
'ఎదురు తిరిగితే...' కథపై చర్చ. అభిప్రాయాలు	69
తుఫాను (కవిత) – జీన్	70

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh Hyderabad. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

మొన్నటి పెనుతుఫాను బారికి ఎనభై వేల మందికిపైగా మృతులై వుంటారని అంచనా. అత్యంత విషాదకరమైన హృదయవిదారకమైన సంఘటన యిది.

ఇలాంటి తుఫానులు సంభవించినప్పుడు మనం సాధారణంగా గమనించే విషయం: తుఫానుల్లో సామాన్యులు అపారంగా నష్టపోవడం- అసహాయంగా మిగిలిపోవడం. మొన్నటి తుఫానులోనూ అదే జరిగింది. చనిపోయినవారు ఎక్కువగా సామాన్యులూ, పేదరైతు కూలీ జనాలు- కనిపించకుండా పోయినవి పూరిళ్ళూ, పెంకుటిళ్ళూ, సామాన్యుల కొంపలూ.

ప్రకృతికి పక్షపాతంలేదు- కాని యీ దోపిడీ సమాజాన్ని నిర్మించిన మనిషి ప్రకృతికి స్వార్థం ఉంది- కాకపోతే 30 ఏళ్ళ స్వాతంత్ర్యం తరువాతకూడా యివాళ తుఫానులో మునిగిపోయిన ప్రాంతాల, ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం ఏ చర్యలు తీసుకొంది? ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందిఉంటే యింత విపరీత నష్టం జరిగిఉండేదా?- ఈ దేశంలో పెద్దపెద్ద పట్టణాల్లో ఆకాశహర్మ్యాలూ, నక్షత్రాల హోటళ్ళూ, కార్లూ జార్లూ, పెద్దపెద్ద కర్మాగారాలూ కొందరి చేతుల్లో. మరి దివిసీమ లాంటి ఎన్నో పల్లె ప్రాంతాలు ఏళ్ళతరబడి ఎదుగూబొదుగూ లేకుండా ఎందుకు పడిఉన్నాయి? విస్తారమైన కోస్తా ప్రాంతాలూ, పల్లెసీమలూ ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకోలేని వెనుకబడిన నిస్సహాయ ప్రాంతాలుగా ఉండిపోవలసిందేనా?

ప్రకృతి శక్తి అనంతం- అయితే మానవశక్తి కూడా అనంతమైనదే- ప్రకృతిని లొంగదీసి తనకు ఊడిగం చేయించుకొనే శక్తి ఒక్క మానవునికే ఉంది- అతడు సముద్రాలను శాసించగలడు- నదులకు నడక నేర్పగలడు. ఆతని శాస్త్రవిజ్ఞానం నూతన విశాల సుఖమయ ప్రపంచాన్ని ఆవిష్కరించగలదు.

కాని నేడు సామ్రాజ్య, సోషల్ సామ్రాజ్యవాదదేశాలూ వాటి తొత్తులూ మానవ విజ్ఞాన శాస్త్రాన్ని- మారణాయుధాలూ, ఘోరయుద్ధాలూ సృష్టించడానికీ, ఎన్నో దేశాల మీద ఎందరో శ్రమజీవుల మీద కొందరి పెత్తనం చెలాయించే దోపిడి విధానం కొనసాగడానికీ- సాధనంగా ఉపయోగిస్తున్నాయి.

ఇప్పుడు తుఫాను భీభత్సానికి గురైన ప్రాంతాల్లో జరుగుతున్న సహాయ కార్యక్రమాల అవకతవకలు వింటుంటే ఆశ్చర్యమూ, అసహ్యమూ కలుగుతాయి.

మన పొరుగు దేశమైన చైనాలో గత సంవత్సరం వచ్చిన భూకంపాల్లో వేలాది జనమూ, విస్తారమైన ఆస్తీ నష్టపోయినప్పుడు ఏ దేశసహాయాన్నీ అర్థించకుండా పునర్నిర్మాణ కార్యక్రమాల్లో అక్కడి ప్రభుత్వం, ప్రజలు కనబరచిన ఆత్మస్థైర్యం,

చొరవ, చురుకుదనం, నిస్వార్థత ఎందరో విదేశీయుల్ని సైతం ముగ్ధుల్ని చేసింది. సోషలిస్టు సమాజం లక్షణమే అది– మార్క్సిజం మానవుని నిస్వార్థునిగ కార్యశూరునిగ తీర్చిదిద్దుతుంది.

తుఫాను బాధితులకు సహాయం అన్ని మూలల నుండి విరివిగా అందవలసిందే– కాని యీ సహాయాలేవీ బాధితుల సమస్యల్ని శాశ్వతంగా పరిష్కరించలేవు– నిరంతర దోపిడిలో, తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో, అప్పుల్లో, అవమానాల్లో, అశ్రువుల్లో సామాన్యుని జీవితంలో ఎన్నో తుఫానులు.

వీటి నుండి విముక్తి పొందాలంటే యీ దోపిడీవ్యవస్థను రూపుమాపడం మార్క్సిజం దిక్సూచిగా వర్గరహిత సమాజాన్ని నిర్మించుకోవడం ఒక్కటే మార్గం.

ఈ మార్గంమీద కార్మికులూ, కర్షకులూ, కష్టజీవులూ, విద్యార్థులూ, మేధావులూ అలలు అలలుగా ఉప్పెనగా లేవాలి– ఈ చీకటి వ్యవస్థను ముంచేయడానికి.

— సంపాదకుడు

వార్తలు :

'నిర్లక్ష్యం తుఫానులో నిరుపేదల హత్య'

వారం రోజుల ముందుగానే తమిళనాడు నుండి మేజర్ జనరల్ మహదేవన్ జి. ఒ. సి. దక్షిణతీర ప్రాంతాలలో రాగల తుఫాన్ వివరాలను (తీరాన్నుండి సుడిగుండం పయనించగల దూరం, వాయువేగం 100 కి.మీ. ఉంటుందని మొదలయిన) తెలియజేస్తూ హెచ్చరికలు చేశారు. మద్రాసు, సికింద్రాబాద్ నగరాలలో సేనాదళాలు సహాయ కార్యక్రమాలకు సంసిద్ధం చేయబడినాయి. తుఫాన్‌కు గురి అవగల ప్రాంతాల నుండి ప్రజలను తరలించడానికి అన్ని రకాలుగా సంసిద్ధులై ప్రభుత్వ ఆదేశాలకోసం వేచి వున్నారు. కాని, మన ముఖ్యమంత్రిగారు సకాలంలో ఇచ్చిన హెచ్చరికలను అలవాటు ప్రకారంగా చెత్తకాగితాలబుట్టలో పారవేసి హడావుడిగా రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాలను సావధానంగా చర్చించడానికి ఢిల్లీపరిగెత్తారు. అది వారికి ముఖ్యమైన సమస్య అయింది. నిజమే మరి. ప్రజలను నిర్దాక్షిణ్యంగా, క్రూరంగా, హీనాతిహీనంగా హింసించి కాల్చి చంపిన ముఖ్యమంత్రి వెంగళరావుకు అపారమైన జననష్టం, ఆస్తినష్టం వాటిల్లగలదని తెలిసినాకూడా చీమకుట్టినట్లయినా లేకపోవడం ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు. రోం మహానగరం తగలబడిపోతుంటే నీరో చక్రవర్తి ప్రణయగీతాలాలాపించాడో లేదో

— 72వ పేజీలో

నక్సల్‌బరి

ఎ.ఆర్.

భరతదేశ చరిత్రలో
యుగయుగాలుగా నడచిన
భరతదేశ చరిత్రలో
గడచిందొక దశాబ్దం
నక్సల్‌బరి దశాబ్దం
కొత్తమలుపు కొత్తపిలుపు
కొత్తబాట కొత్తపాట
కనిపించిన వినిపించిన
మహాగొప్ప దశాబ్దం
నక్సల్‌బరి దశాబ్దం
రైతుకూలి విప్లవాల
రక్తారుణ దశాబ్దం
నక్సల్‌బరి కౌలుదారు
తనకుతానె యజమానిగ
నిలచి నవ్వుకొన్నాడు
దేబ్రాలో సంతాలులు
తమశక్తిని చూపారు
బీర్‌భూమ్‌లో పేదయువత
దొరలమెుక్క లందుకొంది
శ్రీకాకుళ గిరిజనుడు
రాజ్యమేలు కొన్నాడు
పాల్వంచలొ పేదరైతు
స్వేచ్ఛగాను బతికాడు
భద్రాచల బొంగుకూలి
బిర్లానే ఎదిరించెను

కలకత్తా విద్యార్థి
విజృంభించి లేచాడు
గడచిన యీదశాబ్దం
నక్సల్‌బరి దశాబ్దం
భరతదేశ చరిత్రలో
మరోగొప్ప దశాబ్దం
పేదవాళ్ళ సంఘమైతె
సాయుధులై నిలబడితే
తరతరాల పీడకులూ
గడగడగడలాడె దరని
గజగజమని వణికెదరని
తిరుగులేని సాక్ష్యంగా
ప్రత్యక్షం రుజువర్చిన
మహాగొప్ప దశాబ్దం
నక్సల్‌బరి దశాబ్దం
శతాబ్దాల పద్ధతులను
మౌలికముగ మార్చేసే
మహత్తరమ్మైన కృషికి
విఘ్నాలూ విఫలాలూ
కష్టాలూ త్యాగాలూ
వేలమంది గొప్పవాళ్ళు
అమరారుణ త్యాగధనులు
శత్రువుచే నిహతులైరి
లక్షలాది స్త్రీ పురుషులు
వృద్ధయువక పసిపాపలు

చిత్రచిత్ర హింసలతో
బాధలెన్నో పడినారు
పైశాచిక హింసలతో
ఎందరివో లొంగుబాట్లు
ఎన్నో పొరబాట్లు
ఎన్నెన్నో చీలికలు
వచ్చిన విజయాలల్లో
కొన్నికొన్ని హరించినయ్
నక్సల్‌బరి దశాబ్దం
గొప్పగొప్ప విజయాలను
ప్రజలకు చవిచూపుతూనె
ఘోరమైన ఓటములను
ప్రజలకు అందించింది
క్షణకాలమువే అయినా
విజాయాలుత్తే జపర్చు
ఓటములూ పొరబాట్లూ
పాఠాలను నేర్పుతాయి

చీలికలూ అనైక్యతలు
అశాశ్వతం అంతరించు
జనచోదక శక్తులన్ని
ఐక్యమగుట అనివార్యం
నక్సల్‌బరి దశాబ్దం
భరతదేశ చరిత్రలో
చిరస్మరణ పొందుతుంది
నక్సల్‌బరి దశాబ్దం
భారతీయ చరిత్రలో
మరోమంచి దశాబ్దముకు
మార్గం చూపించుతుంది
కొత్తమలుపు కొత్తపిలుపు
కొత్తబాట కొత్తపాట
కనిపించిన వినిపించిన
మహాగొప్ప దశాబ్దం
నక్సల్‌బరి దశాబ్దం

'గిరిజనుడా!'

వంగపండు ప్రసాదరావు

ఎంత కడుపు మాడెనో -
ఓరన్నా గిరిజనుడా
ఎంత గుండె మండెనో -
మాయన్నా గిరిజనుడా
అంత పెద్ద పోరాటం -
అందరికీ నేర్పినావు ॥ఎంత॥

నక్క నక్క సావుకారి
నక్కలాగ - వచ్చోడని
అరబుడ్డీ - కిర్సనావి
అరువు నీకు - ఇచ్చోడని
ఆరడ్డల సోలు కొల్త
అప్పుక్రింద రాసోడని
మంచులాంటి గుండెలోను
మంటలు రగిలించినావు ॥ఎంత॥

గెంజిలోకి - వుప్పు నీకు
అప్పుకింద - ఇచ్చోడని
వరిగింజలు - పండగానె
గోనిపట్టు - కొచ్చోడని

లేనిపోని - లెక్కలేసి
గాదె వింపు - కున్నాడని
చీకటిలా - బతికినోడ
సూర్యుడులా - మండినావు ॥ఎంత॥

సంత పాట - సావుఁకారి
'సీటీ' సింపిచ్చోడని
కావిఁడిలో - సింతపండు
కంతిరీగ - తూసోడని
బెల్లపుండ - ఇచ్చోడని
అప్పుసెల్లు - సెప్పోడని
ఆకులాగ - వున్నోడువు
బాకులాగ - మెసిలినావు ॥ఎంత॥

సామానుల - డబ్బుకింద
వడ్డీలను - రాసోడని
వడ్డీలకు - పాయిదాలు
పంటలన్నీ - దోసోడని
మల్లీ పండించమనీ -
మక్కలిరగ - దన్నోడని
వూటనీరు లాటోడువు
ఉప్పెనలా పొంగినావు ॥ఎంత॥

ఆ వుప్పుకొన్న డబ్బులు
మీ రివ్వలేదు - అన్నాడని
ఆ అప్పుకింద - మీ భూములు
రాసి - తీసుకున్నాడని
ఆ సావుఁకారి - భూసోమిగ
సంపాదన - జేసేడని
బెద్దలాగ - వున్నోడువు
గొడ్డలి - తిరగేసినావు ॥ఎంత॥

అసలుపోతె -వడ్డీలు
అలగే - మిగిలున్నాయని
ఆ వడ్డీలకు - కంబారిగ
రమ్మని - పిలిసే డాడని
పాయిదాల - బాకీలకు
పని సెయ్యాలన్నాడని
పిల్లిలాగ - వున్నోడువు
పులిలాగ - దూకినావు ॥ఎంత॥

ఆ భూములున్న - సావుఁకారి
నీ సేతే దున్నించీ
నీ పోడు మీద పంటలన్నీ
పట్నం పంపించోడని
ఆ సోడిగింజ - అంబలైన
నీకు లేక జేసోడని
కంబారి - బతుకునుంచి
కమ్యూనిస్టు - వయినావు ॥ఎంత॥

పరిజాకవి వంగపండు పరిసాదరావుచే రచింపబడి
విశాఖ జననాట్యమండలి దళంవారిచే విరివిగా పరిదర్శింపబడుతున్న

భూమి భాగోతం (నృత్య నాటకం)

పుస్తక రూపంలో త్వరలో సృజన ప్రచురణగా వెలువడుతుంది

"విశాఖ జననాట్యమండలి దళం"వారిచే విరివిగా ప్రదర్శింపబడి
ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్న

భూమి భాగోతం

ప్రజాకవి వంగపండు ప్రసాదరావు

30 సం॥లు పాలించిన కాంగ్రెసు, నేడు అధికారంలోవున్న జనతా ప్రభుత్వాలు
భూమి పంపకం విషయంలో ఆడుతున్న నాటకాలకి అద్దంపట్టే
నృత్యనాటకం "భూమిభాగోతం"

"దున్నేవాడికే భూమి" ఎలా సాధించడం? ఈ ప్రశ్నకు విప్లవ సందేశాత్మక సమాధానమే "భూమి భాగోతం". పౌర స్వేచ్ఛకు ప్రజాస్వామ్య హక్కుల రక్షణకు ఏది హామీ? పార్టీల ఫిరాయింపా? లేక ప్రభుత్వాల మార్పిడా? కాదు. తమహక్కుల రక్షణకోసం ప్రజలంతా చైతన్యవంతంగా అలుపులేని పోరాటాలకి సిద్ధం కావట మొక్కటే సరైన హామీ అని చాటిచెప్పే పీడిత ప్రజా రాజకీయ సందేశమే ఈ "భూమి భాగోతం."

ప్రియమైన ప్రజలారా !

దేశ జనాభాలో 100కి 80 మంది వ్యవసాయంపైననే ఆధారపడుతూ జీవిస్తున్న మనలాంటి పెద్ద వ్యవసాయ దేశాన్ని పట్టిపీడిస్తున్న అన్నిసమస్యలకూ మూలం ఒక్కటే! అది"భూ సమస్య". రెక్కలు ముక్కలు చేసుకు భూమిమీద కష్టపడుతున్న లక్షలాది భూమిలేనిపేదరైతుల స్వంతంకావాలి ఈభూమంతా. ఇది "చట్టాలు పట్టాలు" వల్ల సాధ్యంకాదు. ఈ దేశంలో, కీలకమైన భూసమస్య చట్టంవల్ల సంస్కరించబడేది కాదు. పట్టాలవల్ల పరిష్కరించబడేది కాదు. పేద రైతాంగం వందలు, వేలు, లక్షలు కోట్లుగా ఉప్పెనలా ఉద్యమించి భూమిని ఆక్రమించుకోవాలి. ఈ లక్ష్యంతోనే మన దేశంలో భూమిలేని పేదరైతాంగం కొన్ని వందల సంవత్సరాలనుండి ఎడతెరిపిలేని పోరాటాలు చేస్తూనేవున్నారు. తెల్లదొరల పాలనలో బ్రద్ధలైన మోప్లా తిరుగుబాటు, నీలిమందు రైతుల పోరాటం, అల్లూరి సీతారామరాజు నాయకత్వాన సాగిన గిరిజన రైతాంగ పోరాటం తరువాత "అర్ధరాత్రి సూర్యోదయంలాంటి ఆగస్టు 15 స్వాతంత్ర్యం" తర్వాత నల్లదొరల పాలనలో పెల్లుబికిన వీర తెలంగాణ విప్లవ పోరాటం, మహారాష్ట్రంలో వర్లీలు అనబడే గిరిజన రైతుల పోరాటం, మహత్తర నక్సల్‌బరీ శ్రీకాకుళ రైతాంగ పోరాటాలు ఇందుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే.

ఇవన్నీ ఎవరు చేసిన పోరాటాలు? ఎందుకోసంచేసిన పోరాటాలు? అధిక ధరలతో, ఆకలిచావులు, నిరుద్యోగంతో నిరక్షరాస్యత కులమత భేదాల కుష్టుజబ్బులతో కుళ్ళు కంపుకొడుతున్న దోపిడి భూస్వామ్య వ్యవస్థను భూస్థాపితంచేసి దున్నేవాడికి భూమిని పంచడంకోసం అజ్ఞానులుగా, అనాగరికులుగా, చూపబడుతున్న భూమిలేని పేద రైతులుచేసిన పోరాటాలవి. ఆ లక్ష్యం ఇంకా పూర్తికాలేదు. కనుకనే బడుగు రైతులు యింకా విశ్రమించడంలేదు. తనవారినందరిని కూడగడుతున్నాడు. రైతుకూలీకి కులమతాలతో సంబంధంలేదు. హరిజనులైనా, గిరిజనులైనా, హిందువులైనా, ముస్లిములైనా రైతుకూలీలు రైతుకూలీలే, వారిని దౌర్జన్యంగా దోచుకుతినే భూస్వామ్యవర్గం, వారి ప్రభుత్వాలు జనతా అయినా, కాంగ్రెసు అయినా ఒకటే! భూమిలేని పేదరైతు ఏ కులస్థుడైనా మతస్థుడైనా భూమిభాగోతం రచయిత ప్రజాకవి వంగపండు మాటల్లోనే చెప్పాలంటే మంచులాంటి గుండెలో మంటలు రగిలిస్తూ గొడ్డులాపడుండక గొడ్డలిలా తిరగబడుతూ, అక్షరంరానోడు ఆయుధంపట్టుకొని చీకటితోటి ఒతుకొద్దని సూర్యుడిలా మండుతున్నాడు. ఆ పేదరైతు విముక్తితోనే ప్రజలందరి విముక్తివుంది. కనుకనే మనమంతా ఆ పేదరైతుల పోరాటాలతో చేయి చేయి కలపాలి.

ఈ సందేశాన్ని మీకందివ్వడానికే పీడితప్రజల పోరాట సంస్కృతిని ప్రచారం చేయడానికి కంకణం కట్టుకున్న "భూమిభాగోతం" పుస్తకరూపంలో త్వరలో సృజన ప్రచురణగా వెలువడుతుంది.

చీరాలలో విరసం మహాసభలు

విప్లవ రచయితల సంఘం ఆరవ మహాసభలు 1978 జనవరి 12, 13, 14 తేదీలలో చీరాలలో జరపటానికి నిర్ణయం జరిగింది. జి కల్యాణరావు అధ్యక్షులుగా, రుద్రజ్వాల కార్యదర్శిగా, ఎం.వి. ప్రసాదరావు కోశాధికారిగా ఆహ్వాన సంఘం ఏర్పడింది. విరాళాలు, ఉత్తరాలు ఎం.వి. ప్రసాదరావు, బోసు నగర్, ఆంజనేయగుడి ఎదుట, చీరాల, ప్రకాశం జిల్లాకు పంపాలి.

నెత్తురు నిజం

నిఖిల్

కనపడకుండానే
రక్తాన్ని గడ్డకట్టిస్తున్న చలి
ఎముకల్ని కొరికివేస్తున్న గాలి
తిండి-నిద్ర-మైథునంలో
యంత్రాల్లా బతుకులు
చెట్లమీది సన్నని
రెమ్మల చివరిదాకా పాకిన చీకటి
తుపాకీ బయొనెట్ల మీద
స్తంభించిన ఉద్యోగాలు - ఆర్డర్లు
మనిషి చేతుల మీద
సమాధిగాలేచిన ఎత్తైన గోడల వెనక
"సంఘం" కోసం గుండెనిండా
జీవించి
"అహింస" వారసులను
అట్టహాసంగా వెక్కిరిస్తూ
నవ్విన కిష్టాగౌడ్ !
ప్రాణాలు తీసే నిర్జీవపు చట్టాన్ని
నిర్భయంగా ధిక్కరిస్తూ భూమయ్య!

తరతరాల శ్రామిక వారసత్వంగా
భూగోళపు అంతరాంతరాల
బలిదానపు మేలి పర్వతాల్లా
ఈ ఉదయపు చలికాలపు
మంచు గుండెల్లో
ఆరని రక్తారుణ క్రాంతిని
తీరని మానవ ఆర్తిని
మండిస్తూ
ఉరికంబపు దారుణ మారణ
మనస్తత్వపు పొరల్లో
దాగిన పీడకుల
ప్రజా కంటకుల వెన్నెముకల్లో
చిచ్చు రగిల్చి
బిగుసుకపోయిన జాతికి
నెత్తురు నిజాన్ని చూపి
మా అందరిలో
ప్రాణం పోసుకొంటున్న మీకు
లాల్ సలామ్ః

(రచన – 1-12-1975)

తెలంగాణలో ఉరిశిక్షకుగురైన తొలి రాజకీయ(నక్సలైట్)కార్యకర్తలు

భూమయ్య - కిష్టాగౌడ్

(డిసెంబర్ 1, రెండవ వర్ధంతి)

'తోటారాముని తొడకు కాటా తగిలిందాని
చిలకా చీటీ తెచ్చెరా...... ! మైనా మతలబు చేసెరా !'

ఈ తోటరాముడు ఎవరో కాదు ఎమర్జెన్సీలో డిసెంబర్ 1, 75 న ఉరితీయ బడిన మార్క్సిస్టు-లెనినిస్టుపార్టీ రైతాంగ గెరిల్లా కిష్టాగౌడ్ అయనను ఉరితీసేనాటికి

కూడ ఆయన తొడలో కాలులో రెండు తూటాలున్నాయి. ఆయనను చూసిన జైల్లోని కామ్రేడ్స్‌కు, ఖైదీలకు అందరికీ ఆయన గర్వంగా అవి చూపేవాడు. "ఇవి తెలంగాణ పోరాటకాలంలో ఎదురుకాల్పుల్లో తొడలో, మడిమలో దిగినవి. ఇవి తీస్తే ప్రాణానికి ప్రమాదమని డాక్టర్ చెప్పాడు. అందుకని ఆట్లాగే వుండనిచ్చాను" అని నవ్వుతూ ఆ పోరాట స్మృతిలో పొంగిపోతూ చెప్పేవాడు. కిష్టాగౌడ్‌ది మోకువేసుకొని తాళ్ళెక్కి కాయలు గాచిన శరీరము, చేతులు. కిష్టాగౌడువి తెలంగాణ పోరాట కాలంలో బందూకులు దట్టించి కాయలుగాచిన చేతులు. ముళ్ళ తుప్పలూ, గుట్టలూ అడవులూ వానా ఎండా చలినోర్చి రాగబారిన శరీరం. తాటిచెట్టు ఎక్కేవృత్తి సాహసమే భూస్వాముల నెదిరించే వర్గ చైతన్యంగా మలచుకున్నాడాయన. ఆ రోజుల్లో కరీంనగర్ జిల్లాలో సుప్రసిద్ధమైన గట్టుపల్లి మురళి దళంలో పనిచేసాడు. ఆదిలాబాద్ కరీంనగరు జిల్లాల్లో భూస్వాములకు, పెత్తందార్లకు వ్యతిరేకంగా ఆ రోజుల్లో రైతాంగాన్ని పేదవర్గాలను కూడగట్టి ఎన్నో పోరాటాలు చేసాడు. భూమయ్యను కమ్యూనిస్టు రాజకీయాలవైపు ఆకర్షించినవాడు కూడ కిష్టాగౌడే.

కిష్టాగౌడ్‌కు భిన్నమైన ప్రవృత్తి భూమయ్యది. కిష్టాగౌడు ఆవేశపరుడు. భూమయ్య సౌమ్యుడు. కిష్టాగౌడ్ కళ్ళలో కలలు తొణికిసలాడుతుంటాయి. భూమయ్య కళ్ళల్లో ఆలోచనలు- కిష్టాగౌడ్‌ది ఉంగరాల ఒత్తయిన జుత్తు, భూమయ్యది బట్టతల భూమయ్యది జంగమవృత్తి, పూజారి- ఇద్దరినీ కలిపింది పీడిత పక్షపాతం, ఇద్దరినీ చివరంటా కలిపి నిలిపింది, ఉరికంబం మీదికి ఉత్సాహంతో పంపించింది పేద ప్రజల ఆశయం.

వాళ్ళేంచేసారు- ఎమర్జెన్సీ కాలంలోనే ఎంతో సన్నిహితమయిన సమాచారంతో వాళ్ళ ఉరిశిక్షగురించి వివరమైన వ్యాసంరాసిన ఒక ఫ్రెంచ్ రచయిత మాటల్లో- "ఈ యిద్దరు నక్సలైట్లు ఆదిలాబాదు జిల్లాలోని లచ్చుపటేల్ అనే స్థానిక భూస్వామిని చంపారనే నేరంపై మరణశిక్ష వేయబడింది. కేసులో యివ్వబడిన సాక్ష్యం ప్రకారం లచ్చుపటేల్ భారత దేశంలోని అనేకమంది భూస్వాములవలెనే దోపిడీ, వడ్డీ వ్యాపారం చేస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటూ పేదరైతాంగంపై దుడుకక్రూర పెత్తనం సాగించేవాడు. 1970 ఏప్రిల్‌నెలలో ఒకరోజు గౌడ్ (42 సం॥) భూమయ్య (45 సం॥)తోపాటు పట్టపగలే 300 మంది వెంటరాగా ఈ భూస్వామి యింటికి మార్చ్‌చేసాడు భూస్వామి ఖతంతో ఈఘర్షణ ముగిసింది." వాళ్ళెందుకు భూస్వామిని చంపారు అనే ప్రశ్నవేసుకొని కె.ఎ. అబ్బాస్ భూస్వాముల వడ్డీవ్యాపారుల దౌర్జన్యాలగురించి మరింత వివరంగా

చెప్పాడు. 'అది హింసాత్మకమైన దాడియా? అది వ్యక్తిగతమైన ద్వేషమా? స్త్రీ గురించి వచ్చిన తగాదా? కాదు, కాదు, కాదు. అంతటా చాలమంది భూస్వాముల వలెనే వాళ్ళు క్రూరమైన నిరంకుశులు. ఆంధ్ర తెలంగాణ ప్రాంతాల్లో రైతాంగంతో సంబంధాల విషయంలో భూస్వాములు ఆటవికంగా వ్యవహరిస్తారని అంటారు. వాళ్ళు పేదల యిళ్ళను తగులబెట్టేవాళ్ళుకావచ్చు- భారతదేశంలో చాలమంది అగ్రవర్ణ జమీందారులవలె హరిజన, గిరిజన ఆవాసాలను, గుడిసెలను తగులబెట్టినవాళ్ళు కావచ్చు. చాలమంది జమీందార్లవలె గిరిజనులు ఆకలికి మలమల మాడుతూవుండగా వాళ్ళు ధాన్యాలను విల్వచేసే నల్లబజారువాళ్లు కావచ్చు- వాళ్ళు గిరిజన కుటుంబాల స్త్రీ జనాన్ని మానభంగాలు చేసినవాళ్ళు కావచ్చు"

లచ్చుపటేల్ హరిజనులపై, గిరిజనులపై అత్యాచారాలు కొనసాగించే వర్గానికి చెందినవాడని అబ్బాస్ సరిగానే ఊహించాడు. అంతకన్న అబ్బాస్ తెలంగాణలో భూస్వాముల, వడ్డీవ్యాపారుల ఆటవిక ప్రవర్తనగురించి ప్రత్యేకంగా ప్రస్తావించి వున్నాడు. అబ్బాస్ 'ఆటవికంగా వ్యవహరిస్తారని అంటారు' అని రాసాడు. కాని అటువంటి ఒక భూస్వామి ఏమేమి దుర్మార్గాలుచేసాడో స్వయంగా ఆ ప్రాంతాలకువెళ్ళి చూచి, వినివచ్చిన టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధి ఎస్. బాలకృష్ణన్ జనంచెప్పిన విషయాలు రాసాడు.

సిరిసినగండ్లలో జూన్ 22, 75 న 'ఖతం' చేయబడిన దొంతుల అంతయ్య ఒక భూస్వామి. వయస్సు 50 సంవత్సరాలు. ఆ ప్రాంతంలో మిక్కిలి ద్వేషింప బడిన వ్యక్తి. ఆయనకొడుకు సర్పంచ్. "ఆయన చాల దుర్మార్గుడైన భూస్వామి, వడ్డీ వ్యాపారి. మాతక్తాన్ని నీరుగా మార్చాడు. ఆయన పుంసత్వంపట్ల ఆయనకెంతో అహంకారం. కనీసం ముగ్గురు వివాహితస్త్రీలను మానభంగంచేసాడు. వారిలో ఒక స్థానిక చాకలి భార్యకూడ వుంది. తన భార్యను బలవంతం చేస్తున్నపుడు పట్టుకొని అడ్డగించాడు కనుక తర్వాత ఆ చాకలి చంపివేయబడ్డాడు. మా పోరాటాలను బలపరచినందుకు మా గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుణ్ణికూడ చంపించే ప్రయత్నం చేసాడు "అని ఒక గ్రామస్తుడు చెప్పాడు. ఆ గ్రామస్తులతో ఇంకా వివరాల్లోకి వెళ్ళి లోతుగా ఆరాతీస్తే ఇంకొక విషయం బయటపడింది అంతయ్య స్వయంగా తన ఒక కోడలుతో అక్రమ సంబంధం పెట్టుకొన్నాడని కొడుకే అతన్ని చంపించాడని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. కాని ఆ కుటుంబం ఎంత శక్తివంతమయిందంటే పోలీసులు ఆ కుటుంబంలో ఎవరిపైనా ఏ నేరమూ ఆరోపించడానికి సాహసించలేరు." ఇవీ

తెలంగాణలో భూస్వాముల స్వభావచిత్రాలు. ఇది 1975లో కూడ కొనసాగిన భూస్వాముల దురంతానికి ఉదాహరణ అయినపుడు తెలంగాణలోకల్లా వెనుకబడిన ఆదిలాబాదు జిల్లాలో 1970లో లచ్చుపటేల్ అనే భూస్వామి 'పేదరైతాంగంపై దుడ్డుకర్ర పెత్తనం' చేసాడనడంలో ఆశ్చర్యం ఏముంది– అబ్బాస్ ఈ యిద్దరిపక్షాన రాజకీయమయిన డిఫెన్స్ చేసాడు.

'అసలు వీళ్ళు ఏనేరమూ చేయలేదనికూడ చెప్పవచ్చును. అది సంభవంకూడ. వీళ్ళు రాజకీయ కార్యకర్తలు. ఈ వ్యవస్థను తిరస్కరించినవాళ్ళు జమీందార్లచే పోలీసులచే ద్వేషించబడ్డవాళ్లు- జమీందార్లను 'రూపుమాపాలని' (లిక్విడేటింగ్- చంపుట అనే మాటకూ దీనికి చాల తేడావుంది- కె. ఎ. అబ్బాస్) వాళ్లు అని వుంటారు. అభ్యంతరకరమైన వాళ్ళ రాజకీయాలవల్లనే వాళ్ళను ఈ కేసులో యిరికించివుంటారు భారతదేశంలో యింకా యితరచోట్లకూడ యిటువంటివెన్నో జరిగాయి. చాల తెలివయిన, సమర్థులైన న్యాయవాదులుమాత్రమే నిజమేమిటో తవ్వితీయగలరు. పాపమూ గ్రామస్తులకు అలాంటి న్యాయవాదులు ఎక్కడ దొరుకుతారు.

అయితే హైకోర్టు వీరిపై మరణ శిక్షను ఖాయపరచిన తర్వాత వీళ్ళ కేసు వెలుగులోకి వచ్చి వీరి పక్షాన సమర్థులైన న్యాయవాదులే పనిచేసారు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, నక్సలైట్స్ డిఫెన్స్ కమిటి వీళ్ళ ఉరిశిక్షల రద్దుకోసం ప్రజాభిప్రాయాన్ని సంఘటితం చేయడంలోనూ, చట్టంలోని అవకాశాలు వాడుకోవడంలోను చేయగలిగినంత కృషిచేసింది. వైఫల్యమేమయినా లోపమేమయినా వుంటే అది మొత్తంగా ప్రజాతంత్ర ఉద్యమమే బాధ్యత వహించాల్సి వుంటుంది.

భూమయ్య కిష్టాగౌడ్‌లు చేసిన చర్యలను గాఢమైన రాజకీయ ఉద్దేశాలతో చేసిందిగా గుర్తించాలని దోపిడీ సాంఘిక ఆచరణలేని సమాజం కొరకు అది వ్యక్తీకరణమని దానిని వ్యక్తిగత నేరంగా తీసుకోగూడదని వాళ్ళ న్యాయవాదులు వాదించారు. భారత రాజ్యాంగంలో రూపొందించబడిన, యివ్వబడిన హామీలు విఫలమయినప్పుడు హింసద్వారా సామాజిక ఆర్థిక న్యాయాన్ని నెలకొల్పుటకు ఉద్దేశించిన తీవ్రమైన ఆకాంక్షతో చేయబడిన రాజకీయ చర్యగా దీనిని గుర్తించాలని వాళ్ళన్నారు. అందువల్ల ఈ నేరానికి సంబంధించిన రాజకీయాంశాన్ని పరిగణనలోకి తీసుకొని ఇందులో వ్యక్తులను వ్యక్తులుగా మామూలు నేరస్తులుగా చూడకూడదన్నారు

ఈ 'నేరా'నికి సంబంధించిన రాజకీయాంశాన్ని లారెన్స్ లిఫ్‌షుల్జ్ ఇట్లా వివరించాడు. "ఆంధ్రప్రదేశ్‌లోని విస్తృత గిరిజన ప్రాంతమైన శ్రీకాకుళం జిల్లాలో

నక్సలైటు ఉద్యమం 1970లో ఒక ఉన్నత శిఖరానికి చేరుకొని చాల గ్రామాలలో ఎర్ర అధికారం వాస్తవంలో బీజరూపం పొందిన కాలంలో ఈ సంఘటన జరిగింది. ఆ కాలంలో ప్రభుత్వం తరచుగా గెరిల్లా దళాల చర్యలకు గురి కావలసి వచ్చింది. శ్రీకాకుళంలో ఎక్కువ ప్రాంతం వాస్తవానికి ప్రభుత్వ యంత్రాంగం అదుపు తప్పి పోయింది. ఈ నేపథ్యంలో చూసినపుడు సెషన్స్‌జడ్జి వాళ్ళకెందుకు ఉరిశిక్ష వేశాడో హైకోర్టు ఎందుకు ధృవీకరించిందో సులభంగానే గ్రహించవచ్చు. తిరిగి ఎమర్జెన్సీలోనే అది ఎందుకు అమలయిందో కూడ అర్థం చేసుకోవచ్చు.

అక్టోబర్ 3, 75న సుప్రీంకోర్టు వీళ్ళ ఉరిశిక్షలపై డిఫెన్సు కమిటీ వేసిన రిట్‌పై తీర్పు యిచ్చింది. న్యాయమూర్తి కృష్ణయ్యర్ మామూలు హత్యల నుండి రాజకీయ నేరాలను స్పష్టంగా వేరుచేసి చూడాలనే అంశాన్ని అంగీకరించాడు. కాని "ఏ శిక్షాస్మృతిని మేము ప్రమాణంగా స్వీకరించి అమలుపరుస్తున్నామో అది అటువంటి వర్గీకరణ చేయడం లేదు. తక్షణ సంస్కరణలపై మా ఉద్దేశాలు ఏమున్నా చట్టాన్ని మేము తిరిగి రాయలేము." కోర్టు సానుభూతి ఈ కామ్రేడ్స ప్రాణాలను రాష్ట్రపతి చేతుల్లో పెట్టడానికే పనికొచ్చింది.

"ఒక క్షమాభిక్ష పత్రం ఒకసారి నిరాకరించబడినంత మాత్రాన అది రాష్ట్రపతికి గాని, గవర్నర్‌కుగాని వున్న క్షమాభిక్షాధికారాన్ని రద్దుచేసినట్లు కాదు. ఈ నేరానికున్న రాజకీయ స్వభావాన్నీ చాల దేశాలలో మరణశిక్ష రద్దుచేసిన అంశాన్నీ రాష్ట్రపతి దృష్టికి తేవాలి. శతాబ్దాలుగా సమాజం చట్టబద్ధ హత్యలకూ, క్రూరమైన రూపాలకూ దూరమవుతూ వస్తున్నది. ఒక చెంచాను దొంగిలించినందుకు 13 సంవత్సరాల పసివాణ్ణి ఉరితీయడానికి అవకాశమున్న 1801 నాటి ఇంగ్లాండు దశనుంచి శిక్షాస్మృతి దాదాపు విప్లవాత్మకమైన మార్పు పొందింది." కాని దేశంలో కంకులు దొంగతనం చేసారని, ఇంట్లో చిన్నచిన్న సొమ్ములు చిల్లర డబ్బులు దొంగతనం చేసారని హరిజన బాలురను, బాలికలను చెట్లకు కట్టివేసి హృదయవిదారకంగా కొట్టి చంపిన సంఘటనలు గానీ, ఆదివాసులను నాగలికి పశువులవలె కట్టి అరకతోలిన ఫ్యూడల్ ఆటవిక తత్వం గానీ కృష్ణయ్యర్‌కు గుర్తుకు వచ్చినట్లు లేదు. "న్యాయశాస్త్ర హృదయంలో నునువెచ్చని మానవత్వ ముండాలి. మొండిక్రౌర్యం కాదు." అని అంటున్న న్యాయమూర్తి తనను మానభంగం చేయ ప్రయత్నించిన దుర్మార్గుణ్ణి ఆత్మరక్షణకోసం చంపేసిన యువతికి ఉరిశిక్ష వేయడాన్ని యెట్లా సమర్థిస్తాడు. మొదటిసారి (నవంబర్ 26) రెండవసారి (మే 11) ఉరిశిక్షల తేదీలు నిర్ణయమయి ప్రకటించినపుడు భూమయ్య

కిష్టాగౌడ్‌లు తమ కళ్ళు నేత్ర నిధికి దానం చేస్తామన్నారు. అప్పుడు సుప్రసిద్ధ చలన చిత్ర దర్శకుడు మృణాల్ సేన్ ఒక మాటన్నాడు "మన న్యాయ చట్టాల, శాంతి భద్రతల పరిరక్షకుల కన్నా వీరెంతటి మానవతావాదులో వీరి ఈ నిర్ణయం రుజువు చేస్తున్నది".

అసలు న్యాయశాస్త్రానికి చెవులేకాని హృదయం లేదని, చట్టాన్ని నిర్వచించే బుద్ధేగాని, సమాజ పరిణామాన్ని అవగాహన చేసుకునే వివేకం లేదని అనిపిస్తోంది. ఇంకదానికి "నునువెచ్చని మానవత్వ ముండాల"ని ఆశించడం అమాయకత్వమో ధూర్త లక్షణమో, అందులోనూ వర్గ సమాజంలో, అస్తిహక్కు ప్రాథమిక హక్కుగా భూస్వాములకు రాజ్యాంగం గ్యారంటీ చేసినపుడు, ఆ భూస్వాములతో భూపోరాటంలో తలపడుతున్న పేదల ప్రాణాలు కాపాడడం కోర్టువల్ల సాధ్యమేనా?

అబ్బాస్ చెప్పినట్లుగా "దేశంలో అశేష ప్రజానీకంగావున్న పేదలు, హక్కులు లేనివాళ్లు, వీళ్ళకు వ్యతిరేకంగా న్యాయశాస్త్రపు త్రాసు ఎక్కువగా మొగ్గుతున్నదనేది వాస్తవం" ధనికులకూ పేదలకూ వచ్చినవివాదంలో పేదలు న్యాయం పొందడమనేది చాలా అరుదైనవిషయం. ఈ న్యాయశాస్త్ర యంత్రాంగమే పేదలు అందుకోడానికి కూడా అందనంత 'విలువయినది.' న్యాయశాస్త్రంకూడా ఉన్నతవర్గాల విలాసవస్తువుగా వున్నది. రోజూ మనం పత్రికల్లో- గుడిసెలల్లో పేలాలవలె మాడిపోయిన హరిజనులగురించి ఉన్నతవర్ణ హిందువులచేత కళ్ళు పెరికివేయబడిన దళితులగురించి చదువుతూవుంటాం. కాని ఎప్పుడయినా యింత నీచమైన నేరాలకు ఈ ఉన్నతవర్గాలవారిని గాని- వర్ణాలవారినిగాని శిక్షించినట్లు, కనీసం అదుపులోపెట్టినట్లు మనమెక్కడైనా చదువుతామా? తమిళనాడులోని కిల్వన్మణిలో కొట్టాలల్లో హరిజనులను వేసి అగ్రవర్ణాలవారు బలవంతంగా సజీవంగా దహించివేసి ఆటవిక వినోదాన్ని అనుభవిస్తే "అగ్రవర్ణాలకు చెందిన వాళ్ళ సంస్కారం యింత క్రూరమైన దురాగతం చేస్తుందని మేం విశ్వసించలేకపోతున్నాం" అని తీర్పు చెప్పిన తమిళనాడు హైకోర్టు కోర్టుల స్వభావానికి సాక్ష్యంగా కవిపించడంలేదూ?

అందుకే భూమయ్య, కిష్టాగౌడ్‌లకు మరణశిక్ష విధించిన కేసుల్లాంటివే, యిటువంటి వాస్తవాలతో కూడినవే ఉన్నత వర్గాలకు చెందిన వాళ్ళకు సంబంధించికూడా ఎన్నో వుండివుంటాయి వారిలో ఏ ఒక్కరయినా ఇటువంటి శిక్ష విధించారేమో ఒక్కటి చూపమని అడుగుతున్నాడు అబ్బాస్. చూపలేనప్పుడు దేశంలో నిరసన, తిరుగుబాటు, అశాంతి, హింస తప్పని వాతావరణం నెలకొని వున్నట్టే ప్రకటించని వర్గయుద్ధం కొనసాగుతున్నట్లే అని కూడా ఒప్పుకుంటున్నాడు అబ్బాస్.

ఈ విచారణతో సన్నిహితంగా సంబంధం వున్నవాళ్ళను ఆందోళన పరిచిందీ ఆశ్చర్య పరిచిందీ ఏమంటే భారత రాష్ట్రపతి ఇటువంటి కేసులకు లోగడ క్షమాభిక్ష ఇచ్చి భూమయ్యా కిష్టాగౌడ్‌లకు ఎందుకు ఇవ్వలేదు? రెండు సంవత్సరాలకింద మాత్రమే సుప్రసిద్ధమైన నాగభూషణం పట్నాయక్ కేసులో నలభై సంవత్సరాల న్యాయవాది భారత కమ్యూనిస్టుపార్టీ (మా-లె) నాయకుడైన ఆయన విషయంలో క్యాబినెట్ నిర్ణయాన్ననుసరించి రాష్ట్రపతి మరణశిక్షను యావజ్జీవ శిక్షగా మార్చాడు. ఒక భూస్వామి చనిపోయిన గెరిల్లాదళ చర్యలో పట్నాయక్ పాల్గొన్నాడని ఆరోపణ.

ఆయన వ్యక్తిగతంగా విచారణ సమయంలో వాదించుకోవడానికిగాని, న్యాయవాదిని పెట్టుకోవడానికిగాని నిరాకరించాడు. క్షమాభిక్ష కోరలేదు. ఆయన కొరకు క్షమాభిక్షను సాధించడంలో యితరులు కృతకృత్యులయ్యారు.

ఇటీవలనే షమీమ్‌రహ్మానీ అనే స్త్రీకి ఉత్తరప్రదేశ్ గవర్నర్ క్షమాభిక్ష పెట్టినాడు. ఆమె చేసిన హత్య రాజకీయ స్వభావం కలిగిందేమీకాదు. ఆమె తన ప్రియుడిని చంపింది. ఆమె ఉన్నత వర్గాల్లో పుట్టినందువల్ల చాలా ఉన్నత స్థాయిలో రాజకీయ సంబంధాలు వుండడం అనేది నిశ్చయాత్మకమైన అంశమైంది. ఉన్నత వంశాలలో పుట్టి కళాశాలల్లో చదువుతుని విప్లవకారులుగా మారిన ప్రతిభావంతులైన యువకులకు వుండే గ్లామర్ (ఆకర్షణ) ఏదీ భూమయ్యా-కిష్టాగౌడ్‌లకు లేదు ఇద్దరూ పేద రైతులు. ఒకాయన వృత్తి చేత జంగం. ఇంకొకాయన గౌడు ఎవర్ని కదిలిస్తే తమ పని అవుతుందో వాళ్ళకు తెలియదు. భారత రాజధానిలో కొంతమంది నిస్పృహతో వ్యాఖ్యానించినట్లుగా పార్లమెంటును కదిలించి చట్టాన్ని తమ కనుకూలంగా సవరింపచేసుకోగల శక్తికూడా వాళ్ళకు లేదు.

ఈ సంప్రదింపులలో పాత్ర వహించి వాళ్ళ క్షమాభిక్ష కోరిన ఒకవ్యక్తి చెప్పినదాని ప్రకారం హోం మంత్రిత్వశాఖ వీరిని రాజకీయ ఖైదీలుగా వర్గీకరించడానికి నిరాకరించింది కాబట్టే వాళ్ళకు క్షమాభిక్ష నిరాకరింపబడింది. వాళ్లు రాజకీయ ఖైదీలు ఎందుకు కాదంటే వాళ్ళిద్దరూ అవిద్యావంతులు దాదాపు నిరక్షరాస్యులు. కొంతమంది అధికారుల తర్కం ప్రకారం నాగభూషణ పట్నాయక్‌వలె వాళ్లు మేధావులు కాదు. అందువల్ల వాళ్లు రాజకీయోద్దేశాలతో ఈపని చేశారని అనుకోవడానికి వీలులేదు. ఇదే అభిప్రాయం ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ఫెర్నాండెజ్ ముందు వ్యక్తం చేసాడట.

నిజానికి యీ ఇద్దరి గత చరిత్రకూడా యీ వాదానికి భిన్నమైనది. వీళ్ళిద్దరు కూడా కమ్యూనిస్టుపార్టీ నడిపించిన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో రాజ

కీయంగా క్రియాశీలంగా పాల్గొన్నారు. ఆ ఉద్యమ సందర్భంలో కిష్టాగౌడ్ రెండు సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించాడు".

మొదటి రెండుసార్లు ఉరిశిక్ష తేదీలు నిర్ణయమైనప్పుడుకూడా భూమయ్య, కిష్టాగౌడులు తమ కళ్ళు నేత్రనిధికి దానంచేయాలనుకున్నారు. అప్పుడు అబ్బాస్ "వాళ్ళనొకవేళ ఉరితీస్తే వాళ్ళ కళ్ళుంటాయి. అవి నిన్నూ నన్నూ కనిపెడూనేవుంటాయి. ప్రతిక్షణం మన చర్యలను కనిపెడ్తూనేవుంటాయి. ఈ రెండు మానవజీవితాలకు జరుగబోతున్నదానిపట్ల మనం ఉదాసీనంగా ఉండగలమా?" అంటూ ప్రశ్నించాడు.

కాని ఎమర్జెన్సీలో వాళ్ళను ఉరితీసేముందు ముషీరాబాద్ జైల్లో రెండువందలమందికి పైగా రాజకీయఖయిదీలున్నారు. వాళ్ళు ఈ దానంచేసేకళ్ళు రేపు ప్రభుత్వం ఎవరికి ఉపయోగిస్తుందో తెలియనప్పుడు అందులో ముఖ్యంగా యిటువంటి వైద్య సదుపాయాలు కేవలం సంపన్నవర్గాలకే ఒనగూర్చే సేవ ప్రభుత్వంచేస్తున్న వ్యవస్థలో నేత్రదానం చేయడం ఒట్టి ఆదర్శవాదం అవుతుందని సలహాయిచ్చారు. భూమయ్య, కిష్టాగౌడ్ల ప్రాణాలు లేవిప్పుడు. కళ్ళూలేవు. కాని భూమయ్య, కిష్టాగౌడులను ఉరితీస్తుంటే చూచినకళ్ళు, వాళ్ళ ఉరిగురించివిన్న కోట్లాది ప్రాణాలున్నాయి అంతకన్న ముఖ్యం వాళ్ళ చైతన్యంతోనే భవిష్యత్తులోకి చూస్తున్నకళ్ళు. అటువంటి దీక్షతోనే ప్రాణాలకుతెగించి పోరాడుతున్న ప్రాణాలు వున్నాయి. అవి ఎమర్జెన్సీ చీకటి తెర మాటున ఆ రెండు ప్రాణాలను బలితీసుకున్నప్పుడు విలవిలలాడిపోయాయి. కంజు కన్నీరెట్టింది. నెమలి నాట్యంమానింది. జింకా, లేడి కుమిలి కుమిలి ఏడ్చాయి. కాడు బర్రె బావురుమన్నది. అడవి గోరింతాకు వడలిపోయింది మోదుగుపూలు వాడిపోయాయి. అడవి హడలిపోయింది. వాగు జలజలా వలవలాఏడ్చింది. పల్లెతల్లి గొల్లుమన్నది. భూమయ్య, కిష్టాగౌడుల చట్టబద్ధహత్యకు పంచభూతాలేకాదు ప్రపంచ పీడితప్రజల పంచప్రాణాలు సాక్ష్యంగా వున్నాయి.

అప్పీలు సందర్భంలో పౌరహక్కుల సంఘం ఈ కేసును డాస్టోవస్కీ కేసుతో పోల్చింది. అతని మరణశిక్షను జార్‌చక్రవర్తి ఆఖరిక్షణాల్లో రద్దుచేసాడు. 'భారత సార్వభౌమిక గణతంత్ర ప్రజాస్వామ్యం'కన్న జార్ నికొలస్ కరుణాళువు. దయామయుడు అనిపించుకోకూడదు అని ఈ కమిటీ ప్రధానికి, రాష్ట్రపతికి విజ్ఞప్తి చేసింది; కాని "భారత సార్వభౌమిక గణతంత్ర ప్రజాస్వామ్యం" "భారత సార్వభౌమిక గణతంత్ర సామ్యవాద ప్రజాస్వామ్యం"గాకూడ మారిన తర్వాత సామ్యవాదంకోసం పోరాడిన ఈ 'భూమ్యాకాశాల'ను ఉరితీసింది. పాపం, పౌరహక్కుల సంఘం కోరికను ఈ యిద్దరి విషయంలోనేకాదు అసలు ఒక ప్రజాతంత్ర హితైషి ఆకాంక్షగాకూడ ఆ రాష్ట్రపతీ మన్నించలేదు. ఆ ప్రధానీ గౌరవించలేదు. రెండునెలలయినా విండకుండానే ఎమర్జెన్సీని విధించి మొత్తం దేశప్రజల విషయంలోనే 'ఇంతకన్నా బ్రిటిష్‌పాలన మేల'నిపించింది. ఎమర్జెన్సీ ప్రకటనమీద సంతకంచేసిన రాష్ట్రపతి భూమయ్య

కిష్టాగౌడుల మరణశాసనంపై సంతకంచేయడంలో ఆశ్చర్యంలేదు. ఎమర్జెన్సీకాలమంతా జనం పాపం జార్ నికోలస్‌ను తలచుకోలేదు. హిట్లర్‌ను తలచుకున్నారు. బహుశా ఆయనొక్కడే సాటివచ్చే "భారత సార్వభౌమిక గణతంత్ర సామ్యవాద ప్రజాస్వామ్యా"న్ని అమలుచేసింది ఇందిరాగాంధీ.

'ఏదో చారిత్రకమైన పొరపాటువల్ల ఫక్రుద్దీన్‌అలీఅహ్మద్, ఇందిరాగాంధీలను ఉరితియ్యడం జరిగితే.........' (ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ మరణించాడు......... ఎమర్జెన్సీ ప్రకటనపై సంతకం చేసినందుకో, అలాంటి అమానుషమైన ఇందిరాచర్యల నన్నింటినీ రబ్బరుస్టాంపులా ఆమోదించినందుకో క్షోభపడి చచ్చిపోయాడని అనుకుంటున్నారు కొందరు. చచ్చినాడు గనుక ఆయన సంగతి అలా వుంచుదాం ఇపుడు ఇందిరాగాంధీని ఉరితియ్యడం అన్నది చారిత్రక పొరబాటుకాదు. ఆమె దేశ ప్రజలకు చేసిన ద్రోహానికి నేరాలకు ఉరి తియ్యకపోవడం చారిత్రక నేరమౌతుంది.) 'జరిగితే ..... ఎక్కడో అలాస్కాలోవున్న ఎస్కిమోలు పట్టించుకోక పోవచ్చును.' (ఇపుడు ఇండియానే ఇందిర. ఇందిరానే ఇండియా అనుకున్న ఈ దేశంలో కూడ ప్రజలు ఎవ్వరూ పట్టించుకోరు, ప్రజలేమనుకుంటున్నారో తమిళనాడు, కర్నాటక ప్రజలు తమ ఆగ్రహావేశాలతో రుచి చూపారు.) 'అలాగే భూమయ్య కిష్టాగౌడులను ఉరితీస్తే అహ్మద్ ఇందిరాగాంధీలకు చీమకుట్టినట్లయినా వుండకపోవచ్చును. (భగత్‌సింగ్‌ను ఉరితీస్తే గాంధీజీ ఉలికాడా పలికాడా? పైగా రాజకీయ హింసాపంథాను తాను ఆమోదించలేనన్నాడు.) '......కాని ఒకప్పుడు సక్కో–వాంజెట్టీలను ఎలక్ట్రిక్ కుర్చీలపై ఎక్కించి అమెరికా ఆర్జించుకున్న అప్రతిష్టకు ఏ మాత్రమూ తగ్గిపోదు. ఇండియా ఈనాడు భూమయ్య కిష్టాగౌడులను ఉరితీస్తే' అని 12–5–75 న అన్నాడు శ్రీశ్రీ. అమెరికాలో ఒక ఉరిశిక్షపడిన వ్యక్తి విషయంలో అతన్ని ఎలక్ట్రిక్‌కుర్చీలో కూర్చుండబెట్టి బటన్ నొక్కే సమయానికి విద్యుత్ప్రసార మాగిపోయింది. విద్యుత్ ప్రసార మాగిపోయినందువల్ల అతనట్లా బతికినపుడు అతనిమీద ఇంకా 'మరణశిక్ష' అమలు చేసే వీలులేదని ఎందువల్లనంటే అన్నివిధాల అతడు 'మృత్యుబాధ' ననుభవించాడని అమెరికన్ సుప్రీంకోర్టులో వాదించి నెగ్గాడు ఒక న్యాయవాది. ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ డిఫెన్స్ కమిటీకూడ అమెరికన్ సుప్రీం కోర్టు ఈ విషయంలో యిచ్చిన తీర్పును ముందుపెట్టి నవంబర్ 26న ఒకసారి మే 11న ఒకసారి దాదాపుగా మృత్యుముఖంలోకి వెళ్ళివచ్చిన ఈ ఇద్దరినీ 'వాయిదాల పద్ధతి'పై చంపే హక్కు ప్రభుత్వానికి లేదని, వాళ్లు 'మరణబాధ'ను అనుభవించినట్లేనని వాదించారు. కాని మరణించేదాకా వాళ్ళ గొంతులకు ఉరిబిగించమనే తీర్పుముందు ఇవన్నీ బధిర శంఖారావాలేఅయ్యాయి. రోజెన్‌బర్గు దంపతులను ఉరితీసిన అమెరికాకు జూలియస్‌ఫ్యూజిక్‌ను ఉరితీసిన హిట్లర్‌కు భగత్‌సింగ్‌ను ఉరితీసిన బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి, కయ్యూరు కామ్రేడ్స్‌ను ఉరితీసిన నెహ్రూకు ముద్దుబిడ్డ ననిపించుకున్నది ఇందిరా నెహ్రూ గాంధీ

తెలంగాణ సాయుధ పోరాట కాలంలో కిష్టాగౌడ్ తొడకు బుల్లెట్ గాయమయినప్పుడు గొల్లోల్ల సిన్నమ్మ పాలు తాపిందట, కురుమోడు, గొండోడు గటుక తెచ్చారంట. పరదామ పరమేసు పసరు పోసిండంట, మన్నెపు మామయ్య కట్టుగట్టిండంట. నల్లపిట్టలు కల్లీపళ్లు తెచ్చాయట. అల్లిపిట్టలు చల్లగాలి విసిరాయట. గోగురిచ్చ వచ్చి గోము చేసిందంట. పైడికంటి వచ్చి పదమూ పాడిందట. కిష్టాగౌడ్ కళ్ళు తెరిచి నవ్వి లేచి నిలుస్తే అడవి అలలుగా లేచిందట, పల్లె పల్లవించిందట. ఎందువల్ల? అతడు మిత్రులకు ప్రాణం శత్రువుపై బాణం. ప్రజల ఒరలోని ఖడ్గం. పల్లెచేతిలో బల్లెం. అడవి గుండెలో గీతం. కల్లాకపటం లేదు. ఏమిటి అతనివల్ల నేరం? అతడు కిష్టాగౌడ్ కాదు, అతడు ఈ దేశంలోని కష్టజీవి ఎవరైనా కావచ్చు. అతడు ఈ దేశమనే తోటకొరకు ముళ్ళ కంచె నరికి, దుమ్ము దూసర వూడ్చి, కలుపు మొక్కలు ఏరేసి, దున్ని సాగుచేసి, నెత్తురు చెమటగా పాదుచేసి నీరుపోసి ఫల పుష్పాలు పండించిన తోటమాలి.

ఇవ్వాళ భూమయ్య కిష్టాగౌడులను మళ్ళీ మనం బతికించుకోలేకపోవచ్చు. అలాంటి వందలాది మృతవీరులను బతికించుకోలేక పోవచ్చు. కాని మనిషి నెత్తురు మరిగి మత్తెక్కివున్న శత్రువుపై ప్రతీకారం తీర్చుకొనడానికి గొల్లోల్ల సిన్నమ్మను, కురుమోన్ని గొండోన్ని పరదాపు పరమేసునూ, మన్నెపు మామయ్యనూ కోట్లాది కష్టజీవులను కూడగట్టాల్సివున్నది. సంజమాటునదాగి పంజావిసిరిన చీకటిపులినుంచి ఉజ్వల భవిష్యత్తును కాపాడుకోవలసి వున్నది, భూమయ్య కిష్టాగౌడులకు, కయ్యూరు వీరులకు, భగత్‌సింగ్‌కు, రోజెన్‌బర్గ్ దంపతులకు, జూలియస్ ఫ్యూజిక్‌కు ఉరి వేయగలిగిందేకాని వారి ఉన్నతమైన ఆశయాలకు ఈ దోపిడీవ్యవస్థ ఉరివేయగలదా?

'వేట మృగం'

జంపాల చంద్రశేఖరప్రసాద్ రెండవ వర్ధంతి(5-11-77)సభలో హైదరాబాదులో మాట్లాడుతూ జంపాల ప్రసాద్, నీలం రామచంద్రయ్య, జనార్దన్, రామనర్సయ్యలాంటి మూడువందల డెబ్బయి మంది విప్లవకారులను చంపివేసిన జలగం వెంగళరావుకు మనమే శిక్ష వేయాలి? అని ప్రశ్నించుకొని "భూమయ్య కిష్టాగౌడుల ఉరిశిక్షల రద్దువిషయంలో మనం ఉద్యమించినపుడు అసలు మొత్తంగా ఉరిశిక్షనేదే శిక్షాస్మృతిలో ఉండకూడదన్నాం. ప్రజాతంత్రవాదులుగా మన వైఖరి ఎప్పటికీ అదే. ఐతే వెంగళరావును ఏంచేయాలి? ఉరితీయొద్దు. ఆయనే ప్రారంభోత్సవంచేసిన ఇందిరాప్రియదర్శినీపార్కులో మధ్యయుగాలనాటి ఆటవిక హంతక ప్రవృత్తిగల ఒక క్రూరమృగం అనే బోర్డుకట్టి ఒక బోనులోపెట్టి మన పిల్లలకు చూపాలి" అన్నాడు విరసం కార్యవర్గసభ్యుడు, రాష్ట్రపౌరహక్కుల సంఘం కన్వీనర్ వై. కాశీపతి.

పశ్చిమ బెంగాల్ జైల్లో

ఉరికంబంపై ఇరవై ఏళ్ళ విప్లవనారి మొలీనాధక్

పశ్చిమ బెంగాల్‌లో జ్యోతిబసు "వామపక్ష ప్రభుత్వం" ఏర్పడడమూ మొలీనాధక్ అనే ఇరవై సంవత్సరాల నక్సలైట్ యువతికి బర్ద్వాన్ జిల్లా జడ్జి ఉరిశిక్ష విధించడం ఒకేరోజు జరిగాయి. ఈ ఉరిశిక్ష విధించింది సెషన్స్‌కోర్టు కాబట్టి హైకోర్టు దీనిని ధృవీకరించాల్సి వున్నది అనే విషయం యదార్థమే అయినప్పటికీ పౌరహక్కుల పునరుద్ధరణ. రాజకీయ ఖైదీల విడుదల అనే నినాదం మీద ఎన్నికలు గెలిచిన మార్క్సిస్టు పార్టీకి మొలీనాధక్, ఉరిశిక్షలు పడివున్న ఇంకా ఐదుగురు రాజకీయఖైదీల ఉరిశిక్షలు రద్దుచేసి విడుదల చేయడమైనా ఇతర రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయడమైనా చట్టసంబంధమైన ఒక జటిల సమస్యగా ఇంకా మిగిలివున్నదంటేనే అది దాని ద్వంద్వనీతికి దాఖలా. మొలీనాధక్ ఇప్పుడు దేశంలోని ప్రజాతంత్రవాదులందరి ప్రజాస్వామిక చైతన్యానికి, దీక్షకు, నిర్మాణానికి సవాల్‌గా బెంగాల్‌లోని ఒక జైల్లో ఉరికంబంపై నిలిచివున్నది.

వరి ఎక్కువగా పండే సింకూరా జిల్లాలోని విష్ణుపూర్‌కు 25 కి మీ. దూరంలో సుక్‌జోరో అనే చిన్నగ్రామం మొలీనా జన్మస్థలం. మొలీనా తండ్రి సురేంద్రనాథ్‌ధక్ ఊళ్ళో బడిపంతులు. మొలీనా 1971లో హెచ్.ఎస్.సి. పాసయింది. బగ్దీలు అనబడే గిరిజనజాతి (షెడ్యూల్డ్‌ట్రైబ్)కి చెందింది ఆ కుటుంబం. మొలీనాధక్‌ను ప్రభావితం చేసింది ఆమె పెద్దన్న అనిల్‌ధక్. అతడు వ్యవసాయశాస్త్ర పట్టభద్రుడై సింద్రీలోనూ బంకూరాలోనూ పనిచేశాడు. మొదట ఎంతో బిడియపడుతూ ఇతరుల ఇండ్లల్లో తినడానికి కూడా సంకోచించే అనిల్ నిమ్న జాతులపై జరిగే దోపిడీపీడనలు చూసి తీవ్రంగా చలించిపోయాడు. లెనిన్ సాహిత్యం చదివి పూర్తిగామారిపోయాడు.

అన్నదగ్గర వుండడానికి వెళ్లిన మొలీనాకూడా ఆయన భావాలతో ప్రభావితమైంది తరువాత కొద్ది రోజులకే ఇద్దరూ రహస్య జీవితానికి వెళ్లిపోయారు. అనిల్‌కుమార్ బిస్వాస్ అనే "రెనగేడ్"ను "పోలీస్ ఇన్ఫార్మెంట్"ను "ఖతం" చేసిన తర్వాత, మార్చి 31, 1976 న మొలీనాధక్ అరెస్టయ్యింది. అనిల్‌ధక్ ఇంకా రహస్య జీవితంలోనే వున్నాడు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అతనిపై వారంట్ ఉపసంహరించుకోలేదు. 1975లో తండ్రి చనిపోయాడు. తల్లి శ్రీమతి ధక్ 62 సంవత్సరాల వృద్ధురాలు. భర్తమరణం, ఉరికంబంపై కూతురు ఒకతల్లిని ఎంతగా చలింపజేస్తాయో ఊహించవచ్చు. కాని తల్లి తనను కలిసినప్పుడు సహజమైన మమకారంతో మొలీనా కళ్లు ఆర్ద్రమైనప్పటికీ దృఢమైన విశ్వాసంతో తానేం చేసినా తన దేశంకొరకే చేశానని

తనకోరకు కాదని చెప్పింది. ఆమె ముఖంపై భయమూ, పిరికితనమూ ఛాయలుకూడ లేవు దృఢమైన ఆత్మవిశ్వాసం తప్ప. ఆమె తల్లికి హైకోర్టులో అప్పీలు కూడా వేయ వద్దని చెప్పింది.

ఈమె ఉరిశిక్ష రద్దు చేయాలని జయప్రకాశ్‌నారాయణ్, చంద్రశేఖర్‌లు ప్రక టించేదాకా బెంగాల్ జైల్లో అందునా "వామపక్షఫ్రంట్" అధికారంలో వున్న రాష్ట్రంలో ఒక స్త్రీ అందునా రాజకీయ ఖైదీ ఇటువంటి శిక్ష పడివున్నదని వుంటుందని ఈ మూల ఎవరూ ఊహించలేదు. బహుశా భారతదేశం జైళ్ళలో ఇంత దారుణమైన శిక్ష నెదు ర్కొంటున్న మొదటి రాజకీయ స్త్రీ ఖైదీ ఈమె ఒక్కతే

పశ్చిమ బెంగాల్‌లో మార్క్సిస్టు పార్టీ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ ప్రభుత్వంలో జైళ్ళ మంత్రి రెవల్యూషనరీ సోషలిస్టుపార్టీ నాయకుడు దేవ బ్రతబంధోపాధ్యాయ జెయిలుకు వెళ్ళి ఆమెను కలిసాడు. కలిసి తన అనుభూతిని యిలా వ్యక్తం చేశాడు.

"ఆమెతో గంజికొట్టులో నా సమావేశం నాకొక అపూర్వమైన అనుభవం. ఆ అనుభవం నా జీవితాంతమూ ఎంతో విలువయిందిగా భావించుకుంటాను. నేను పశ్చిమ బెంగాల్‌లో వున్న ఐదు జైళ్లు చూసాను. అందులో నక్సలైట్ ఖయిదీలనందరినీ కలిసాను. కొందరు ఇతర స్త్రీ ఖయిదీలను చూసాను. అమానుషమైన దుర్భరమైన జెయిలు పరిస్థితుల్లో వాళ్ళు జీవిస్తున్నప్పటికీ ఎవరూ తమ కొరకు ఏమీ అడుగలేదు. సాధారణ ఖయిదీలకు ప్రభుత్వం మంచి సదుపాయాలు కలిగించాలని మాత్రం డిమాండు చేసారు.

"నేను మొలీనాను ఆమె ఇతర సహచరులను కలిసినందుకు గర్విస్తున్నాను. ఈ రోజుల్లో అటువంటి దృఢమైన విశ్వాసాలూ ధైర్యమూ వున్న వ్యక్తులు అరుదుగా వుంటారు."

ఆమె ఏం చేసింది? 1970 తొలిరోజుల్లో దుర్గాపూర్ ఉక్కు నగరానికి సమీ పంలో కాన్యా గ్రామంలో భూమిలేని నిరుపేద కూలీలయిన సంతాల్ ప్రజలలో నక్స లైట్లు ఉద్యమాన్ని నిర్మించారు. మొలీనా, ఆమె కామ్రేడ్స్ వారి మధ్యన పనిచేసారు. ఆమె పార్టీ సహచరుడు శాంతిమయ్ అఖరే. వయస్సు 22 సం॥లు.

మొలీనాథక్, శాంతిమయ్ అఖరే సిపిఐ ఎంఎల్ కార్యకర్తలు. వాళ్ల పని చేస్తున్న గ్రామంమీద పోలీసుల నిఘాయే కాకుండా దాడులుకూడ ఎక్కువ కావడంతో

వాళ్ళు దుర్గాపూర్ పట్టణంలో వున్న పార్టీ సానుభూతిపరుల ఇళ్ళలో ఆశ్రయం తీసుకోవడం ఆరంభించారు. మొలీనా చెప్పిన ప్రకారం అంతకుముందు పార్టీ సానుభూతిపరుడుగా వుంటూ సహాయం చేస్తున్న ఒక కార్మికుని ఇంటికి ఆమె ఒకరోజు ఆశ్రయానికి వెళ్ళింది. అతడు కొత్తగా పెళ్ళిచేసుకొని భార్యప్రోద్బలంమీద పార్టీ రాజకీయాలకు దూరమవుతున్నాడు. పోలీసు ఏజెంటుగా కూడ మారాడు. కాని ఈ విషయాలు ఆమెకు అప్పుడు తెలియవు. ఆరోజు అతని భార్య లేదు. ఒంటరిగా వున్నాడు. అతడు మొలీనాను చెరచడానికి ప్రయత్నించాడు. ఇది గత సంవత్సరం జరిగింది. తర్వాత తర్వాత అతని పార్టీ వ్యతిరేక చర్యల గురించి, పోలీసులకు కూడ సమాచారం యిస్తున్న విషయమూ పార్టీకి తెలిసింది.

ఒకరోజు అతడు పనినుంచి తిరిగి వస్తూండగా అతణ్ణి మొలీనా, శాంతిమయ్ ఇంకొక వ్యక్తి చుట్టుముట్టారు. 'ఇదిగో రెనగేడ్' అని అరిచారు. మొలీనా అతని గుండెల్లో బాకు దించింది. అది పట్టపగలు. వాళ్ళు అరెస్టయ్యారు.

కోర్టులో మొలీనా, శాంతిమయ్‌లను మాత్రమే హాజరు పరిచారు. ఈ ఇద్దరూ డిఫెన్స్ పెట్టుకోలేదు. స్నేహితులూ, కోర్టూ డిఫెన్స్ విషయంలో సహాయం చేస్తామంటే నిరాకరించారు. వీళ్ళు తమ 'నేరాన్ని' అంగీకరించారని కోర్టు కథనం. కోర్టు యిద్దరికీ ఉరిశిక్ష విధించింది. కింది కోర్టు విధించిన ఈ ఉరిశిక్షలను మరికొందరిపై ఉరిశిక్షలను సెషన్స్ కోర్టులు ధృవపరిచాయి. ఇపుడింకా హైకోర్టు మాత్రమే ధృవపర్చాల్సి వున్నది. సాధారణంగా యిటువంటి కేసుల్లో హైకోర్టు ఉరిశిక్ష ధృవపరచడానికి నాలుగు సంవత్సరాలయినా పట్టవచ్చు. 1973లో ఉరిశిక్షలు విధించబడిన నలుగురు ఖయిదీల విషయంలో బెంగాల్ హైకోర్టు ఇంకా ఏమీ తేల్చలేదు.

'ఏ నేరమైనా ఆరోపించబడనీ ఏ శిక్ష అయినా విధించబడనీ రాజకీయ ఖయిదీలందరినీ బేషరతుగా వదలివేయడమే' పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ విధానమని చెప్పాడు న్యాయశాఖ మంత్రి కూడ అయిన దేవబ్రతబంధోపాధ్యాయ. అయితే మరి బారిష్టర్ ముఖ్యమంత్రి జ్యోతిబసు ఏమంటాడో- అనంతసింగ్ (చిటగాంగ్ వీరుడు) అమలేందుసేన్ (మేరీటేలర్ భర్త) కల్పనాదత్‌లాగా మొలీనా, శాంతిమయ్‌లుకూడ రాజకీయ ఖయిదీలు కాదంటాడా? అయనేమన్నా అననీ "నేను నాపార్టీ చెప్పిన పనిచేసాను. అందుకు నేనెవర్నీ దయాభిక్ష అడుగదల్చుకోలేదు' అంటున్నది మొక్కవోని విప్లవ దీక్షతో మొలీనాధక్.

సంస్మరణ :

'పెన్నూ గన్నూ పట్టిన ప్రజా కవి'

"నీ కవిత్వం కట్టిపెట్టు, సాయుధ పోరాటం మానుకో; లేదా– కాల్చేస్తాం, చంపేస్తాం" అన్నారు పోలీసులు– 1969 నవంబర్ 22న– సుబ్బారావు పాణిగ్రాహితో. ఏ అవసరాల మాట ఏమైనా– ప్రాణాల సంగతి అది! "మీ తుపాకీలతో భయపెట్ట చూస్తున్నారా, పిచ్చివాళ్ళారా! నన్ను చంపినా నా ఆశయాన్ని చంపలేరు. తరతరాల పీడనలో అణగారిగ నా మాతృభూమి రైతాంగం యివాళ సాయుధ పోరాటం సాగిస్తున్నది. విజయం చేకూరేదాకా విశ్రమించేది లేదు. నన్ను కాల్చుకో, చంపుకో. విప్లవం వర్థిల్లుతుంది" అన్నాడు ఆయన. ఆ ఉదయం– సూర్యునికి స్వాగతం పలుకుతూ ప్రాణా లర్పించిన వాళ్ళలో నిర్మల, రమేశ్‌చంద్రసాహు, అంకమ్మ, సరస్వతి ఉమారావులు కూడా వున్నారు.

చనిపోయే ముందు కొద్దికాలంగా ఆయన వ్యాధితో బాధపడుతున్నాడు. భాస్కరరావు, గణపతులను పోలీసులు కాల్చివేసిన తరువాత సోంపేట ఏరియా కమిటీ నాయకత్వ బాధ్యతను అంత అనారోగ్యంలో వుండికూడా తీసుకున్నాడు. "నా ఆరోగ్యం ఇక బాగుపడదు. రోగంతో చావడంకన్నా పోరాటంలో చావడం మేలుకదా!" అన్న అసమానమైన విప్లవకారుడు.

పార్టీని వదిలిపెట్టి తన ప్రతిభను డబ్బుచేసుకోవడాని కుపయోగించు కొమ్మని సలహా యిచ్చినవాళ్ళకు– "ప్రపంచంలో గొప్పతనంగా భావించబడేదేమైనా వున్నదంటె అది కమ్యూనిస్టుగా బ్రతకడం ప్రజలకొరకు పనిచేయడం" అని చెప్పిన పాణిగ్రాహి భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలోనే సాటిలేని కమ్యూనిస్టు.

సాయుధ పోరాటంలో చేరడానికి ఇల్లు వదిలేముందు వృద్ధురాలైన తల్లితో "అమ్మా! నిన్ను వదలి వెళ్ళనివ్వు. నీపట్ల నాకు బాధ్యతలున్నాయి. కాని దుర్భరమైన దారిద్ర్యంలో, దుఃఖంలో భారతదేశమంతటా బ్రతుకుతున్న కోట్లాది తల్లుల పట్లకూడా నా బాధ్యత వున్నది" అని చెప్పి తన వున్నతాశయం కోసం తల్లి నుంచి కూడా దూరం పోగలిగిన విప్లవకారుడు.

'పాణిగ్రాహి రచనల్లో రాజకీయాలకు, కళకు ఐక్యత సిద్ధించింది. విప్లవ రాజకీయ వస్తువుకు, కళానైపుణ్యానికి పాణిగ్రహణం చేసినవాడు పాణిగ్రాహి."

'గరిమెళ్ళ సత్యనారాయణ, శెట్టిపల్లి వెంకటరత్నం, గిరిరాజు రామారావు, ఉన్నవ లక్ష్మినారాయణ, వడ్డాది సీతారామాంజనేయులు, దామరాజు పుండరీకాక్షుడు,

సుంకర సత్యనారాయణ, నాజర్, తిరునగరి సీతారామాంజనేయులు- ఇలాంటి కవుల చాలులోనివాడు సుబ్బారావు పాణిగ్రాహి. "ఈ కవులకు ప్రచారమూ ప్రబోధమూ హీన మనిపించలేదు. శుద్ధ కళావాదం వీరికి తెలియని వ్యవహారం. తక్షణ భావోద్వేగమే తమ గేయాల మూలధనం. సాహిత్య సౌందర్య సూక్ష్మాలు తెలియవనేందుకంటె తమ కాలుజేతులకే గాక నోళ్ళకూ మెదళ్ళకూ అవి అడ్డంకులుగా మారలేదనడమే సబబు' సుబ్బారావు 'లౌకిక జీవితంలాగే సాహిత్య జీవితంకూడా కొద్దిపాటిదే కాని సంఘటన లతో కిక్కిరిసిపోయినట్టిది'. ఆయన 'జానపద గాధా కావ్యాలకు (ballads) నకళ్ళు తీయలేదు, ఆధునిక భావవైఖరులకు పాదులూ కట్టలేదు. ఈ రెండు బిందువులనడిమి జాగాలో తాను కవిగా సంచరించాడనవచ్చు. అతని ప్రాసలు చూస్తే ప్రాసల కోసం పడిన ప్రయాస కొందరికీ, పాటలో, నేరుగా ప్రజలమధ్య ప్రజలకోసం ప్రజల నుద్దే శించి రాసిన పాటలో ప్రాసగానీ పల్లవిగానీ చేకూర్చగల విచిత్రమైన శక్తి మరికొం దరికీ కనిపిస్తుంది. ఈ రెండవ గుణంవల్లనే పాణిగ్రాహి పాటలు ప్రజల నోళ్ళలో నిలిచి పోయాయి. ప్రజాకవి ప్రాణవాయువులు ప్రజలలోనే లీనమైపోయాయి'.

(కె.వి.ఆర్.)

ఈనాడు జనం పాటలు ఎక్కువగా పాడేవాళ్ళు ఎందరో వున్నా పాణిగ్రాహి పాటల్లోని సారళ్యం యిపుడు పాటలు రాస్తున్న కవులలో ఎక్కువ మందిలో కని పిస్తూలేదు.

1968 అక్టోబర్ 31న ఏజన్సీ రైతు మహాసభకోసం పల్లెల నుంచి కదలి వస్తున్న గిరిజనుల్లో ఇద్దరిని భూస్వాములు పొట్టనపెట్టుకున్న ఘటన పాణిగ్రాహిచేత 'అక్టోబర్ 31' రాయించింది. "జనం నేర్పిన చిక్కటి దేశీయాలతో, ఉద్యమంనేర్పిన తత్వబలంతో, సుబ్బారావు పాణిగ్రాహి 'అగ్నికణాలు' లోని గేయాలు నిర్మించాడు... జనానికి దూరంగా ఉండి, వాళ్ళకు శిరోధారమైన కవిత్వం రాసేవాడెవడైనా సుబ్బారావు పాణిగ్రాహిలా సూటిగా, సరళంగా, నిరలంకారంగా, పటిష్ఠంగా, పాటినేల సత్తువతోటి, వాగునీటి స్వచ్ఛత తోటి, క్రమబద్ధమైన నడకలు నేర్పి పాటల బాణీలకు ఒదిగించి, గేయాలు రాయలేడు." (కె.వి.ఆర్.)

పాణిగ్రాహి పాటల్లో ముందునిలిచేవి- ఎరుపు, తూర్పు జెండా, మేము కమ్యూ నిస్టులం: వీటికి ఏ వ్యాఖ్యానమూ అక్కరలేదు.

"ఎరుపంటె కొందరికి
భయం భయం
పసి పిల్లలు వారికన్న
నయం నయం"

"ఎరుపు రంగు ఎన్నటికీ / కాదు అపాయం
అపాయాన్ని తప్పించే / ఒక సదుపాయం"

"ఎరుపులోనె మెరుపుంది / పోరాడే శక్తుంది
శ్రీమజీవుల హక్కులకై / ఎలుగెత్తే అరుపుంది" (ఎరుపు)

"ఎడమచేత పట్టవోయ్ ఎర్రని జెండా
తుపాకి పట్టవోయ్ వేరొక చేతా"

"ఈ పీడన మనకెందుకు, ఈ పాలన మనకెందుకు
భవిష్యత్తు మనదేనోయ్, ఈ విపత్తు ఇక రాదోయ్"

"వర్గ రహిత సమాజాన్ని కోరవోయ్
కమ్యూనిజమే నిజమని సోదరులకు చాటవోయ్"(తూర్పుజెండా)

"కష్టజీవులం మేము కమ్యూనిస్టులం
ఔనన్నా కాదన్నా అదే యిష్టులం"

"డబ్బులకై ఆశయాల / సంగడిలో అమ్మబోము
నిర్బంధానికి భయపడి / రివిజనిస్టులం కాము"

(మేముకమ్యూనిస్టులం)

"నిజం కాదురా నేటి స్వాతంత్ర్యం" (బుర్రకథ) అని చెప్తూ, "ఆకలేస్తే గోడ వంక చూసుకో/పచ్చి మంచినీళ్ళు కడుపులోన పోసుకో (దొంగాటకం) అని చెప్పే పాలకుల, వారి బంట్ల గురించి :

"కాంగ్రెసు చెప్పుతుంది సోషలిజం
దానికి వంతపాట నేర్పుతుంది రివిజనిజం
ఆశపడకుమోయి వట్టి బూటకం
నీవు అనుభవించి తీరుతావు కాటకం"

అంటున్నాడు పాణిగ్రాహి. "ఆయుధాల అకులేసి తుపాకితో వడ్డించే" (హెచ్చరిక) "ప్రిస్తుత పాలన నీకై కాదు/ఆశలు వేగ ముగించ"డం 'తెలుసుకో' అనీ, "కూడూ గుడ్డా, గూడూ / కరువెందుకు యీ మూడూ" అని చాలా సరళంచేసి చూపుతున్నాడు పెద్ద సత్యం ఇమిడి వున్న సమస్యను.

అయితే, "కర్మ-ప్రాప్తం రెండు పదాలు/చల్లారెను వేడి ఎదలనూ/ఆచారం, మతధర్మం, నియమం / అపదు ఆకలి మంటలనోయ్'' అంటూ పాత నమ్మకాల మీద దాడి చేసి, కొద్దిమంది కోటీశ్వరులంతా / ఆధికారం చేస్తున్నారోయ్ / పూర్వజన్మ సుఖ

ఫలితం ఇది యని/కదలక మెదలక మేస్తున్నారోయ్" అని అసలైన సిసలైన ఏకైక సత్యాన్ని ప్రకటిస్తున్నాడు (తెలుసుకో) 'దేశభక్తులు'గా చలామణీ అవుతున్న వాళ్ళు ఎవరో కూడా చూపుతున్నాడు:

"ఇతరుల సౌఖ్యం దోచుకు తినడం/సూత్రం తెలిసిన వారండి"
"నిండు మనసుతో రెండు డజనులా/బస్సు రూట్లు గలవారండి"

ఇట్లాంటి చోట, ఇట్లాంటి పరిస్థితిలో— 'ఈ పాలన మనకెందుకు?' అని అడుగుతున్నాడు:

"ఎన్నాళ్ళని ఎదురు చూచినా/కన్నీళ్ళే నీ బ్రతుకోయీ
నిన్నీగతి తెచ్చిన వారిని/మన్నించుట తగదుర భాయీ"

పోరాటం చేయాలి. మరి ఎవరెవరు కలవాలి?

"కల్లలేని కార్మికుడా/కలత విదర్చి వదులుకో
అల్లదిగో కర్షకుడూ/అతని చేయి కలుపుకో" (మేలుకో)

ఇక 'విగతజీవి' ఉద్యోగి వున్నాడు.

"మదిలోన ఆశలన్నీ / పదిలంగ దాచకోయీ
పదిలమౌ ఆశలకోసం / ఎదిరించే తీరాలోయీ"—

అని "ఉద్యోగీ, సాగిపో" నువు కూడా అంటున్నాడు పాణిగ్రాహి.

ఈ 'దిక్కు మొక్కులేని జనం' చేసే 'హెచ్చరిక' చూడండి:

"కోట్ల గొంతు లొక్కసారి/గర్జిస్తయ్ గర్జిస్తయ్
సీట్లమీద కూర్చుండే/మంత్రులారా ఖబర్దార్"

ఇట్లా— "సింహ కంఠ నాదంతో"— పెన్నూ గన్నూ పట్టిన విప్లవకారుని వెనుక నడిచే అగ్నికణాలు ఏమని పాడుకుంటున్నాయో వినండి: (వస్తాము నేస్తం)

"ఎందాక రమ్మన్నా / అందాక వస్తాము
కష్టాలు వస్తాలు / ఇష్టపడి వుంటాము"
"యమ యాతనలు దాటి / సుఖ మనుభవించాలి
మాకున్న లేకున్న / ముందు తరమైనాను"

ఈ జనమూ, ఈ పాటలూ వాళ్ళ బాటలలో "అఖండ భారత దేశాన్ని"దర్శించిన కవి జాతీయగీతం యిట్లా వున్నది: (ఖబడ్దార్):—

"అదిగదిగో బెంగాల్లో / సంతాల్ తెగ బక్క రైతు
గర్జిస్తూ గాండ్రిస్తూ / వైరి వంక చూశాడు

శ్రీకాకుళం జిల్లాలో / ఆకలిగొను గిరిజనుడు
అర్జునులా విల్లుసాచి / బరితెగించి దుమికాడు
నైజాంలో రజాకార్ల / కాంగిరేసు పోలీసుల
నల్లగుండె కదిలించిన / నల్లగొండ జబ్బ శక్తి
మళ్ళీ రుచి దొరుకునులే
తెలంగాణ వీరజాతి / తెగువ మరల జూపునులే
దామర మడుగున హరిజన / వాడలన్ని బుసకొట్టును
రుసరుసలాడిన దదిగో / అస్సాంలో కొండజాతి
త్రిపురాసురు లందరినీ / యమపురికంపగ నేడే
త్రిపురలోని ఆదిశక్తి / ప్రళయనాట్య మాడసాగె".

పాణిగ్రాహికి స్వజాతి దురభిమానం లేదు. "ఒక దేశపు ఆవేశం / ఒకదానికి ఆశయం" కావాలని కోరిన అంతర్జాతీయ మానవతావాది అయిన ఆయన కవిత్వంలో విశ్వరూపం చూడండి: (జనత మేల్కొన్నది):

"అదిగదిగో కాంగో ప్రజ / అంగలు వేస్తున్నారు.
సింగపూరు మలయాలో / సింగాలై యున్నారు
బర్మాలో అధర్మలను / బందీలను చేస్తున్నయి
లంకలోని పీడకుల / బింక మొదల గొడుతున్నయి
అరమరికలు లేకుండ / అమెరికా గడ్డపైనే
నల్లరాళ్ళు లేస్తున్నయి / కొవ్వు రాలగొడ్తున్నయి".

శ్రీకాకుళం గిరిజన పుద్యమానికి శ్రీకారం చుట్టిన మార్పు పద్మనాభం 'తాతకు' అర్పించిన 'జోహార్'నే సుబ్బారావు పాణిగ్రాహికి అర్పిద్దాం:

"అలిపోయినా ఆకలేసినా
కటిక దరిద్రం కరుడుగట్టినా
కరకు పాలకుల కబంధ హస్తం
కక్ష కట్టి నీ మేను చుట్టినా
కదలలేదు నీ కార్యదీక్ష"
"వీడబోములే నీదు ఆశయం"

— రేక

లేచెను విప్లవ జ్వాలా!

సుబ్బారావు పాణిగ్రాహి

లేచిందోయ్ పెనుతుఫాను
ఈ దేశం మారిందోయ్
లేచారోయ్ జనులంతా
ఈ కాలం మారిందోయ్ ॥లేచిం॥

చీకటి కూకటి పాతాళంచే
లేచెను విప్లవ జ్వాలా
లేచెను విప్లవ జ్వాలా
గడగడమని వణుకుచున్నవి
భూస్వాముల భవనాలూ
భూస్వాముల భవనాలూ
ఎంతో కాలం సాగదు దోపిడి
ఈదేశం మారిందోయ్ ॥లేచిం॥

తూరుపు పశ్చిమ
ఉత్తర దక్షిణ
సర్వత్రా వ్యాపించే
సర్వత్రా వ్యాపించే
గబగబ పాకిన
విప్లవజ్యోతి
అందరిలో వెలిగించె
జనులందరిలో వెలిగించె ॥లేచిం॥

హిట్లరు తత్వం
సాగదు సాగదు
పాలకులకు చెప్పండి
పరిపాలకులకు చెప్పండి
హత్యాచారం
సహించబోమని
హోరున గర్జించండి
పెనుహోరున గర్జించండి

శాశ్వత సౌఖ్యందోచే
కాలం మారిందోయ్ ॥లేచిం॥

నక్సల్‌బరీలా
వేనకువేలు
లక్షలు సృష్టిస్తాము
లక్షలు సృష్టిస్తాము
శ్రీకాకుళ
విప్లవవాణిని
అంతట వినిపిస్తాము
అన్నిట వినిపిస్తాము
ఆయుధాలతో అణచే
కాలం మారిందోయ్ ॥లేచిం॥

పేదలు సాదలు
బాధితులంతా
ఐక్యంగా నిలిచారు
ఐక్యంగా నిలిచారు
ఆయుధమంది పగతో
విప్లవశంఖం పూరించారోయ్
తరతరాలుగా సాగిన
కాలం మారిందోయ్ ॥లేచిం॥

మృతవీరులు
చిందించిన రక్తపు
మార్గానే పయనిద్దాం
రక్తసిక్తమార్గాన్నే పయనిద్దాం
॥లేచిం॥

ఆయుధమంది
పైవర్గాలకు
ఆవలకే నెట్టేద్దాం
ఆవలకే నెట్టేద్దాం
ప్రజలే నిజమగు వీరులు
ఈకాలం మారిందోయ్ ॥లేచిం॥

....

"సార్"

"సార్"

ఈ పిలుపుకు మెలుకువ వచ్చింది. పిలుపు అస్పష్టంగా ఉంది.

ఎవరూ ?

"నేనేసార్, ఎల్లయ్యను".

ఇంత రాత్రి మా స్కూల్ ప్యూన్ ఎందుకొచ్చాడబ్బా! అనుకుంటు తలుపు తీశాను.

"హైండ్సప్. కదులితే కాల్చేస్తా"

ఇద్దరు పోలీసు ఆఫీసర్లు పిస్టళ్ళను నాకు గురిచూపుతూ సిద్ధంగా ఉన్నారు. దాదాపు పదిమంది పోలీసు కానిస్టేబుల్స్ తుపాకులను నావైపు చూపుతూ పొజిషన్‌లోవున్నారు. ఇంటిముందర కరెంటు లైటు వెలుగులో వీళ్ళని చూసి ఒక క్షణం ఆశ్చర్యపోయాను. నేను ఏంచేశానని వీరందరు ఇంతరాత్రి నన్ను అరెస్టుసేందుకు వచ్చారో అర్థంకాలేదు. నన్ను పిలిచిన మా ప్యూన్ వారివెనుక బిక్కు బిక్కుమంటూ నిలుచున్నాడు.

"నీ పేరేంది ?"

సత్యనారాయణ

"నువ్ మాతో పోలీస్ స్టేషన్‌కు నడువ్"

ఎందుకు ?

నా మాట పూర్తికాకముందే చెంప చెళ్ళుమంది.

"డోంటాక్ బ్లడీ బ్లాస్టెర్డ్"

నలుగురు కానిస్టేబుల్స్ మా ఇంటిలోకి పరుగెత్తి పుస్తకాల మూటలు తెచ్చారు.

ఈ తతంగానికి మెలుకువ వచ్చిన మా అమ్మ, నా భార్య నా దగ్గరకువచ్చిచేరారు ఈ దృశ్యం చూసిన మా అమ్మ బావురుమంటూ నన్ను చుట్టేసింది.

"పద" పోలీసు ఆఫీసర్ హుకుం జారీచేశాడు.

ఇంతలో ఎక్కడనుండో పోలీసువ్యాను వచ్చి ఆగింది.

"పాంట్, షర్ట్ వేసుకునివస్తా" అతన్ని అడిగాను. అంతవరకు బంగీమీదనే వున్నా.

అతను నా భార్యను తెమ్మని చెప్పాడు.

వారు ఆ గుడ్డలు చెక్ చేసినతరువాత అంతమందిముందే వేసుకోవలసి వచ్చింది.

"ఊఁ" ఆ ఆఫీసర్ గద్దించాడు.

ఆ గద్దింపుకు జవాబుగా నా చేతికి బేడీలు వేశారు.

ఒకడు మా అమ్మను బలవంతంగా ప్రక్కకు నెట్టాడు.

ఇంకొకడు నన్ను బలవంతంగా వ్యానులోకి తోశాడు.

"నా కొడుకును యెందుకు తీసుకపోతాండ్లు?" ఆక్షణం ఏడుపు ఆపి అమ్మ ప్రశ్నించింది.

అందుకు సమాధానంగా వ్యాన్ శబ్దం చేసింది.

దీనికి మేము సాక్ష్యమంటూ వీధికుక్కలు మొరిగినవి.

అన్యాయాలు, అక్రమాలు విచ్చలవిడిగా జరుపుకొమ్మన్నట్లు రాత్రి తనచీకటి రూపాన్ని అంతటా విస్తరింపచేసింది. 'మీ ఆటలు ఎంతోకాలం సాగవు, తూర్పు వెలుగు వచ్చేవరకైన మేము ప్రతిఘటిస్తాం అన్నట్లు పగిలిపోగా మిగిలిన వీధిదీపాలు. వ్యాన్ ముందుకు పరుగెత్తింది. నా ఆలోచనలు వెనుకకు పరిగెత్తినవి.

"దిగు"

ఆలోచనలనుండి తేరుకొని చూశాను. పోలీసు స్టేషన్ గోడగడియారం మూడు కొట్టింది.

"వీన్ని లోపటెయ్"

నన్ను లాకప్‌లోకి తోసేశారు.

అప్పటికే అందులో ఇద్దరు నిదురపోతున్నారు. గది చాలా ఇరుకుగా వుంది. లాకప్ ముందర సెంట్రీ తిరుగుతున్నాడు. ఆఫీసర్ ఫోన్‌లో ఏదో మాట్లాడుతున్నాడు. మా గదికి దగ్గర్లో లేట్రిన్ ఉన్నట్లుంది. కంపుగాలి వస్తోంది. అదేవిషయం సెంట్రీతో చెప్పాను.

"చుప్‌బే" అంటూ ఉరిమాడు.

ఉపాధ్యాయులు బహుముఖ ప్రజ్ఞులని, భావిభారతజాతి నిర్మాతలని గొప్పగొప్ప నాయకులు, గొప్ప గొప్ప సభల్లో, గొప్ప గొప్ప ఉపన్యాసాలు దంచేస్తారు. కాని ఉపాధ్యాయుడు ఈ సమాజంలో ఎంతో తక్కువ స్థానంలో ఉన్నాడని అర్థం చేసుకున్నాను.

ఒక్క క్షణం నాకుటుంబం గుర్తుకు వచ్చింది. రక్తపుపోటుతో మంచాన పడ్డ అమ్మమ్మ పెప్టిక్ అల్సర్‌తో బాధపడే అమ్మ, ఛాతీనొప్పితో ఉన్న తమ్ముడు, పెండ్లి

కావలసిన ఇరువదిమూడేండ్ల చెల్లెలు, చదువుకునే తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, పాలుమరువని పసివాడు, నేనులేనిదే ఒక్కరోజుగూడ గడుపలేని మా పెద్దబాబు, సుఖమంటేఏమిటో తెలియక గానుగెద్దులా ఈ ఇంటికి చాకిరీచేసే నా భార్య వచ్చే జీతపురాళ్ళకి తోడుగా ఎన్ని ట్యూషన్లు చెప్పినా వెళ్ళని మాకుటుంబపరిస్థితి ముందు ఏమవుతుందో ఆలోచించ లేకపోయాను. 'దీనికై నీవు చేసేదింతే' అంటూ నా నిస్సహాయతను గేలిచేస్తూ రెండు కన్నీటిబొట్లు రాలినవి.

"ఇప్పుడే వచ్చినవా?" పక్కన ఉన్నతడు పలకరించాడు.

ఊఁ

"నిన్ను ఎందుకు తీసుక వచ్చిండ్లు?"

ఏమో

"ఒక్క బీడుంటియ్యకపోతివి"

నేను తాగ.

"మూరోజులాయె నన్ను యిందులోవేసి. ఒక్క పైసలేదు. బీడీలకు బలు విబ్బందయితాంది. ఒక్క పావులుంటియ్యవా".

పావుల ఇచ్చాను.

సెంట్రీని పిలిచి పావుల ఇచ్చాడు.

అతను ఇతనికి రెండు బీడీలిచ్చాడు.

బీడీలు చూసి బహు సంతోషపడ్డాడు,

'నీ పేరేంటి?'

"బాలిగాడు దొర"

'నిన్నెందుకు తీసుక వచ్చారు?'

"మొన్నప్యాటకు జొన్నలెత్తిచ్చింటి" బీడి ముట్టించి ఒక దమ్ము లాగి 'అరె, అటేటు పండు' అని పక్కవాన్నని నాతో తన కథ మొదలుపెట్టాడు.

"జొన్నలమ్మినంక కైత్రితెచ్చుకుందామని దుకాండ్లకుపోయిన దుకానవోడు దర గిట్టనియ్యలే. వచ్చేది వానకాలమాయె, అక్కరుంటదని ఆలోచిత్తాన. ఇంతట్లో దుకాండ్లకెల్లి ఎవడో వచ్చి 'గీవీడే మొన్న వచ్చి కత్రి దెంగిపోయిండ'ని నన్ను యీ పోలీసులకు పట్టిచ్చిండు.

'మరి వీళ్లేంజేసిండ్లు?'

"నా రూపాలు గుంజుకొని దీంట్లేసిండ్లు"

'అసికాదు నేనడిగేది, నువ్ ఈ విషయం చెపితే ఏమంటరు?'

"ఇంక రెండువందలు తెమ్మంటాండ్లు" అని భోరున ఏడుస్తూ తనను కొట్టిన దెబ్బలు చూపించాడు.

"ఏమ్, ఊకె ఏడ్వేనా?" అంటూ పక్కకృతను లేపాడు.

"ఏది ఒక్కదమ్మిటియ్" అంటూ బీడీ తీసుకొని తనోరెండు దమ్ములులాగి బీడీ బయట పడేశాడు.

"ఈయ్నెవలు?" అతను బాలిగాన్నడిగిండు.

"ఏమో, ఇప్పుడే వచ్చిండీయన"

నా విషయం వారితో చెప్పాను.

అతనిగూర్చి గూడ అడిగాను.

అతని పేరు రమేష్, విజయవాడ. ఇంటర్ మీడియట్ పాసైండు. పినతల్లి తిడితె ఇంటిలో చోటులేక ఉద్యోగానికై ఇటు వచ్చాడు- స్టేషన్లో పడుకుంటే మూడు రోజులక్రితం పోలీసులు ఏమీ యిచ్చుకోలేక పోయాడు కాబట్టి 'ఆవారా' అని ఇందులో పడేశారు-

లాకప్‌గది మూలలో ఒక రంధ్రంవద్ద వాళ్ళుమూత్రం పోశారు. 'ఇదేంటంటే' ఇప్పుడు లాకప్ తీయ్యరన్నరు.

వారు తిరిగి నిద్రలోకి జారారు.

నా భావి కార్యక్రమంగూర్చి యింకా ఏమీ ఆలోచించలేకపోయాను.

గడియారం ఐదు కొట్టింది.

సెంట్రీతో దొడ్డికిపోవాలని చెప్పాను.

ఎస్సైసాబ్ రానిదే తలుపుతియ్య నన్నాడు.

ఎంత ప్రాధేయపడ్డా తిట్లుతప్ప అతని నోటినుండి మరోటి వినలేకపోయాను.

ఇంతలో టక టక బూట్లశబ్దం వినిపించింది.

వచ్చేసి ఎస్సైని అని చూశాను. కాని దాదాపు ఇరవయి సంవత్సరాల యువకుణ్ణి లాక్కొచ్చి బట్టలూడదీసి అమానుషంగా కొట్టారు. చిమ్మేరక్తంతో లేవలేకపోయాడు. ఒక పోలీసు అతన్ని బూటుకాలితో తన్ని లేపాడు.

"నడువ్ సాలే" అంటూ మరి రెండు తన్నాడు.

రక్తంతో దిగంబరంగా ఉన్న ఆ యువకుడు "దూప" అంటూ మూల్గిండు.

"బాద్ మే దే" అంటూ మేమున్న లాకప్‌లో పడేశారు.

'తన బట్టలివ్వమన్నట్లు' పోలీసులకు సైగ చేశాడు.

వారు చువ్వల మధ్యనుండి బట్టలు లోపల పడేశారు. అతి కష్టంమీద బట్టలు తొడుక్కోగలిగాడు.

ఒక బీడి ఉంటె ఇవ్వరా అన్నట్లు మా ముగ్గురివైపు చూశాడు. బాలిగాడు బీడి ముట్టిస్తే, తలో రెండు దమ్ములు లాగారు.

ఎంతో ప్రాధేయపడగా గ్లాసెడు నీళ్ళు ఇచ్చారు. ఆ దెబ్బలుతిన్న వ్యక్తి అవి తాగి కొంత కుదుటపడ్డాడు.

మళ్ళీ టకటక బూట్ల శబ్దం.

మరెవరిదో వీపు పగిలిందనుకొన్నాను.

కాని ముగ్గురు పోలీసు ఆఫీసర్లు లాకప్ ముందుకొచ్చారు, నన్ను బయటికితీశారు. నేను కోరగా అతి పకడ్బంది ఏర్పాట్లతో నన్ను కాలకృత్యాలు తీర్చుకోనిచ్చారు.

తరువాత నన్ను వ్యాన్లో ఎక్కమన్నారు. నా చుట్టూ సాయుధ రిజర్వ్‌డ్ పోలీసులు- ముందర ముగ్గురు ఆఫీసర్లు- వ్యాన్ కదిలింది.

"ఇన్ని రోజులు మన కన్నుగప్పి బయట పడకుండ ఉన్నది వీడే"

"ఎస్సార్, ఎమర్జన్సీపెట్టంగనే ముఖ్యులందర్నీ అరెస్టుచేశామూ, అయినా సిటీలో ఆర్గనైజేషన్ సాగుతుందంటే కారణం వీడేసార్."

"వీడొక్కడే కాదు, మనం అరెస్టు చేసిన వాళ్ళలో కూడ కొందరున్నారు. వీళ్ళందరూ కలిసి యూత్‌ను చెడగొడుతున్నారు."

"వీడు ముఖ్యంగా స్టూడెంట్సును చెడగొడుతున్నాడు."

"..............."

"..............."

ఈ రకంగా సాగింది వారి సంభాషణ.

వీరు నాగూర్చే మాట్లాడుతున్నారని, నాకంటె ముందుగా మరికొందరిని అరెస్టు చేసి కాన్‌సెంట్రేషన్ క్యాంపులో ఉంచారని అర్థంచేసుకున్నా. అందుకే వీరు నన్ను ఏమి చేయబోతున్నారో, నేను ఎలా ప్రవర్తించాలో ఆలోచిస్తున్నా. వ్యాన్ కారడవిలో ఒక పెద్ద బంగ్లా చేరుకుంది దాదాపు వందమంది వరకు రిజర్వ్‌డ్ పోలీసులు అక్కడున్నారు.

నేను వ్యాన్ దిగగానే, నన్ను ఒక పెద్ద పుస్తకాల మూట మోయమన్నారు-తప్పలేదు.

నేను హాల్లోకి రాగానే అక్కడ పుస్తకాల చుట్టూవున్న ఆఫీసర్ల కళ్ళు పిస్టల్స్ లాగా ఒక్కసారి నావైపు తిరిగినవి.

"హి యీజ్ ద బగ్గర్" ఒక ఆఫీసర్ నన్నుచూసి రిమార్కు చేశాడు.

"వీన్ని ఎక్కడుంచుమంటారు ?"

"ఇంతలో వీని ఫొటోలు, ఫింగర్ ప్రింట్స్ తీసుకోండి" పెద్దాఫీసర్ చిన్నాఫీసర్ కు హుకుం జారీచేశాడు. గబగబ వారాపని పూర్తి చేశారు.

"నువ్ ఖర్చులేకుండా ఫోటో దిగుతానవ్‌రా" వారు నా ఫోటోగ్రాఫ్ తీసుకునే సందర్భంలో ఒక ఆఫీసర్ జోక్. అందుకు అక్కడి పోలీసు బలగం పగలబడి నవ్వింది. తరువాత నాచేత నాకు ఏదో స్వంత పని ఉన్నట్లు వారం రోజులకు లీవ్ లెటర్ రాయించారు.

ఒక కానిస్టేబుల్ వచ్చి నన్ను పైకి తీసుకెళ్ళాడు.

పైన ఐదారుగురు ఆఫీసర్లు టేబుల్‌చుట్టూ కూర్చున్నారు. మరో ఆఫీసర్ కాస్త ఎడంగా కూచునిఉన్నాడు. మరొకతను స్టేట్‌మెంట్స్‌రాసుకోటానికి సిద్ధంగాఉన్నాడు.

"నీ పేరేంది ?" ఎడంగా కూర్చున్న ఆఫీసర్ ప్రశ్నించాడు.

చెప్పినా.

"నీ మరో పేరేంది ?"

నాకు ఒకటే పేరు.

"నీవు ఏంపని చేస్తావు ?"

చెప్పినా.

"ఎక్కడ"

చెప్పినా.

వారికి ఉన్న ఇన్‌ఫర్‌మేషన్‌తో సరిపోయినట్లుంది. ఎవరికో సైగ చేశాడు.

ఇద్దరు కానిస్టేబుల్స్ నన్ను బలవంతంగా రూంలోకి లాక్కెళ్ళారు. అందులో మరో నలుగురున్నారు. నన్ను బోర్లపడుకోబెట్టి, మోకాళ్ళలో రోకలిపెట్టి కాళ్ళు మీదికి మలచి ఇద్దరు మీద కూర్చున్నారు. ఇద్దరు పాదాలపై కర్రలతో కొట్టసాగారు. అప్పటి నా బాధను మాటలలో వర్ణించలేను. అప్పుడు నాకు అర్థమయింది లాకప్‌లో దెబ్బలు పడ్డవాని బాధ.

"ఇక పటా్రింది" ఆ మాటే నా పాలిటి వరమయింది.

నిలబడలేని నన్ను ఇద్దరు కానిస్టేబుల్స్ బయటికి లాక్కెళ్ళి గోడకు దగ్గరగా నిలబెట్టారు.

అన్యాయం తనదాక వస్తేకాని అర్థంకాదు. ఆ క్షణం వారందరూ పరమ కిరాతకులుగా కనపడ్డారు.

"ఇప్పుడు చెప్పు" ఆ ఇంటరాగేషన్ చేసే పోలీసుఆఫీసర్ చిరునవ్వులుచిందిస్తూ అన్నాడు.

"ఏం చెప్పాలి"

"ఏం తెలియనట్లు మాట్లాడి అనవసరంగా తన్నులు తినకు. చెప్పురా లంజ కొడుక చెప్" ముఖం కుమ్ముల పెట్టిన వంకాయ అయినట్లయింది.

మా కుటుంబ పరిస్థితి, నేను చేసే ఉద్యోగం గూర్చి చెప్పాను.

"అతితెలివిగా మాట్లాడకు" అంటూ చెంప ఛెళ్ళుమనిపించాడు. ఆ దెబ్బకు ప్రక్కకు తూలాను. ఆ ప్రక్కగల ఆఫీసర్ నన్ను సరిగా నిలబెట్టాడు.

"నీగూర్చి మావద్ద గల రిపోర్టు చదువుతా విను" అంటూ చదివాడు.

నేను పనిచేసే గ్రామంలో జరిగిన దొంగతనానికి నేను నాయకత్వం వహించానని, ఆ ఊరిలో ఒక గ్రామస్తుని కొట్టానని, తరగతులలో పాఠాలకు బదులు...... యిజమ్ బోధిస్తానని, రాత్రిళ్ళు గుట్టలపై మీటింగులు పెడ్తానని, నన్ను ఎప్పుడూ యు.జి. వాళ్ల కలుస్తారని, చుట్టుప్రక్కల గ్రామాలలో రహస్య సంఘాలు పెట్టి యువకులను యు.జి.కి పంపుతున్నానని, ఎమర్జెన్సీలో సిటీలో జరిగే అల్లర్ల వెనుక నేనే ఉన్నానని, నేను ఒక డ్రామా వేయించానని, దానికి యు జి. వాళ్ళు వచ్చారని సిటీలో గోడల పై నినాదాలు నేనే రాయించానని...... ఆ రిపోర్టు సారాంశం.

"ఇదంతా నిజమే కదా" అంటూ గద్దించాడు.

'కాదు, అందులో ఒకటి మాత్రమే నిజమంటూ' నిదానంగా చెప్పాను.

"ఏంటది. నిజం చెప్పు అబద్ధమాడావో ఈ అడవిలో పిట్టను కాల్చినట్లు కాల్చేస్తా".

"డ్రామాను డైరెక్టు చేశాను"

నా ఈ మాటకు ఆ ఆఫీసర్ సినిమా విలన్‌లా వికటంగా నవ్వాడు. మిగిలిన వారు సుతికలిపారు. నాకు అసహ్యమేసింది.

"ఆ డ్రామాకు యు.జి. వాళ్ళు ఎందరొచ్చారు?"

'వాళ్ళెవరో నాకు తెలియదు'

"సరే, నీకు జి.కె. తెలుసా?"

'తెలియదు'

"యస్. కె.?"

'తెలియదు'

"వై. బి.?"

'ఊఁహూఁ'

ఇంకొందరి పేర్లు చదివాడు.

అన్నిటికీ తల అడ్డంగా ఊపాను.

"నీకు ఎవ్వడెరుక లేదా బే" అంటూ ఊహించలేనంత తొందరగా కడుపులో బూటు కాలితో తన్నాడు. ఆ తన్నుకు క్రింద పడి సుళ్ళు తిరిగి పోయాను.

కిందపడ్డ నన్ను ఇద్దరు కానిస్టేబుల్స్ లేపి నిలబెట్టారు. నిలబడలేక కూలపడి పోయా-

"ఈ లంబ్డికొడుకు డ్రామా డైరెక్టర్- వీనికి యాక్షన్స్ బాగా వచ్చు. ఇది యాక్షనే- లేబేలే" అంటూ జుట్టుపట్టి లేపాడు పోలీసు ఆఫీసర్.

కళ్ళు చీకట్లు కమ్మాయి. నిలబడలేక పోయాను. అంతే గుర్తుంది.

....

ఎప్పటికోగాని స్పృహలోకివచ్చాను. తల దిమ్ముగావుంది కడుపులో నొప్పిగా వుంది. ఒళ్ళంతా పుండు. దగ్గర్లో పెదబొబ్బలు అతికష్టంగా కళ్లు తెరచాను.

"లేచిండుసార్"

"వాన్నిటు పట్రా"

క్రేన్స్‌లా ఇద్దరు కానిస్టేబుల్స్ నాపైవాలి నన్ను లేపారు.

ఎక్కడికి తీసుకపోతున్నారో. అర్థమయింది ఇంతకు ముందున్న దృశ్యమే-

"అరే డ్రామాకు ఎవర్ని ఇన్వైట్ చేశారు?" ప్రశ్నల వర్షం మొదలయింది.

ముగ్గురు వచ్చారు అందులో ఒక్కతనిపేరు గుర్తుంది-

"ఎవ్వడు వాడు?"

'రావ్ సార్'

"వాడు సారారా? హీ యిజ్ ఎ డెకాయిట్" గద్దించాడు.

అతడంటే వాళ్ళకి అంత కోపమెందుకో-

'అతడు కాలేజి లెక్చరర్ సార్'

'అంటే, అతనిగూర్చి నీకు అన్నీ తెలుసన్నమాట'

అతను ఈమాట ఎందుకన్నాడో అర్థమయింది-

'అతడు లెక్చరర్ అని మాత్రమే తెలుసు'-

'వాడు చెయ్యబట్టే ఈ డిస్ట్రిక్ట్ ఇట్లా నాశనమయింది. అందుకే వాణ్ణి కాన్స్పిరసీకేసులో యిరికించాం' ఆఫీసర్ నిండుగా నవ్వుతూ కుర్చీనుండి లేచాడు.

'యూ మిస్టర్ నారాయన్, యు ఆర్ ఏ టీచర్, మోరోవర్ ఏ గ్రాజ్యువేట్. డోంట్ బి సిల్లీ, ఇఫ్ యు రిపీట్ ఎవ్రీథింగ్, యూ విల్ బి రివార్డెడ్. అదర్‌వైజ్ యు విల్ బి షాట్ డెడ్, కమాన్ సే కరక్ట్' నావద్దకువచ్చి భుజంపై చెయ్యివేశాడు- ఆ క్షణంలో అతన్ని చూస్తే ఒళ్ళు మండింది. ఇంత నీచమైన చిత్రహింసల మధ్య గుడిలో విగ్రహంలాగా, మందస్మిత వదనంతో ఉన్నందుకు మొహంమీద తిట్టాలని, వాళ్ళ క్రూరచర్యలకు తగు పాఠం చెప్పాలని అనిపించింది. అందుకు ప్రతిఫలం ఏమి అనుభవించాలో నాకు తెలుసు. పన్నెండు మందిగల కుటుంబానికి దిక్కెవ్వరూలేరు. వారు అనాథలవుతారు. దేశంలో కోట్లకొద్ది అనాథలున్న విషయం నాకు తెలియనిది కాదు. వారిలో వీరొక భాగం. వారందరికోసం చెట్టుకు కట్టి కాల్చి చంపబడితే ఆ చావు ఎంత విలువైందో నాకు తెలుసు. కాని అంత ఔన్నత్యానికి ఎదగని నాపైనాకే సిగ్గేసి తలక్రిందికి దించాను-

''వీళ్ళంతా నీకు తెలుసుకదూ?'' అంటూ ఆ ఆఫీసర్ పది పేర్లు చదివాడు,

అందులో నాకు ఎవరూ తెలియదంటూ తల అడ్డంగా ఊపాను-.

'నువ్ క్లాస్‌లో పాఠాలకు బదులు... ఇజమ్ చెప్తావట'

'లేదు'.

'నువ్ గుట్టలపై మీటింగులు పెట్టావట'

'లేదు'.

'మమ్మలను బుకాయించకు. ఈ విషయాలన్నీ మీ స్టూడెంట్సే యిక్కడ చెప్పారు'-

'నేనెప్పుడట్లా చెయ్యలేదు'

'ఈ లంజకొడుకులకు పుటంవేసినా అక్కరకు రారుసార్. మంచిమాటలు వీరికి పనిజెయ్యవు- లేస్తాపడ్తా తంతూనే ఉండాలె' పెద్దాఫీసర్‌తో ఓ చిన్నాఫీసర్ అన్నాడు.

'సరే ఈ రాత్రికి బాగా ఆలోచించుకో. రేపు సరిగా చెప్పు. లేకుంటే, అటు చూడు' అడవివైపు చూపించి "అందులో ఇదివరకు ఎందర్నో కాల్చేసిన అట్లే నిన్ను కాల్చేస్తా. ఇక నువ్ పో" ఆజ్ఞాపించాడు.

నన్ను స్కూల్‌లో అరెస్టుచెయ్యక యింటిలో అర్ధరాత్రి పోలీసులు ఎందుకు అరెస్టు చేశారో యిప్పుడర్థమైంది-

'రా' అంటూ పోలీసు కానిస్టేబుల్ నన్ను ఒక పెద్దగదిలోనికి తోసిపోయాడు- దానిముందర ఇద్దరు సెంట్రీలు తుపాకులతో కాపలా ఉన్నారు- అందులో దాదాపు అరవయి డెబ్బయి మందున్నారు- అందులో నాకు పరిచయమున్నవారున్నారు- వారు నా స్టూడెంట్స్ నేను అందులోకి రాగానే వారు బాధ వ్యక్తంచేశారు-

'లంజకొడుకులు మిమ్ములగూడ పట్టుకచ్చిండ్లా, సార్'

'సార్ పేరు ఎవడు చెప్పిండొచ్చురా?'

'ఇంకెవ్వడు, వాడె మొగిలిగాడు'

'మనరాజ్యం రాదారా, అప్పుడు వాన్ని......' ఒక స్టూడెంటు పళ్లు పటపట కొరికాడు.

'ఇప్పుడవన్నీ ఎందుగ్గని'అంటూ వేరొకతను నేను కూర్చోడానికి స్థలమిచ్చాడు.

వాళ్ళందరు తమకు జరిగింది మెల్లిగా చెప్పారు. మొత్తంమీద నాకు అర్థం అయింది ఇది.

నాకంటె రెండు రోజులముందే వాళ్ళందరినీ ఈ కాన్‌సెంట్రేషన్ క్యాంపుకు తెచ్చారు- అందులో ఎవరినీ విడువకుండా చిత్రహింసలకు గురిచేశారు. అందరికంటే చిన్నవాడు చారి, పదహారుసంవత్సరాల పిల్లోడు- వారి చిత్రహింసలకు జ్వరంవచ్చింది. చూసే దిక్కులేదు- జబ్బుచేస్తే గొడ్డుకైనా కోడిపిల్లకైనా మందిస్తారుకాని ఈ పోలీసులు మనిషిని జంతువులకన్నా హీనంగా చూస్తారు- ఈ రెండ్రోజులు వారిని కొడుతూనే ఉన్నారు- చిత్రహింసలు పెడుతూనేవున్నారు. ఇంతవరకు వారికి కావలసిన సమాచారం అందలేదట- అందుకే మరికొందరిని పట్టుకొస్తున్నారు. ఇందులో డాక్టర్లు అధ్యాపకులు, లాయర్లు, విద్యార్థులు, కార్మికులు వున్నారు.

'ఎందరు ఎన్నిరకాల చిత్రహింసలకు గురిచేయబడ్డా, నమ్మిన ఆశయానికి కట్టుబడి, ఉద్యమానికి ద్రోహం చేయకూడదు' ఇది అందరి ఉద్దేశంగా కనపడింది-

అక్కడికి తీసుకురాబడ్డ అందరిపై ఏవో కొన్ని అభియోగాలు మోపారనీ, చిత్రహింసలకు తట్టుకోక కొందరు కొన్ని ఒప్పుకున్నారనీ తెలిసింది-

'ఈ వారిని ఎందుకు తీసుక వచ్చారు?'

'ఇతని అన్న తప్పించుకపోతె ఇతన్ని పట్టుక వచ్చిండ్లు సార్'.

ఇంతలో భోజనానికి పిలుపు వచ్చింది. అందరు అరుగులపై కూర్చున్నారు. ముందర ఆకులువేసి అందులో అన్నం పెట్టారు. దాన్ని అన్నం అనేకంటె నానవేసిన బియ్యం అంటే సరిపోతుంది, వాచిపోయిన చేతిని, ఆ వేడి బియ్యంపై కాపాను. చాలా హాయి అనిపించింది. ఈరోజు పొందిన ఆనందమంతా అదే. కొందరు ఆకుల ముందు కూర్చోలేక పోతున్నారు. కొందరి చేతులు అన్నం కలుపలేని స్థితిలో ఉన్నవి. కొందరు నిలబడలేరు- మరికొందరు కూర్చోలేరు- వారందరితో పోల్చి తుంటే అందులో చాలామందికంటే నేనే మెరుగ్గా ఉన్నాననిపించింది. ఆ ఆహారంలో నీరులాంటి చారు పోశారు. వాటికి తోడుగా అందరికీ గ్లాసెడు నీళ్ళుపోశారు. కొందరు తినలేక తిన్నారు- కొందరు తినలేదు- మరికొందరు తినవీలు లేక తినలేదు- ఎట్లయితేం భోజనాల కార్యక్రమం ముగిసింది- అందరిని అదే పెద్ద హాలులోనికి తోలారు.

అందులో ఒక విద్యార్థి ఒక సిగరెట్టు ముట్టించిండు. తలో దమ్ము లాగారు.

ఒక విద్యార్థి నా చెవిలో గుసగుస చెప్పాడు. అందులో ఒకతను పోలీసు ఇన్‌ఫార్మర్ ఉన్నాడట. ఒక మూలకు కూర్చున్న ఎర్రచొక్కావాన్ని చూపించాడు. అందరిలో వెలివేయబడ్డట్టు ఒంటరిగా ఉన్నాడు.

"సబ్ బైఠో గింతీ కర్నాహై" ఒక పోలీసు మమ్ములను ఆజ్ఞాపించాడు.

అందరం అట్లే చేశాం.

"...సాఠ్, ఎక్‌సట్, బాసట్" మా అందర్నీ లెక్కపెట్టాడు.

"కిత్నె ?"

"బాసట్"

"బారేక్ సాలా కిధర్ గయా ?"

"బారేక్ దఫా గినో"

"ఏక్, దో... బాసట్"

"తోటల్ ఫిర్ దేఖోజి"

"ఇవ్వాలొచ్చినోంతోటి తిర్‌సట్"

"బద్మాష్ బారేక్ కిధర్ గయా ?" అంటూ బూతులు తిడుతూ పెట్రోమాక్స్ లైటు వెలుగులో మరో రెండుసార్లు లెక్కపెట్టారు.

వాళ్ళ లెక్కకు అదె ఆరవయి ఇద్దరు వస్తున్నారు.

అంతలో విజిల్స్ మ్రోగినవి. బూట్లు టకటక శబ్దం చేసినవి. కొన్ని మా ముందున్నవి. మరికొన్ని టార్చీలు, పెట్రొమాక్స్ లైట్లు పట్టుకొని అడవిలోనికి తుపాకులతో పోయినవి.

ఏమి జరిగిందో మా అందరికీ తెలుసు. ఎవరు తప్పించుక పోయారో తెలియటం లేదు.

ఒక పోలీసుఆఫీసర్ లిస్టుతెచ్చి అందరి పేర్లుపెట్టి వరుసగా పిలిచాడు. అరవయి ముగ్గురు సరిగానే ఉన్నారు. ఇంతమంది కానిస్టేబుల్స్ కనుక్కోకుండి తను కనుక్కున్నందుకు చిరునవ్వు నవ్వాడు. ప్రక్కవానికి ఏదో సైగచేశాడు. విజిల్ శబ్దం అయింది. బూట్లు తిరిగి శబ్దం చేసినవి. హెడ్ కానిస్టేబుల్ మళ్ళీ లెక్కపెట్టాడు. లెక్క సరిపోయింది. ఆ ఆఫీసర్ వాళ్ళందరినీ వారితెలివితక్కువ తనానికి బండబూతులు తిట్టి పోయాడు.

ఆ హెడ్‌కానిస్టేబుల్, చిన్న కానిస్టేబుల్‌ను పట్టుకొని "ఆ తప్పించుకపోయిన మాకేలవుడగాడు ఎక్కడినుంచి వచ్చిండు ?" అని అడిగాడు.

"వో కోన్‌హై సాలా" అంటూ మా అందరి ముఖం చూశాడు. దేశంలోగల కష్టజీవులకూ, విద్యార్థులకూ ఈ రకంగా పోలీసులవల్ల అవమానం జరుగుతుంటే 'నా ప్రజాస్వామ్యం చూడు, నా ప్రగతి చూడు' అంటూ పాటలు పాడే కవులను ఏమనుకోవాలి ?

ఏమాత్రం ఎదురించినా పరిణామం ఏమవుతుందో అందరికీ తెలుసు. అందుకే ఎవరూ ఏమీ పలుకలేదు. ఇంటరాగేషన్ ఈరోజుకు అఖరన్నట్టు దభేల్‌న తలుపుపెట్టి తాళం వేశారు.

అసలు జరిగిందేమంటే చారి జ్వరంతో నిద్రపోయి అన్నానికిరాలేదు. భోజనాల పిమ్మట గోడ ప్రక్కగా నిద్రపోయిన చారిని అనుకొని అందరూ కూర్చున్నారు. అందుకే అతను పోలీసులకు కన్పడలేదు.

'రాత్రి బయటకు పోవలసివస్తే ?'

"మూలకు ఒక కుండ పెట్టిండ్లు. బయటకు ఎవ్వరిని ఒదిలిపెట్టరు సార్"

గదిలో చిన్నగా మాటలు బయలుదేరినవ్.

"అందర్ కోయి నహ్ బాత్ కర్నా" సెంట్రీ గద్దించాడు.

మా పై జరిగే ఈ కిరాతకాన్ని సహించలేనన్నట్టు బయట అడవి గాలి హోరు. మధ్య మధ్యన పెద్దపులుల గాండ్రింపులు. అప్పుడప్పుడు సెంట్రీ కేకలు, రాత్రి ప్రపంచాన్ని జోకొడితే అడవిని మేల్కొలిపింది.

మెదడులో ఎన్నో ఆలోచనలు. రేపు జరుగబోయె ఇంటరాగేషన్‌లో చెప్ప వలసిన విషయాన్ని చాలాసార్లు మననం చేసుకున్నా. ఎప్పుడో కునుకు పట్టింది.

*　　*　　*

అందరు ఎప్పుడు లేచారో కాని పోలీసుల కేకలకు మాత్రం నాకు మెలుకువ వచ్చింది. కాలకృత్యాలు తీర్చుకొనడానికి జట్లు జట్లుగా తీసుకుపోతున్నారు.

ఒకతను నిలబడే దొడ్డికి పోయాడు. ఆ దృశ్యాన్ని చూసి కంపించిపోయాను. అతను కూచోలేనిరీతిగా అతని శరీరం పగిలిపోయింది. పూర్వం బానిస యజమానులు తమ బానిసలను ఇంత అమషంగా హింసించేవారని ఎవరన్నాఅన్నా నేను నమ్మలేను. ఇంతకంటె చెట్టుకు కట్టి కాల్చేస్తే నాకు ఇంత బాధకలిగేది కాదు.

ఎవరైనా 'మనం నాగరికులం, మన సంస్కృతి గొప్పది, మనం అణుయుగంలో ఉన్నాం, ఇంకా ముందున్నాం' అంటూ వాగాడంబరాన్ని వల్లిస్తే అతన్ని తీసుకవచ్చి ఈ దృశ్యంచూపిస్తే అర్థం అవుతుంది, మనం ఏ యుగంలో ఉన్నామో ... రక్తాన్ని చవిచూసిన శార్క్ చేప స్వజాతి దానైనా ముక్కలుముక్కలుగా కొరుక్కతింటుంది. దానికీ యిక్కడ జరిగే హింసకూ భేదం కనపడలేదు నాకు.

తరువాత అందరికీ టీ పోశారు.

"త్వరగా తాగండి. మీకు మరో 'కోటింగ్' పడాలి" లావుగా ఉన్న చిన్న కానిస్టేబుల్ అన్నాడు.

అతని హాస్యానికి, యితర కానిస్టేబుల్స్ పకిలింంచారు.

నాకు అసహ్యమేసింది.

పైనుండి క్రిందికి ఒక్కొక్కరికి పిలుపు రాసాగింది. పైకి పోయిన ప్రతివాడి పెడబొబ్బలు క్రిందికి వినబడుతున్నవి. మళ్ళీ హింసాకాండ మొదలయింది.

కొంతసేపటికి నా పేరొచ్చింది.

అతి కష్టంగా పైకి పోయాను.

దృశ్యం ముందుమాదిరిగానే ఉంది. అందరు నావైపు చూసి నవ్వారు. అది విషపు నవ్వు.

"రాత్రి బాగా ఆలోచించుకొని ఉంటావు. నీ లైఫ్ స్పాయిల్ చేసుకోకు. నీవద్దకు యూ.జి. వాళ్ళు ఎవడెవడు వచ్చేవాడు ?"

'నాకు ఎవరూ తెలియదు- ఎవరూ వచ్చేవారు కాదు.'

"నీ దగ్గరకు వచ్చినట్లుగా మావద్ద బలమైన సాక్ష్యాలున్నవి."

'అవి ఉండగా నన్ను అడుగుడెందుకు'

"నీ నోట వినాలని."

'నా వద్దకు ఎవరూ వచ్చేవారు కారు' అదే జవాబు తిరిగి చెప్పాను.

"నీదే గ్రూపు ?"

'నేను ఏ పార్టీకి చెందినవాన్ని కాను. నాది ఏగ్రూపూ కాదు.'

"క్లాసులో... మావో యిజం బోధించావట"

'లేదు'

"గుట్టలపై రాత్రిళ్లు మీటింగ్ ?"

'లేదు

"చారి, ప్రసాద్, సాయిల్ను తీసుకరా !"

మరుక్షణంలో వారు పైకి వచ్చారు.

హైస్కూల్లో వాళ్ళు నా స్టూడెంట్సు. ఇపుడు కాలేజిలో చదువుతున్నారు.

"అరే, వీడు మీకు క్లాసులో మావో యిజం చెప్పాడా లేదా ?"

"......... ..."

"గుట్టలపై రాత్రిళ్ళు మీటింగులు పెడుతాండా లేదా ?"

ఆ ముగ్గురూ ఒకేసారి "లేదం"టూ తలలూపారు.

"లంబ్డికొడుకుల్లారా, ఇన్ని తన్నులు తిని ఇంకా అబద్ధమాడుతార్రా" అంటూ ఆ ఇంటరాగేషన్ చేసే ఆఫీసర్ చారిని కట్టెతో కొట్టాడు. ఆ దెబ్బకు తట్టుకోలేక కింద పడిపోయాడు. ఇంతలో ఆరడుగులపైన ఉన్న ఒక ఎస్.ఐ. వచ్చి 16 సం॥ ఆ పిల్లవాన్ని పిడుకలు చేసేముందు పేడను తొక్కినట్లు తొక్కి తన్నాడు. ఆ చిత్రహింసకు తట్టుకోలేక అతడు స్పృహ కోల్పోయాడు. అతణ్ణి తీసి ప్రక్కకు పడవేశారు. నలుగురు పోలీసులు ప్రసాద్‌ను తలుపుసందులోపెట్టి గట్టిగా నొక్కారు. మరికొందరు చుట్టూ నిలబడి సాయిల్ని ఫుట్‌బాల్ను తన్నినట్లు తన్నారు. తుపాకి మడమలతో గుద్దారు.

వీరు చేసిన నేరం, పోలీసుల కల్పిత అభియోగాలను ఒప్పుకోకపోవడం.

ఇంటరాగేషన్ కొనసాగుతూనే ఉంది.

"అరె, నువ్ ఎప్పుడైనా పోలీసు స్టేషన్‌కు వచ్చినావురా!"

'లేదు'.

"అందుకే నీకు పోలీసోల్లంటె భయంలేదురా లంఙ్డికొడుక" అంటూ నన్ను క్రింద పడేసి అందరూ కలిసి బూట్లతో తన్నారు. అందులో ఒక తన్ను నా ఎడమ కన్నుకు తాకింది. కొద్దిసేపు ఆ కన్ను కనిపించలేదు. బాగా వాచిపోయింది- తరువాతనన్ను లేపారు- నీచంగా తల్లినీ, భార్యనూ తిట్టారు.

"పిల్లగాండ్లను నీవు గోడకుర్చీ వేయించుతవా?"

'లేదు'.

"అయితె నువ్ గోడకుర్చీవెయ్"

అట్లాచేయక తప్పలేదు.

"సరిగ్గా ఉండు లంజకొడుకా" అంటూ దగ్గరకు వచ్చాడు ఆ ఆఫీసర్.

"బడిలో ఏ సబ్జెక్ట్ చెప్పుతావు?"

చెప్పాను

"పాఠాలు ఉన్నవి ఉన్నట్లే చెప్తవా?"

"అవును ఉన్నది ఉన్నట్టు చెప్పుతా"

"పాఠంలో లేంది ఏదీ చెప్పవా?"

'నేనట్లాచెప్పను.'

"లంఙ్డికొడుక, ఇంతింత మీసాలుంటె పోరగాండ్లు భయపడర్రా?" అంటూ నా మీసాలు పీకాడు.

ఇంతలో ఒక పోలీసు ఆఫీసర్ ఏవో కాగితాలు తీసుకొని వచ్చాడు. అదిచూసి ఆ ఇంటరాగేషన్ చేసే ఆఫీసర్ చిరునవ్వు నవ్వి ఈలవేశాడు.

''అరేయ్, మామూలుగ కూర్చో''

అలాగే చేశాను. గోడకుర్చీనుండి విముక్తి అయినందుకు చాలా రిలీఫ్ అనిపించింది.

పెన్నూ, తెల్లకాగితమూ యిచ్చారు. వారు చెప్పింది వ్రాయమంటె వ్రాశాను. నా వ్రాతను వాళ్ళవద్ద ఉన్న కాగితాలలోని వ్రాతతో పోల్చారు.

వాళ్ళ కళ్లు మెరిసినవి.

''ఈ రాత నీదేనా?''

'ఊఁ'

"అయితె నీవు కవిత్వం వ్రాస్తనని చెప్పలేదు"

....

"అరేయ్ అయితే నువ్ చెప్పనివి చాలా ఉన్నవి" అంటూ ఆ పెద్దపోలీసుఆఫీసర్ నావద్దకు వచ్చాడు. చిన్న పోలీసు ఆఫీసర్ వద్దగల కాగితాలు తీసుకుని

"లంజకొడుక, దేనిమీదరా నువ్ గేయం వ్రాసింది?"

'వియత్నాంమీద'

మాట పూర్తికాకమునుపే బూటుకాలితో నాతలపై తన్నిండు. తూలి క్రింద పడిపోయా- కళ్ళు చీకట్లుకమ్మినవి. మరొకతను నా చేతులపై నిల్చున్నాడు. చేతికున్న గడియారం పగిలిపోయింది.

"నిల్చో బే"

నా చేతులపై నిల్చున్న ఆఫీసర్ నా మెడలుపట్టి పైకిలేపాడు

"బోసిడికే, ఒక్కతన్నుకు పదహారు దిక్కులపడ్తవ్. 'వియత్నాం వీరుడా' అంటూ గేయాలు రాత్తావురా? నీయవ్వను దెం......"

'వియత్నాం పోరాటాన్ని మన ప్రభుత్వం సమర్థించింది. నేనువ్రాస్తే తప్పా?'

"నాకే ఎదురుప్రశ్న వేస్తావుర" అంటూ నా తలను గోడకు గ్రుద్ది "నీపని నువ్ చేస్కోక ఉక్కతరాగ బతుకక కథలు, గేయాలార నువ్ రాసేది. గవర్నమెంటు నీకు జీతమిచ్చేది చదువు చెప్పుమనా, గేయాలు రాయమనా? ఈ గేయాలువ్రాసి నువ్ సమాజాన్ని మారుస్తావురా? నీ ఆటువంటి తిన్నింటివాసాలు లెక్కపెట్టే నమ్మక్హరాం లను కాల్చిపారెయ్యాలె. మన గవర్నమెంటు చాలా మంచిది. నువ్వనే గవర్నమెంటు వస్తే, గిట్టనివాళ్ళను కాల్చేస్తారు. వాల్లది ఫాసీజం. మనది డొమక్రసిరా. అందుకే నువ్ బతికినవ్..."

ఇంతలో మరొక వ్యక్తిని పైకి తీసుక వచ్చారు.

"వీడేసార్, ఆదర్శ వివాహం చేసుకున్నది"

"ఔనార?"

"ఊ"

"నీ కులంకాని పిల్లనెందుకు చేసుకున్నవురా, నీ పెండ్లాన్నిదె......"

"నాకు కులాలు మతాలంటె విశ్వాసంలేదు"

"ఓహో నువ్ పెద్ద సంఘ సంస్కర్తవన్నమాట"

"నువ్ ఎప్పుడన్న పోలీసు స్టేషన్‌కు వచ్చినావ్, బే"

"ఇదువరకోసారి ఈ విషయంతోనే తీసుకపోయిండ్లు".

"అందుకేరా లంజాకొడుక, నీకు పోలీసోల్లంటె భయంలేదు" అని ఒక్కతన్ను తన్నిండు. చేతిలోగల కర్రతో మరో ఆఫీసర్ తలపైకొట్టాడు-

"నీ పెండ్లి ఎవరి ఆధ్వర్యముల జరిగిందిరా?"

అతడు నావైపు చూసాడు.

"ఇకనువ్ పో"

"నువ్ ఆదర్శ వివాహాలుచేసి సంఘంను చెడగొడ్తానవ్ బద్మాష్ మల్ల నీకేం తెలియదంటవ్".

'మన ప్రభుత్వం ఈ కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తుంది.'

"బోసిడికె, నీ అవ్వను పట్టుక గురాల్లు...... ప్రభుత్వం చేస్తుందని నువ్ చేత్తావుర. నువ్వెంత, నీబతుకెంత, సర్కారుకు తెలివిలేదుర. నీతెలివి ఎవనికికావాల్రా?" ఇంకా ఏదేదో వాగుతూనే ఉండు.

"నీగూర్చి మాకు బాగా తెలుసు. నిజం ఒప్పుకోకపోయినవో నిన్ను కాల్చేస్తా. ఐ హావ్ గాట్ ఫుల్ పవర్స్"అంటూ పిస్టల్ నా ఛాతిపై పెట్టాడు.

రెక్కాడినా బుక్కాడని నా ముప్పైఏళ్ళ జీవితంలోని కష్టాలు కలిగించని అవగాహనను నాలోని అస్పష్టమైనభావాలకి ఒక రూపకల్పనని ఈపోలీసు చిత్రహింసలు, నా ఛాతీపైఉన్న యీ పిస్తోలు కలిగించినవి- నాకు ధైర్యం వచ్చింది.

"మీరు నన్ను కాల్చేసినా, నాపై మోపిన అభియోగం పూర్తిగా అబద్ధం"

"ఇప్పటికి వీన్ని ఒదిలిపెట్టండి సార్"అంటూ నావైపు తిరిగి 'అరే, ఎవడైతె ఏదీ ఒప్పుకోడో వాడే స్టారింగ్ వర్కర్. నువ్ తప్పనిసరి కొన్నైనా ఒప్పుకోవాలి. లేకుంటె నీకిదేగతి. దిస్ ఈజ్ లాస్ట్ చాన్స్ ఫర్ యు. ఇప్పటికి క్రిందికిపో"

పోలీసుకానిస్టేబుల్ నన్ను కిందికి తీసుకవచ్చాడు.

కూర్చోలేని నేను కిందపడిపోయాను. ఒక్కొక్కరినే పైకి తీసుకపోతున్నారు కిందికి తీసుక వస్తున్నారు.

ఇదే తగిన సమయమనుకొని కాబోలు ఆ పోలీసు ఇన్‌ఫార్మర్ నా దగ్గరకు వచ్చి కూచుండు.

"మిమ్ములను బాగా టార్చర్ చేశారా సార్."

ఔనన్నట్లు తల ఊపాడు.

అందుకు తన బాధ వ్యక్తం చేసాడు.

"మనం ఎన్ని బాధలుపడ్డా యు.జి. వాళ్ళను గూర్చి చెప్పొద్దు సార్"

'...........'

"ఎస్ కె, జి.కె....వీళ్ళు ఎక్కడున్నసంగతీ మీరు చెప్పొద్దుసార్, చెప్పారా?" అంటూ నా కళ్ళలోకి సూటిగా చూశాడు.

వీడు అదే వెధవ నాటకానికి ఒళ్ళు మండింది.

'వీళ్ళు నీకు ఎంత ముట్టజెప్పారు ?'

"దేనికి ?"

'వీళ్ళందరికి చేసే ద్రోహానికి, పోలీసులకు చేసే సహాయానికి'

ఈ నా మాటలకు ఖంగుతిని స్పేడ్‌జాకిలాగ ముఖంపెట్టుకొని "నేను అటువంటి వాణ్ని కాదు" అంటూ గొణుక్కుంటూ నా దగ్గరనుండి లేచిపోయాడు.

మరికొద్ది సేపటికి నావంతు వచ్చింది.

నన్ను తిరిగి పైకి తీసుకపోయారు.

మళ్ళీ అదే దృశ్యం.

"కూర్చో" ఆ పెద్ద పోలీసు ఆఫీసర్ కుర్చీ చూపించాడు.

ఈ విపరీత పరిస్థితి ఆశ్చర్యాన్ని కలిగించింది, వాళ్ళు చేసే పన్నాగం అర్థం కాలేదు.

"మీపై ఉన్న అలిగేషన్స్‌లో ఎన్ని నిజం" కథ మొదటికి వచ్చింది.

'అవన్నీ తప్పే'

"సరె మీరు సంఘ వ్యతిరేక కార్యకలాపాలు ఏవీ చేయలేదంటే ఒప్పుకుంటాం కాని మేము చెప్పే ఒక చిన్న విషయం మీరు ఒప్పుకోవాలి."

'ఏంటది ?'

"కోర్టులో మేము చెప్పినట్లు సాక్ష్యం ఇవ్వాలి" నిదానంగా, మందస్మిత వదనంతో అడిగాడు.

అంటే నేను అప్రూవర్‌గా మారాలి. ఇది వారి పన్నాగం. మానవున్ని మానవుడు దోచే వీలులేని సమసమాజ స్థాపనకై ఎందరో మహానుభావులు సుఖాలను ఒదులుకొని కష్టాలను ఆహ్వానిస్తే వారికి వ్యతిరేకంగా, దోపిడీ ప్రభుత్వానికి అనుకూలంగా సాక్ష్యం చెప్పేవాడు ప్రజాద్రోహి. ఆ ద్రోహానికి పాల్పడిందానికంటే, శత్రువు గుండుకు ఎరయై పోవడం మేలు. అప్రూవర్‌గా మారినవాణ్ణి చైతన్యవంతమైన సమాజం ఎన్నడూ క్షమించదు.

ఈ రకమైన ఆలోచన నా మెదడులో కదిలింది.

"బాగా ఆలోచించుకో. నీకు ఉద్యోగముంటుంది. నీవు బీదవాడి వంటానవ్ కదా. నీకు డబ్బుకూడ ఇస్తాం, సరేనా. ఇదిగో ఈ సిగరెట్ తాగు" అంటూ సిగరెట్ ఇవ్వబోతే అలవాటు లేదన్నా.

"మాకు అనుకూలంగా లేకపోతే దాని పర్యవసానం ఏమవుతుందో నీకు బాగా తెలుసు. ఊఁ ఏమంటవ్."

'మీరు ఏంచేసుకున్నా బాధలేదు నాకు ఎవరూ తెలియదు. మీకు అనుకూలంగా సాక్ష్యం ఇవ్వలేను.'

నా మాట పూర్తి అవడం, ఆతని తన్నుకు నా కుర్చీ అల్లంత దూరాన పడిపోవడం ఒకేసారి జరిగినవి.

"ఈ మొండి లంజాకొడుకు వినడు. వీన్ని తీసుకెళ్ళండి."

నన్ను తిరిగి పెద్ద హాల్లోకి తీసుక వచ్చాడు ఓ కానిస్టేబుల్.

మేడపై పోలీసులు వారి పైశాచిక చర్యలను జరుపుతూనే ఉన్నారు. దెబ్బలు తిన్న వారి శరీరాల నుండి కారిన వేడి రక్తకాంతులకు సూర్యుని ముఖం ఎర్రపడింది. ఈ దృశ్యాన్ని ఇక చూడలేనంటూ సూర్యుడు తెరమరుగయిండు. అక్కడ జరిగే చిత్రహింసలకు మేఘాలు గర్జించినవి. అడవిలో మెరుపు దాడి జరిగింది. ప్రకృతి మాత కన్నీరు కార్చింది. భీభత్సంగా మారింది.

'కుఁయ్' మంటూ ఒక జీపు మా హాలు ముందు ఆగింది.

నన్నూ, ఇద్దరు డాక్టర్లనూ, మరొక టీచర్‌నూ అందులో కూర్చోమని ఆజ్ఞాపించారు.

సాయుధులైన రిజర్వు పోలీసులు మా చుట్టూ కూర్చోగా, ముందు సీటులో పోలీసు ఆఫీసర్‌తో మా జీపు అడవిలో తార్‌రోడ్డుపై బుల్లెట్‌లాగ దూసుకపోతూంది-

మేము ఎటు తీసుకొని పోబడుతున్నామో మాకు తెలియదు.

"మమ్మలను ఇప్పుడు ఎక్కడికి తీసుకుపోతున్నారు ?" ఆతురత ఆపుకోలేని ఒక డాక్టర్ అడిగాడు.

అందుకు సమాధానంగా డ్రైవర్ హారన్ చప్పుడు చేశాడు.

చాలా రాత్రికి ఊరి చివరగల ఒక ఇంటిలోకి చేరాము.

చిన్న గది. అందులో నలుగురం. గదిలో చీమల పుట్టలు. కటిక చీకటి. మా గది చుట్టూ పోలీసు బందోబస్తు.

రోజులు గడుస్తూనే వున్నాయి.

ఒక రోజు "మమ్మల్ని ఎందుకు ఇక్కడికి తెచ్చారు" టీచర్, కానిస్టేబుల్‌ను అడిగాడు.

"లంబ్డీకొడుకులు పై ఆఫీసర్లవద్ద మంచోడనిపించుకొని ప్రమోషన్ కొట్టెయ్యాలని అప్పుడప్పుడు ఇట్లనే చేస్తుంటరు సార్. ఇందులో గూడ డబ్బిచ్చినోల్లను రెకమెండేషన్ ఉన్నోల్లను ఒదిలిపెడ్తరు. అట్ల చేయనోల్లను గిట్లనే చేసి చివరకు ఏదో కేసుల యిరికించి జైల్లో పడేస్తరు" అంటూ చెప్పాడు.

అన్నట్లే ఆపై వారంరోజుల్లో నాలుగు పోలీసు స్టేషన్లు తిప్పి ఒకరోజున మమ్ములను అంతరంగిక భద్రతా చట్టంక్రింద సెంట్రల్ జైల్లో పెట్టారు.

రెండు సంవత్సరాల కారాగార శిక్ష అనుభవించి బయటపడిన తరుణంలో నైజీరియా ప్రముఖ కవీ, నాటక రచయితా అయిన వోల్ సోయంకె అన్నట్లు "జైలులోకి వెళ్ళేముందు కంటే జైలు నుంచి బయటపడిన తర్వాత నా విశ్వాసాలు అభిప్రాయాలు మరింత దృఢమైనవి."

జైలులోకి అడుగుపెట్టగానే పై మాటలు గుర్తుకు వచ్చినై.

పాలస్తీనా కథ :

తీర్పు

[అమెరికన్ సామ్రాజ్యవాదుల ముద్దుబిడ్డ ఇజ్రాయిల్ సృష్టించబడి నప్పటినుండి తమ మాతృభూమి సంరక్షణకై పాలస్తీనా ప్రజానీకం సాయుధులై పోరాడుతూ రెండు అగ్రరాజ్యాల కుతంత్రాలను ఇజ్రాయిల్ దురహంకార విస్తరణవాదాన్ని అరబ్ అభివృద్ధినిరోధక పాలకవర్గాలను ప్రతిఘటిస్తున్నారు. పాలస్తీనా జాతీయ విముక్తి ఉద్యమానికి దీటైన ప్రతిఘటనా సాహిత్యం వుంది. అందులో ఒక భాగమే ఈ చిన్న కథ 'తీర్పు'. అరబ్బుల అమాయకతను, అజ్ఞానాన్ని, అసహాయతను యూదులు ఏవిధంగా వినియోగించుకుని వారి ఇండ్లను, పొలాలను, భూములను ఆక్రమించుకున్నదీ ఇందులో ఇతివృత్తంగా తీసుకోబడింది. నిజానికి ఇది కథ కాదు, వాస్తవ గాథ. అయితే దీనికి కథా రూపాన్ని కల్పించి ఒక అరబ్ కమ్యూనిస్టు పత్రిక ప్రచురించింది. 'ఘసన్ కన్ఫానీ' అనే పాలస్తీనా సాహిత్యయోధుడు 1967లో బీరూట్‌లో జరిగిన మూడవ ఆఫ్రో-ఏషియన్ ప్రజల సంఘీభావ సదస్సులో 'ఆక్రమిత పాలస్తీనాలో ప్రతిఘటనా సాహిత్యం' అన్న పేరుతో సమర్పించిన డాక్యుమెంటులో ఈ గాథ పొందుపరచబడింది. 'కేవలం ఒక కలం, కాగితంతో ఒక గెరిల్లా బృందంకన్నా శత్రువును ఎక్కువగా దెబ్బతీసే ఘసన్ కన్ఫానీ' పాపులర్ ఫ్రంట్ ఫర్ ది లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా (PFLP) అధికార ప్రతినిధి, దాని పత్రిక 'అల్‌హదఫ్' సంపాదకుడుగా వుండేవాడు. 1972 జులై 9వ తేదీన ఒక ఇజ్రాయిల్ గూఢచారి ముఠా ఆయనను హత్యచేసింది.]

సర్వే అధికారి వచ్చి తనకున్న కొద్దిపాటి భూమినీ కొలిచి తన రిజిష్టరులో వ్రాసుకొని దానికి కారణం ప్రభుత్వానికీ, ఇబ్రహీమ్ ఎల్‌హమీద్‌కు మధ్యగల 'వివాదమే' నని చెప్పినప్పుడు హమీద్ ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. ఇంకా పైగా "రిజిష్టరు చేసుకోవయ్యా, రిజిష్టరు చేసుకో ! కలము, కాగితంకన్నా మరేదీ చౌకగా లేదు— నేను మాత్రం నా పొలాన్ని ఇచ్చేది లేదు" అని చెప్పాడు.

దాదాపు 50 ఏళ్ళుగా తను ఆ పొలం ఎరుగును. తను చిన్నపిల్లాడుగా వున్నప్పుడు ఆ పొలంపనులలో తండ్రికి చేదోడువాదోడుగా వుంటుండేవాడు. తండ్రిమరణానంతరం తనే ఆ పొలాన్ని సాగుచేయసాగాడు. అదే విధంగా ఇప్పుడు కూడా పొలాన్ని దున్ని సాగుచేసుకుంటున్నాడు.

రోజులు దొర్లుతున్నాయి దాదాపు ఒక సంవత్సరం గడిచింది. ఆ "వివాదాస్పదమైన" భూమి విషయమై హైఫాలోని కోర్టులో హాజరు కావలసిందిగా తనకు తాఖీదు అందేటంత వరకు ఆ సర్వే ఆఫీసరు రికార్డుచేసిన విషయాన్నే మర్చిపోయాడు హమీద్. విచారణ జరిగే రోజున తన చిన్నకొడుకుని వెంట పెట్టుకుని హైఫాలోని కోర్టుకు హాజరయ్యాడు.

"అబ్దుల్ హమీద్, అబ్దుల్ హమీద్, అబ్దుల్ హమీద్" మూడు సార్లు కోర్టు జవాను గాడిదలా ఓండ్ర పెట్టాడు

హమీద్ కోర్టు హాలులో అడుగుపెట్టాడు. విచారణ మొదలయింది.

"ముగ్దెల్‌కురమ్ ప్రాంతంలో గల 48వ నెంబరు భూమికి 1967 కి పూర్వం నీవే హక్కుదారువని, యజమానివని రుజువుపరచుకోగలవా ?" జడ్జీ ప్రశ్నించాడు.

అబ్దుల్‌హమీద్ ఇలా జవాబిచ్చాడు– "అవునండి అయ్యగారు ! నేను ఆ పొలాన్ని మా తండ్రిగారి నుండి వారసత్వంగా పొందాను నా తండ్రిగారి, మీ తండ్రిగారి ఆత్మలకు శాంతి చేకూర్చవలసిందిగా ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను."

"నీ చెత్తవాగుడు కట్టిపెట్టు. నీ తండ్రి గొడవ ఇక్కడెందుకు ? నీ వాదనను రుజువు పరచుకునేందుకు నీ దగ్గర ఏమయిన దాఖలాలు. రుజువుపత్రాలు వున్నాయా ?" జడ్జీగారు గాండ్రించారు.

కొంచెంసేపాగి హమీద్ ఇలా అన్నాడు– "అయ్యా, నేను మళ్ళీ చెబుతున్నాను. దాన్ని నేను మా తండ్రిగారి నుండి పొందాను. 15వ ఏట నుండి నా తండ్రితో కలసి ఆ పొలాన్ని సేద్యం చేశాను."

"ఇది రుజువు క్రిందికి రాదు" జడ్జీగారింకా ఇలా అన్నారు– "సరే ఆ పొలంలో 60 శాతం రాళ్ళమయం. కాబట్టి అది ప్రభుత్వ ఆస్తి అవుతుంది"

"ఏంటీ ?– అరవై శాతమా, డెబ్బై శాతమా ? ట్రాక్టరు ఒక్కదెబ్బకు దున్ని అవతలపారేస్తుంది. అయ్యా, ఒకటీ అరా రాళ్ళువుంటే వుండవచ్చు– కానీ ఒక్కొక్క రాయి నుండి ఒక్కొక్క ద్రాక్ష తోటను పండించవచ్చు. అదేమీ వట్టిపోయిన భూమి గాదు. మా తండ్రిగారు తన జీవితాన్నంతా ఆ ఉన్న నాలుగురాళ్ళు ఏరివేసేందుకే అంకితం చేశాడు. నేనూ అదే చేస్తున్నాను. అయినా అంతగా ప్రభుత్వం కావాలనుకుంటే నా పొలం తప్ప మరేమీ కనబడలేదా ?" దాదాపు అరచినట్లుగా ప్రశ్నించాడు హమీద్.

దానితో జడ్జీగారి కోపం తారాస్థాయికి చేరుకుంది. "ఇటువంటి చెత్తవాగుడు కట్టి పెట్టవలసిందిగా మరోసారి హెచ్చరిస్తున్నాను. ఇతరుల ఆస్తిని ప్రభుత్వం అనవసరంగా ఆక్రమించదు. అసి దాని హక్కు కూడా" అంటూ తీవ్రంగా హెచ్చరించాడు.

"హక్కా"— వ్యంగ్యంగా అన్నాడు హమీద్ "అయ్యా, ప్రభుత్వం చాలా బలమయినదని నాకు తెలుసు. నాకేమున్నది- నాలుగెముకలు, కాస్త కండ తప్ప. అటువంటి నాపైన ప్రభుత్వం కలియబడటం..."

"ఏయ్ మనిషీ ఇటు చూడు. నువ్విప్పుడు కోర్టులో వున్నావు. అర్థంలేని పిచ్చివాగుడు వాగకు" జడ్జీగారు మరోమారు హెచ్చరించి కొంచెం సేపాగి ఇలా అన్నారు- "సరే ప్రభుత్వం సగం పాలు తీసుకుని మిగతా సగం నీకే ఇచ్చేస్తుంది. దీనికేమంటావు ?"

హమీద్ తల అడ్డంగా త్రిప్పుతూ "అయ్యా, నాకు ప్రభుత్వం అనే అన్నయ్య వున్నట్లుగాకాని, వాడితో ఇలా వాటా పంచుకోవాలనిగాని మా నాన్న నాకెప్పుడూ చెప్పలేదే !" అన్నాడు.

జడ్జీగారు సహనం కోల్పోయారు- "ఇదిగో ముసలాడా ! ఈ నిర్ణయానికి నీవు కట్టుబడి వుండటం సమంజసంగా వుంటుంది. సమాధానం సూటిగా చెప్పు. దీనికి నీవేమంటావు" అంటూ తీక్షణంగా చూశారు హమీద్‌వంక.

"భగవంతుని సాక్షిగా చెప్తున్నాను. అయ్యా, మీ తీర్పు ఏడ్చినట్లుగా వుంది, చాలా దారుణంగాను, చీకటిలా భయంకరంగానూ వుంది" అంటూ బోను దిగి "అన్యాయమైన తీర్పు ఎంతో కాలం జీవించదు" అని గొణుక్కుంటూ, తన చేతికర్ర పొడుసుకుంటూ వెళ్ళిపోయాడు అబ్దుల్ హమీద్.

(స్వేచ్ఛానువాదం: రవి)

సృజన చందా దారులుగా చేరండి

సృజన మీ పత్రిక పీడిత ప్రజల పత్రిక, పేపర్ మరియు ప్రింటింగ్ ధరలు ఆకాశాన్నంటుతున్న ఈ రోజుల్లో సృజనలాంటి పత్రికలు ఆర్థికంగా చాలా కష్టాలు ఎదుర్కొంటవి. వెంటనే తాము చందా దారులుగా చేరి, తమ మిత్రులను చేర్పించడం ద్వారా, విరివిగా విరాళాలు అందించడం ద్వారా విప్లవ సాహిత్య వేదిక 'సృజన'ను నిలబెట్టుకోవాల్సిందిగా కోరుతున్నాం.

చేదుపాట

విజయ్

పాటకు తలవూపితె
అభిమానివిఅయిపోవూ
పాటలోని నిజంకొరకు
పాటుపడకపోతే
కన్నులుండి ఫలం ఏమి
నిజంచూడలేవూ
నిజందాచు నీచులనూ
నిలదీయగలేవూ
మెదడు నీకు వుందిగాని
విచక్షణా ఏదీ
దోపిడీని పరిమార్చే
ఆలోచన ఏదీ ॥పాటకు॥

నీతులు వల్లించగనే
నాలుక అయిపోదూ
నడకలోన నీ నీతిని
నిరూపించిచూపూ
మనిషివైతె మాత్రమేమి
అదేగొప్పకాదూ
మానవతను నిలుపుకొనే
దీక్ష ఏది నీకూ ॥పాటకు॥

కుళ్లుధర్మవన్నాలకు
పరవశింతువేమి
కూటికొరకు కోటియనీ
సర్దుకుపోతావూ
బ్రతకడమే భాగ్యమనే
భయస్థుడవునీవూ
బ్రతుకుకొరకు చావగలా
చేవగలిగిలేవూ ॥పాటకు॥

జీవితమిది పోరాటం
రాజీపడకోయీ
నీ బ్రతుకును మార్చుకొనే
విధాత నీవేనోయ్.

బాదరాయని సంబంధం

రామయ్య

ఆకాశానికి నేను
నాకథ చెపుతున్నాను
ఉత్తర దక్షిణ ధృవాలు
ఊ కొడుతున్నాయి

అనగనగా భూగోళం
భూగోళం అంతటా నా
భాగస్వాములు
పురప్ బాధ స్వాములు

వాళ్ళకూ నాకూ
బాధరాయని సంబంధం
మేమంతా బాగా బాంధవులం
పరస్పరం రక్త సంబంధులం
అందుకే
రక్తదానానికీ - రక్తపానానికీ
సంసిద్ధులం
మా అందరికీ - విడివిడిగా
తలా ఒక గుండె

అన్ని గుండెల్లోనూ సమష్టిగా
ఒక్కటే ఒక్క మంట
"విప్లవం"

మా అందరికీ విడివిడిగా
తలా ఒక గొంతు
అన్నిగొంతుల్లోనూ - ఏకగ్రీవంగా
ఒక్కటే ఒక్కమాట
"విప్లవం"

మా అందరికీ విడివిడిగా
తలా ఒక ముఖం
అన్ని ముఖాలు - మొత్తంగా
ఏకోన్ముఖం

మా అందరికీ విడివిడిగా
తలా ఒక బ్రతుకు
అన్ని బ్రతుకుల్లోనూ - నగ్నంగా
ఒక్కటే ఒక్కబాధ
ఆరని ఆకలి

అందుకే మా అందరిదీ
బాదరాయని సంబంధం
మేమంతా బాధా బాంధవులం
పరస్పరం రక్త సంబంధులం.

అపూర్వ వర్ణ ప్రజ

ఎవరో నిముషాల కుట్రలో
అపూర్వవర్ణగా మారిపోయి-
వేలాది సంవత్సరాల
పోరాట ప్రవాహకాలాన్ని
వెన్నుపోటు పొడవాలనే
ప్రయత్నంలో ఉన్నారు.
మండే సూర్యుణ్ణి -
పట్టిచ్చి తాము ఏవేవో సుఖాలు
పొందాలనే -
'భ్రమ'లో ఇంకెవరో
ఘోరంగా దగా పడుతున్నారు.
హోరుగా వీచే
తూర్పు పవనాన్ని
బంధించడానికి-
'ఆచూకి' తెలుపుతానని,
ఇంకో 'వెర్రివాడు'
'తుచ్ఛమైన కలలు' కంటున్నాడు.
ఈ కాలాన్ని ఏమని ప్రశ్నించాలి?
ఈ మండుతున్న సూర్యుణ్ణిదాచే -
చోటేది ?
ఈ పవనాన్ని ఏ చెట్లు -
తమకొమ్మల్లో దాయగలవు ?

వంచకుల నీతి శాస్త్రం

ఖిషం

నిన్న ప్రజాస్వామ్యాన్ని పట్ట పగలు హత్య చేసిన వాళ్ళను
పట్టుకోవడానికి 'ప్రజాస్వామ్యం' అడ్డొస్తుందట నేడు.

నిన్న చట్టాన్ని సమూలంగా నేల రాచిన వాళ్ళను
'చట్ట' ప్రకారం పట్టుకోవాలట నేడు.

నిన్న లక్షలాది ప్రజలని కారణంలేకుండా కటకటాల్లో కుక్కినవాళ్ళని
పట్టుకోవడానికి 'కారణాలే' కనిపించడం లేదట నేడు.

నిన్న అమాయకులను ఉరికంబా లెక్కించిన వాళ్ళను
బోనెక్కించడానికి 'సమయం' రావాలట నేడు.

నిన్న అరవయి కోట్ల మందిని ముప్పు తిప్పలు పెట్టిన వాళ్ళ
తప్పేందో మెప్పుగా 'వాకబు' చేయాలట నేడు.

నిన్న ప్రజల్ని వంచన చేసి తుపాకులతో తూట్లు పొడిచిన వాళ్ళకు
'తుపాకులు' రక్షణ ఇవ్వాలట నేడు.

నిన్న ఇల్లును నేల మట్టం చేసిన వాళ్ళ
ఇళ్ళకు 'రక్షణ' ఇవ్వాలట నేడు,

నిన్న వీధులలో జనాన్ని కాల్చి చంపిన వాళ్ళని
విడుదల చేయాలని వీధులలో 'ప్రదర్శనలు' జరపాలట.

నిన్న ప్రజల అందరి హక్కులను హరించిన వాళ్ళ
'హక్కుల'ను పదిలంగా కాపాడాలట నేడు.

నిన్న పత్రికల, రేడియోల గొంతు నులిమిన వాళ్ళకు
వంత పాడాలని గొంతెత్తి 'గోల' పెట్టాలట నేడు.

నిన్న 'మీసా'ను రద్దు చేయడానికి మీసాయం కావాలన్న వాళ్ళు
మోసం చేసి 'మినీ మిసా'ల్ని చూపుతున్నారు నేడు.

నవోదయం కోసం పాటలు

రోజూ వుదయం వస్తూనే వున్నది. కాని కొత్తదనం తెస్తూలేదు. మామూలుగా- రేడియోలు, గుళ్ళమీది మైకులూ– 'సుప్రభాత' గీతాలు పాడుతూనే వున్నాయి. నాడు గాంధీ పేరునా-. నేడు జె.పి. పేరునా- 'సర్వోదయ' నినాదాల నాదాలు వినిపిస్తూనే వున్నాయి. అయినా యీ దేశంలో శ్రమజీవులు యింకా వెలుగు చూడలేదు. సూర్య గోళాలే వాళ్ళ కళ్ళయి వున్నాయని వారికి తెలవదు. కనురెప్పలు విప్పడం కావాలి. ఇందుకోసం ప్రజాకవులు, గాయకులు తమ వంతు పని తాము చేస్తున్నారు. దోపిడి, పీడన లేని నవోదయం కోసం రాస్తున్నారు పాడుతున్నారు.

ఈ ప్రయత్నంలోనే నవోదయ సంస్థవారు ప్రచురించిన పుస్తకం 'జనంపాటలు'. ఇందులో 31 పాట లున్నాయి.

ఎక్కువ పాటలు– కూలి, పాలేరు, పేదరైతు లాంటి గ్రామీణ పేదల కోసం రాసినవి. ఐదు పాటలు కార్మికుల కోసం, రెండు విద్యార్థుల కోసం పోగా– మిగిలినవి పీడితులందరూ పాడుకోను పనికి వస్తాయి.

మొత్తం పాటల్లో ఎక్కువ భాగం 'జీవనాడి' లోనివనీ, కొన్ని పాటలు ఇతర ప్రజాకవులు రాయగా ప్రచారంలో వున్న పాటలనీ- ముందు మాటలో చెప్పారు. రచయిత లెవరయినా అవి జనంలోకి పోయాక జనం పాటలు అవుతాయి గనుక రచయితల పేర్లు లేకపోవడం అర్థవంతంగా వున్నది.

ప్రజలు పాడుకునే పాటల్లో, మంచి దరువు (పల్లవి), సామాజిక సంఘటనలతో సంబంధం వున్న వస్తువు ముఖ్యంగా వుండాలి. ఇక- తీసుకున్న వస్తువు కవి అనుభవంలోనిదై, దాని గురించి కవి తగినంత అధ్యయనం చేసి వుండి, ప్రజల సజీవమైన భాషను వాడడంలో శ్రద్ధ తీసుకుంటే మంచి పాటలు వస్తాయి. 'కళ- రూపంలో దేశీయమై, సామ్యవాద భావనతో కూడివుండాలి'– (Art must be national in form but socialistic in content. - స్టాలిన్) అనే మాటలు జనం పాటలకూ వర్తిస్తాయి.

పాటలు పాడగా విని జనం ప్రతిస్పందన కూడ చదివి సమీక్షించడమే ఒక విధంగా న్యాయమైనా, పై ప్రాతిపదికమీద చదివి మంచి పాటలను చాలా వరకు సరిగానే ఎన్నిక చేయవచ్చు.

పయనం, ఇడిసిన ఒడిసెల మడిసేది లేదు, ఎన్నాళ్ళీ కాపురాలు, యేరన్న రాక మునుపే, అడివక్కా- అడివక్కా- పాటలు ప్రజల భాషలో రాసిన మంచి పాటలు.

'ఎన్నాళ్ళీ కాపురాలు' పాణిగ్రాహి 'జనం నడవాలి'కి రూపాంతరం. బుర్రకథ నాజర్ కూడా కొంచెం మార్పుతో ఈ పాట పాడేవాడు. 'అడివక్కా అడివక్కా' పాటలో వాడిన పదజాలంలో యిమడని మాటలు— 'గమ్మున', 'లాగేవు', 'లాగుతుంటే'. ఈ పాటలో మాత్రమే కొన్ని పదాలకు ఫుట్‌నోట్స్ యిచ్చి, మిగతా పాటల్లో ఇట్లాంటి పదాలకు యివ్వలేదు.

యేనాటి కానాడు, బతుకు చూపిన బాట— యీ రెండు పాటలు కూడా చక్కని పాటలు. అయితే కొన్ని చిన్న మార్పులు చేయాలి. 'యేనాటి కానాడు'లో 'ఏడు పే తరుగురా ఓరన్నా' అనే చరణంలోని అర్థం ఏమిటో సరిగా అందడం లేదు. 'మనకు ఏందిరా ఈ బతుకు కూలన్నా' అనే మాటలు 'మన బతుకు ఏందిరా కూలన్నా' అనే రీతిలో వుంటే బాగుంటాయి. 'కాడ'కున్న, 'అర్ధరాత్రి', 'నిదురకండ్లతో' వున్న 'తూలుతూ' పదాలు— వ్యవహార రీత్యా చూస్తే ఆ పాటలో అతకనివి. 'బతుకు చూపిన బాట'లో 'దాంట్ల ఒక్కొత్తు నేనెరుగలే' చోట 'దాంట్ల ఒక్కొత్తు నా కెరుకలే' వుంటే బాగుంటుంది. తోడను, చచ్చేకన్ననూ, కొరకు— ఈ పదాల చోట్ల— తోటి, సచ్చే కంటె, కోసం— పదాలు వాడివుండాల్సింది. 'కన్నీళ్ళ కరువుతోనూ' అంటే ఏడిస్తే కన్నీళ్ళు కూడా రావడం లేదనే అర్థమైతే రావడంలేదు. "నాకు ఏ పూట పని దప్పలే/ నాకు బువ్వ కెప్పుడు తిప్పలే" అనే చరణాలు ఈ పాటకు మంచి ఆభరణాలు.

'భూమికోసం' మంచి పాటే అయినా గొట్టుమాట లున్నాయి కొన్ని. విద్యార్థుల పాటల్లో బలం లేదు.

'అంతర్జాతీయ శ్రామిక గీతం' అనువాదం పాడుకోవడాని కంత అనువుగా లేదు. ఈ పాట క్రింద కొంచెం నోట్స్ యిచ్చి వుండవలసింది: విప్లవ సాంస్కృతిక దళాలు కార్యక్రమం చివర ఈ పాటను తప్పనిసరిగా పాడాలి. సభలూ సమావేశాల్లో ముగింపుగా కూడా. ఈ గీతానికి ప్రపంచ ప్రజలంతా పాడుకునే ఒకే పల్లవి వున్నది. ఆ పల్లవిలోనే ఈ పాట పాడాలి.

'పీడితలోకం తాడితలోకం' లో "నీ భుజబలమున— నిర్మించిన ఈ/భవ్య భవనమును— పరద్రోయుటకై" 'పగతురు' 'సాగిరి ముందుకు' అంటూ కార్మిక కర్షకులను కాలరాచే దుకు అభివృద్ధి నిరోధకులు ఐక్యమై 'ముందుకు' పోతున్నారని చెప్పడం— అందునా ఈ మే—డే పాటలో— బాగా లేదు.

'మార్గదర్శులు' పాటలో "నల్లవారి కెదురు నేడు/నడుం గట్టి నడిచెటోళ్లు" అనే చరణాలలో నల్లవారంటే నల్లదొరలన్న అర్థం రాదు; పీడితులు— ముఖ్యంగా ఆఫ్రికన్ ప్రజలు— అనే అర్థమే వచ్చి భావాన్ని తలక్రిందులు చేస్తుంది.

భవ్య భవనము, బ్రతుకులు, అంధకారము, దురాగతాలు, ప్రతిఘటించు, దురాత్ములు, కండ్లనీళ్ళు, అడుక్కు తిందామంటె, కళ్ళల్లో కదలాడుతున్నారు, ప్రాప్తం, స్వేచ్ఛ, దారిద్ర్యం, సమతా స్వాతంత్ర్యరాజ్యం, మధనపడి, మేధావుల శాస్త్రఫలము, ఉద్ధరణ, భోజులు– యిట్లాంటి బరువైన మాటలు– "మంచి రచనలు చేయడానికి... ప్రజల మధ్య జీవించాలి. వాళ్ళ బ్రతుకులు పరిశీలించి వాళ్ళ పలుకుబళ్ళు పట్టుకోవాలి..." (పేజి 10) అనే సత్యానికి అనుగుణంగా లేవు. 'నీవు' చోట 'నువు' జనం మాట. ("తెలుసుకో": పే. 11)

పీఠికలో– "పాటలు సాహిత్యరూపమే గాక, కళారూపం గూడా" అనీ, "పాట రచనా రూపం మాత్రమే కాదు కళారూపం కూడా" అనీ రాసే– సాహిత్యం కళారూపం కాదా అని 'చేరా' తప్పుపట్టారు. ('ప్రజాసాహితి' అక్టోబర్ 77 సంచిక). సాధారణంగా సాహిత్యం, కళలను వేరువేరుగా చూడడం జరుగుతుంది. సంగీతమనే కళారూపంతో కూడా యీ పాటలున్నాయని 'నవోదయ' వారు చెప్పింది పొరపాటేమీ కాదు. యితర రచనల కన్న పాటలు ఎట్లా శక్తివంతమైనవో, ఎందుకు ప్రజల దగ్గరికి సులువుగ పోగలవో చెప్పారు. ఇక– "మాండలికం తెలియని వారికి ఈ పాటలు పాడుకొనడం ఇబ్బందిగా వుండేమాట" నిజమే అయినా 'మాండలిక భాష' యితర భాషలకువలె తెలియకుండా పోదు. "సులభంగా అర్థమయ్యే సాధారణభాష", "శిష్టవ్యావహారికం" ఒకటి కాదు.

"గొంగ దేడున్నదో। గొడ్డ లేడున్నదో।
నిప్పు సంచేడుందో। నీళ్ళ తిత్తే డుందో।"

అనే స్థితిలోనే వున్నా–

"అదునుజూసుకోని మొదలంటు గొయ్యాలె
కూడగట్టె నువ్వు కూలోల్లనూ"

అనే ఆశయంతో, "పేదోళ్ళ కష్టాలు గట్టుకెక్కాలని" నవోదయవారు చేసిన ప్రయత్నం అభినందనీయం. 'అనంత జీవిత సంగ్రామం' 'అంతం కాదిది ఆరంభం.' రాత్రి దేవుళ్ళను నిద్రలేప ప్రయత్నించే 'సుప్రభాత' గీతాలూ, పేదలను 'హటాయించే' 'లీడర్ పాట్' 'గరీబీ హటావో' నాదాలూ, 'సంపూర్ణ విప్లవం' పేరున మ్రోగే 'సర్వోదయ' వినాదాలూ– రోజూ చేస్తున్న విషప్రచారపు రొదను ఎదుర్కొను తగినన్ని జనం పాటలు రావాలి.

– జీ. డీ.

జనం పాటలు (పాటల సంకలనం)
రెండవ ముద్రణ: ఆగస్టు 1977 నవోదయ సాంస్కృతిక సంస్థ
వెల: ఒక రూపాయి 2-1-1/5, నల్లకుంట, హైదరాబాద్ 500 044

వ్యాసం :

స్వేచ్ఛ

బూర్జువా భ్రమలు - ఒక పరిశీలన

ఏనాడో ఎచ్.జి. వెల్స్ కమ్యూనిస్టు వ్యవస్థనుగూర్చి మాట్లాడుతూ, అది ఒక గొప్ప ప్రయోగమంటూనే మానసిక స్వేచ్ఛకు మాత్రం అందులో తావులేదని వాపోయాడు. ఇక- బెర్ట్రాండ్ రసెల్ స్వేచ్ఛను అనుభవించడమే మానవ జీవితానికి అతి ముఖ్యమూ, అత్యున్నతమూ అయిన గమ్యం అన్నాడు. ఫిషర్ దృష్టికి గడచినరెండు మూడు శతాబ్దాల యూరప్ చరిత్ర అంతా కేవలం స్వేచ్ఛకోసం జరిగిన పోరాటంగానే కనిపించింది. ఈ విధంగా ఎందరో కళాకారులు, వైజ్ఞానికులు, తాత్త్వికులు ఎన్నో విధాలుగా స్వేచ్ఛను కీర్తిస్తూ, దానిని అనుభవించే హక్కును గూర్చి నొక్కి చెప్పుతూ వచ్చారు.

నిజమే, న్యాయం, సౌందర్యం, సత్యం- యింకా మననోటికి సులభంగా వచ్చే ఎన్నో మంచి విషయాల్లో 'స్వేచ్ఛ' కూడా అతి ముఖ్యమే. కాని యిక్కడ మనకు ఎదురయ్యే పెద్ద చిక్కు ఒకటి వుంది. పదజాల ప్రయోగంలో ప్రవీణులైన కళాకారులు కాని, పదార్థ పరిశోధకులైన శాస్త్రవేత్తలు కాని లేక పద, పదార్థాల సంబంధాన్ని అన్వేషించే తాత్త్వికులు కాని, తాము యింతగా అంటున్న స్వేచ్ఛకు ఖచ్చితమైన అర్థాన్ని ఎన్నడూ నిర్వచించలేదు- ఇదేదో అతి స్పష్టమైన విషయమన్నట్లు దీని నిర్వచనంపట్ల ప్రతివానికీ ఏకాభిప్రాయం ఉన్నట్లు వీరు మాట్లాడుతారు.

నిజానికి 'స్వేచ్ఛ అంటే ఏమిటి?' అనే విషయంమీద చరిత్ర పొడవునా ఎంత రభస జరిగిందో ఎవరికి తెలియదు? కర్మ, విధిలిఖితము, అదృష్టం, మోక్షం-యింకా యిలాంటివన్నీ మనిషి సంకల్పమూ, ఆచరణా, స్వేచ్ఛలను గూర్చిన తగాదాలే కదా! గ్రీకులు, రోమనులు, హిందువులు, బౌద్ధులు, మహమ్మదీయులు, కేథలిక్కులు- యీ అందరిలోను స్వేచ్ఛను గూర్చి ఎవరి అభిప్రాయాలు వాళ్ళవిగానే వుండటం చూస్తున్నాం. మరి, ఈ బూర్జువా మేధావులంతా స్వేచ్ఛను ఒక స్పష్టమైన, విశదమైన భావనగాను, అందరికీ ఒక్కలాగే అర్థమయ్యేదిగాను, యిక దానిని నిర్వచించాల్సిన అవసరంలేని విషయంగాను ఎందుకు చిత్రిస్తున్నారు? రస్సెల్ స్వేచ్ఛకు యిచ్చిన అర్థం ఏమిటో ఆయన ఏ రచనల్లోనూ స్పష్టంగా వ్యక్తం కాలేదు.

అయితే, స్వేచ్ఛను గూర్చిన ఈ అస్పష్ట శబ్దాల ప్రయోగంలో ఈ మేధావుల ఉద్దేశ్యం ఏమైవుంటుంది? చరిత్ర పొడవునా ఆ పదం యొక్క అర్థం నిశ్చలంగా

వుందని నమ్మడంవల్ల కావచ్చు- లేదా- ఆ పదాన్ని సమకాలీన బూర్జువా అర్థంలో వాడుతూ వుండవచ్చు. అర్థం నిశ్చలమని నమ్మితే మరి స్వేచ్ఛను గూర్చి తరచుగా జరుగుతుండే వాదోపవాదాలకు అవకాశమే వుండకూడదు. ఈ మేధావులకు అంత చిల్లర నమ్మకం పొరపాటున కూడా వుండదు. కనుక వీరి ఆశయం ప్రకారం స్వేచ్ఛ అనేది వాళ్ళవాళ్ళ పరిస్థితుల్లో మానవుల అనుభూతికి వచ్చేది. అంటే- ఆ సమయంలో తాము భరించగలిగిన దానికన్నా అధికంగా నిర్బంధాలు విధింపబడక పోవడమే వాళ్ళ వుద్దేశ్యంలో స్వేచ్ఛ.

మొత్తం మీద- వీళ్ళు అనే స్వేచ్ఛ విలకడలేనిది. వాళ్ళ వాదాన్ని బట్టి చూసినా తమ తమ దేశాల్లోని ప్రజలంతా ఒకే పరిస్థితుల్లో లేరు. ఉదాహరణకి- 'ఏ' అనే ఆయన వున్నాడు. బాగా చదువు కున్నాడు. మధ్యరకం ఆదాయం కలవాడు. చుట్టపక్కాలూ, చుట్టూ అనుకూలమైన స్నేహితులూ వున్నవాడు. కారు కొనలేడు కాని దూరంగావున్న సినిమాకు అప్పుడప్పుడు భార్యాపిల్లలతో వెళ్ళడానికి ఒక కారుంటే బాగుంటుందనుకుంటాడు. ఇదే అతని దృష్టిలో స్వేచ్ఛ. కారు కావాలి- కాని కమ్యూనిజాన్ని లేదా ఫాసిజాన్ని, అదీ కాకపోతే ప్రస్తుత వ్యవస్థనీ దుయ్యబట్ట గలడు. ఇలాంటి 'ఏ'కి నిజంగానే స్వేచ్ఛ వున్నది అనుకుందాము. (లేదనే విషయం కొంచెం ముందుకు వెళ్ళి తెలుసుకుంటాం).

సరె- 'బి' అనే అతని మాటేమిటి? అతడు వారంలో ఏడు రోజులూ చెమటోడ్చి పని చేస్తాడు. బట్టల దుకాణంలో అమ్మకందారుడు. ఏ శ్రామిక సంఘాల అసరా లేనివాడు. కళ, విజ్ఞానం, తత్త్వం- ఏమీ ఎరగడు. ఏవో కొన్ని మూఢ నమ్మకాలే తప్ప అతనికి వేరే సంస్కృతి లేదు. దేవుడు, దయ్యాలు, నరకం, పాపం, కామవాంఛల నీచత్వం- యిలాంటి అన్నిటిమీద నమ్మకం. పత్రికలు చదువడు. చదిలే తీరిక లేదు. చచ్చిన తర్వాత (అదృష్టంవుంటే) స్వర్గ సుఖాలు లభిస్తాయని నమ్మతాడు. ప్రస్తుతానికైతే తాను చేసే ఏ చిన్న పొరపాటువల్లనైనా యజమానికి కోపం వస్తే తన బతుకు ఏమవుతుందో అనే నిత్య భయం అతన్ని వెంటాడుతుంది.

ఈ 'బి'కి స్వేచ్ఛను పెంచుకునే తీరిక లేకపోవడం పెద్దయిబ్బంది. కాని 'సి'కి యీ యిబ్బంది లేదు. ఎందుకంటే అతను నిరుద్యోగి. రోజుకు యిరవై నాలుగు గంటలూ అతగాడు స్వతంత్రుడే. వీధుల్లోకి, పార్కులకు, ప్రదర్శనశాలలకు, ఎక్కడికైనా- పోయే స్వేచ్ఛ అతనికి వుంది. దేన్ని గురించి ఐనా సరె- ఆలోచించే అవకాశం వుంది. ఐన్‌స్టయిన్ సిద్ధాంతం, కర్మ సిద్ధాంతం, వినోబాగారి భూదానోద్యమం,

సంజయ్ గాంధీ కార్ల ఫ్యాక్టరీ వగైరా... వగైరా... కాని విచారమేమిటంటే అత డిదేమీ చేయడు. రోజూ పెళ్ళాంతో పోరాడుతాడు— తన నెందుకూ అక్కరకురాని వాడంటుందని. పిల్లలమీద చికాకు పడతాడు. స్నేహితులతో తగాదాలు. కాని అదృష్ట వశాత్తు అతనికొక స్వేచ్ఛ వుంది. వురి పెట్టుకోవచ్చు. భార్య యింట్లో లేనప్పుడు, చావడానికి కావలసిన నాలుగు పైసలు ఏ గూట్లోనో వున్నప్పుడు.

'ఏ'కి స్వేచ్ఛ వుంది. మరి– 'బి', 'సి'లకో? 'ఏ'ని అడిగితే వాళ్ళదరికీ స్వేచ్ఛ లేదంటాడనే భావించాలి. అట్లా కాక 'బి', 'సి'లు నిజమైన స్వేచ్ఛనే అనుభవిస్తున్నా రని 'ఏ' అంటే అతని ఉద్దేశంలో 'స్వేచ్ఛ' ఏమిటో మనం తేలిగ్గా అర్థంచేసుకోగలం. కాని ఒక వెల్స్, లేదా ఒక రస్సెల్ దానిని స్వేచ్ఛ అవి అంగీకరించరు దానిని పరి స్థితులకు హీనమైన బానిసత్వంగా భావిస్తారు. 'బి', 'సి' లకు స్వాతంత్ర్యం రావాలంటే 'ఏ' స్థాయికి పెంచాలంటారు. 'బి', 'సి' లకు లోకంలోని మంచి వస్తువులు, మంచి విష యాలు అందాలంటే వారికి తగిన తీరుబాటు, ఒకపాటి ఆదాయం వుండాలి.

కాని యిది ఎలా సమకూరుతుంది? మనం వున్నది బూర్జువా సామాజిక సంబం ధాల్లో. ఈ సంబంధాల యొక్క పరమ ఆశయం కేవలం స్వంత లాభం. ఇక్కడ బూర్జువా ఆర్థికవేత్తలకూ. మార్క్సిస్టులకూ అభిప్రాయభేదం లేదు. కార్య కారణ సంబంధం అనే శాస్త్రదృష్టితో పరిశీలిస్తే వర్తమాన ఆర్థిక సంబంధాలకూ. 'బి', 'సి' లకు స్వేచ్ఛ లేకపోవడానికీ– పరస్పర సంబంధం వుంది అని తేలిపోతుంది.

కనుక బూర్జువా సాంఘిక సంబంధా లొకవైపు, 'ఏ', 'బి', 'సి' ల యొక్క వివిధ స్థాయిలలో వున్న స్వేచ్ఛారాహిత్యం మరోవైపు కార్యకారణాలుగా సంబద్ధం అయివుంటాయన్న మాట. వీటిలో ఏది కార్యం. ఏది కారణం? మానసిక స్థితులు మరియు సాంఘిక సంబంధాలు అనే రెండింటిలో దేనివల్ల ఏది అంకురిస్తుందో తేలితే గాని పై ప్రశ్నకు జవాబు దొరకదు. ఏ విధమైన ఆచరణ సమస్యా పరిష్కారానికి దారితీస్తుంది? అని ప్రశ్న వేసుకుంటే పై రెండింటిలో ఏది ప్రాథమికమైందో వెంటనే స్ఫురిస్తుంది. 'బి' కి వుపన్యాసాలు, కళాఖండాలద్వారా తత్త్వపరిజ్ఞానానికి అవకాశాలు కల్పించడం వృథా. అతనికి అందుకు కావలసిన తీరికే లేదు. అభిరుచీ లేదు. ఇక 'సి' కి తన ఆర్థిక పరిస్థితుల విషాద మేఘాలు ముసురుతున్నంత వరకు బూర్జువా సం స్కృతి యొక్క సంపదను ఆనందించే స్వేచ్ఛలేదు, మనస్సులేదు. కనుక చైతన్యాన్ని బంధించేది పరిస్థితులే తప్ప దాని విపర్యయం సరికాదు.

ఈ పరిస్థితిలో ఏది కారణమో, ఏది ఫలితమో కన్పిస్తూనేవుంది బూర్జువా సాంఘిక సంబంధాలను కలిగించేవి స్వేచ్ఛ, స్వేచ్ఛారాహిత్యాలూ కావు. సోమరి బూర్జువాల స్వేచ్ఛను, శ్రామికుని స్వేచ్ఛారాహిత్యాన్ని వుత్పన్నం చేసింది బూర్జువా సాంఘిక సంబంధాలే. ఇది అవాంఛనీయమని మీరు భావిస్తే దీని కారణాన్ని మార్చడం ద్వారానే పరిస్థితులను మార్చగలుగుతారు.

బంధనం, స్వేచ్ఛ- అనే యీ రెండు స్థితులూ ఎప్పటికీ యిలాగే కొనసాగాలనుకుంటున్నారా? సమకాలీన సమాజంలో వుంటున్న దుఃఖమూ, సంతోషమూ పక్క-పక్కనే యిలాగే వుండిపోవాలా? శ్రామికుల స్వేచ్ఛా రాహిత్యానికి ఏది కారణమో దానివల్లనే మీకు కలుగుతున్న స్వేచ్ఛను మీరు అనుభవించగలరా? ఇవే నేడు మేధావుల ఎదుట వున్న రెండు ప్రశ్నలు. ఒకవేళ వీటికి 'లేదు' అని వారి సమాధానమైతే బూర్జువా సాంఘిక సంబంధాలు మారి తీరాలి. స్వేచ్ఛారాహిత్యం దుర్భరమౌతున్న కొద్దీ మారడం ఎలాగూ తప్పదు కాని మార్పును సాధించే సాంఘికశక్తుల్లో మేధావులు తాము భాగస్వాములు కాదలుచుకున్నారా? లేక దానిని వ్యతిరేకించే వ్యర్థప్రయత్నానికి పూనుకుంటారా? అనేదే యీనాడు మేధావులు నిర్ణయించుకోవాలి.

మనస్సులో అనుకుంటే మార్పులు రావు. తర్క-వాదనలతోనే సరిపోదు. ఆచరణ కావాలి. వాతావరణాన్ని మార్చాలి. మనం పర్వతాన్నికూడా పగులగొడ్తున్నాం. కాని కేవలం కోరికలతోకాదు. ప్రకృతిశక్తుల అవగాహనతోను, భౌతికశాస్త్ర సూత్రాల అనుసరణవల్లనూ మనకది సాధ్యపడుతున్నది. స్వేచ్ఛకూడా వాస్తవికతా సూత్రాలకు లొంగిన ఆచరణవల్లనే లభిస్తుంది. బూర్జువా సాంఘిక సంబంధాలను మార్చాలంటే సమాజ గతి సూత్రాలను అన్వేషించాలి. సాంఘిక సంబంధాలను హేతువాద దృష్టితో పరిశీలించాలి. స్వేచ్ఛ కావాలనుకోవడం చాలదు. దాని స్వరూప స్వభావాల పరిజ్ఞానం కూడా అవసరం.

సాంఘిక సంబంధాల గతి పరిణామ సూత్రానికి ఒకే ఒక శాస్త్రీయ విశ్లేషణ వుంది. అదే మార్క్సిజం. పెట్టుబడి, పదార్థం, మానవశక్తి వంటి భౌతిక విషయాల పరిణామాలు, సమాజపు భావిగతిని గూర్చిన సహేతుకమైన ఆలోచనకు ఎలా ఆధారమవుతాయో, సాంఘిక సంబంధాలద్వారా ఇవి ఎలా మనస్సు, సంకల్పం, ఆదర్శాల వంటి గుణాత్మక పరిణామాలు చెందుతాయో అవగాహన చేసుకోవడానికి బూర్జువా మేధావులు మార్క్స్, లెనిన్‌వంటి వాళ్ళ సిద్ధాంతాలు అధ్యయనం చేయాలి. మనస్సు సాంఘిక సంబంధాలవల్ల నిర్మాణం అవుతుందేకాని అందుకు తారుమారుగా జరగదు.

సమాజంయొక్క సహేతుక అవగాహనలేనిదే క్లిష్టమైన స్వేచ్ఛాన్వేషణ పూర్తికాదు. సాంఘిక సంబంధాలనుండి స్వేచ్ఛను వుత్పన్నం చేయడం అనేది వాస్తవికతకులోబడి వుంటుందని గుర్తించాలి- పదార్థం అంతా- యంత్రాలు. పెట్టుబడి. మనిషి- సంఘంలో యివి కలిగివుండే సంబంధాలు- ఏవైనాసరె కార్యకారణ సంబంధంతోనే కట్టుబడి వుంటాయి. హేతువాద సూత్రాలనే అనుసరిస్తాయి- కొత్త యిల్లు కట్టాలంటే పాత దానిని పూర్తిగా కూల్చివేయవలసిందే. కూల్చడం, కట్టడంకూడా కొన్ని సూత్రాలకు లోబడే జరుగుతాయి మనం గోడలకన్న ముందే కప్పుని నిర్మించలేం కదా?

ఈ సంధి దశలో మనుషులకూ, పెట్టుబడికీ, యంత్రాలకూ, సామగ్రికీ మధ్య సాంఘిక సంబంధాలను నిర్ణయించే నిబంధనలు తారుమారు కావడం వుంటుంది. ఇవి అన్నీ వ్యక్తిపరంగా బూర్జువావర్గానికి కాక సంఘమంతటికీ చెందుతాయి. ఇది కేవలం యాజమాన్యంలో మార్పిడికాదు. శ్రమచేయకుండా యాజమాన్యం పేరుతో లాభం సంపాదించే అవకాశం యిందులో వుండదు. సరకులు మార్కెటులచుట్టూతిరిగే లాభాల వ్యాపారం కాదిది- నేరుగా వుపయోగంలోకివచ్చే ప్రయోజనకరమైన మార్పు. ఇంతే కాక- వ్యక్తి స్వంతలాభ సంబంధాలపై ఆధారపడే సంస్థలన్నింటినీ- వాటిని కాపాడే చట్టాలూ. దేవాలయాలూ, అధికార యంత్రాంగమూ. న్యాయవ్యవస్థా, సైన్యమూ. రక్షకదళాలూ, విద్యావిధానమూ- ఇలాటివాటిని మార్చివేసి పునర్నిర్మాణం చేయడం అవసరం. ఈ సంస్థల ద్వారానే తమ ఆదాయాన్నీ, తమ ప్రతిష్టనీ. స్వంత ఆస్తినీ. ఆశిస్తూ తమ స్వేచ్ఛను సాధించచూసే బూర్జువాలు యీ పని చేయజాలరని వేరే చెప్ప నక్కరలేదు. శ్రామికులకు సంకెళ్లూ, తమకు స్వేచ్ఛనూ తెచ్చిపెట్టే ఈ సంబంధాలను విచ్ఛిన్నంచేయడం వాళ్ళ పాలిటికి 'తన్ను కట్ట తాళ్లు తా తెచ్చుకున్నట్లే అనుకుంటారు. మరి శ్రామికులు అలా కాదు. స్వేచ్ఛకోసం వాళ్లు తిరగబడతారు బూర్జువా దీనిని నిరోధించచూస్తాడు కాని తుదకు పెట్టుబడిదారీ ఆర్థిక విధానం యొక్క సహజక్రమం ఏమంటే- అది అభివృద్ధి పొందుతున్నకొద్దీ నిజంగా స్వేచ్ఛను అనుభవించేవాళ్ళ సంఖ్య తగ్గిపోతూ వుంటుంది. చివరికి మేధావి, వైద్యుడు, పెట్టీ బూర్జువా, గుమాస్తా. తమ కున్న స్వేచ్ఛ నామమాత్రమే అని గుర్తించే రోజు వస్తుంది. అప్పుడు శ్రామికుల పోరాటం తమ పోరాటమే అని వాళ్ళు తెలుసుకోగలుగుతారు.

శ్రామికునికి ఏది సేచ్ఛ అవుతుందో బూర్జువాలకు అది ప్రాణకంటకంగా తోస్తుంది. స్వేచ్ఛ యొక్క యీ రెండు దృక్కోణాలకు ఎక్కడా పొత్తు కుదరదు. ఒక్కసారి శ్రామికవర్గం అధికారంలోకి వచ్చిందంటే దోపిడీవర్గాలు బూర్జువా సాంఘిక

సంబంధాలను పునరుద్ధరించే ప్రయత్నాలు చేస్తాయి. ఇది శ్రామికవర్గ స్వేచ్ఛపై జరిగే దౌర్జన్యమే. కాబట్టి శ్రామిక వర్గం ఆ ప్రయత్నాల్ని తీవ్రంగా తిప్పికొడుతుంది. (శ్రామిక నియంతృత్వానికి యిదే అర్థం).

ఇక్కడ మనం ఒక ముఖ్యవిషయం గమనించాలి. బూర్జువా సాంఘిక సంబంధాలు బూర్జువాకు స్వేచ్ఛ, శ్రామికునికి బానిసత్వాన్ని కలిగిస్తాయి. శ్రామికుని కాయకష్టం లేకుండా బూర్జువా తన సోమరితనాన్ని, స్వేచ్ఛను ఆనందించలేడు. శ్రామికుడు ఈ బూర్జువా వ్యవస్థలో అతడ్ని అంటిపెట్టుకోకుండా బ్రతకనూలేడు. కనుక యీ బూర్జువా సంబంధాలలో 'కొద్ది మంది యొక్క స్వేచ్ఛ' అనేది ఎందరో స్వేచ్ఛారాహిత్యంపై ఆధారపడుతుంది. ఈ రెండు వర్గాలు నిత్యశత్రుత్వంతోనే జీవిస్తుంటాయి. కాని బూర్జువావర్గం పతనంకాగానే స్వేచ్ఛలేని బూర్జువా, స్వేచ్ఛవున్న శ్రామికవర్గమూ అనేది కేవలం తాత్కాలికమే. ఇప్పుడు ఆస్తిపరులు లేరు. అందరూ శ్రామికులే. కనుక క్రమంగా బూర్జువా వర్గం శ్రామికవర్గంలో విలీనం కావడమో లేక అంతరించిపోవడమో జరుగుతుంది. అప్పుడు స్వేచ్ఛ లేని నిర్బంధవర్గం అంటూ ఏదీవుండదు. సంధియుగం తర్వాత 'రాజ్య యంత్రాంగం వర్గరహిత సమాజంలోకి రాలిపోతుంది'- అనడంలో భావం యిదే. స్వేచ్ఛ దేశప్రజలందరి సొత్తు అయి రాణించే దశ యిదే. అంతవరకు స్వేచ్ఛ అనేది ఏ కొందరికో ప్రాప్తించే అదృష్టంగా వుంటుంది, ఒక భ్రమగానే మిగిలిపోతుంది.

వ్యవస్థ మారితే 'వ్యక్తిగత స్వేచ్ఛ', 'సంపూర్ణ స్వేచ్ఛ' అనేవి వట్టి అశాస్త్రీయ భ్రమలని గ్రహించడానికి ఎంతోసేపు పట్టదు. సాంఘిక సంబంధాలు అవి ఏరూపంలో వున్నాసరె స్వాభావిక స్వేచ్ఛకు అవరోధాలే అనే పిడివాదాన్ని రస్సెల్‌వంటి సమాలోచకులు ప్రతిపాదించారు. ఇదే నిజమైతే జంతువు ఒక్కటే సంపూర్ణ స్వేచ్ఛ కలిగిన ప్రాణి అవుతుందని వేరే చెప్పనవసరములేదు. "మానవుడు స్వతంత్రుడుగానే పుడతాడు, కాని ఎక్కడా సంకెళ్ళలోనే కానవస్తాడు" అనే రూసో సిద్ధాంతంలోనే పై పిడివాదానికి అంకురార్పణ జరిగింది. పరిపూర్ణుడైన, స్వతంత్రుడైన మానవుడు సామాజిక సంస్థల ద్వారా భ్రష్టుడైనాడనే 'స్వర్ణయుగ సూత్రం' బూర్జువాల బూజు బుర్రలలో పుట్టిన పుక్కిటి పురాణం మాత్రమే.

నిరుద్యోగం, దుఃఖం, రక్షణ లేకపోవడం, నిరంతర యుద్ధాలూ- వీటన్నింటినీ రేకెత్తించడం బూర్జువా సమాజపు సహజ లక్షణాలు. బూర్జువా సమాజంలో జీవించే వారందరూ- అది గ్రామరాజ్యం కానీ, రామ రాజ్యంకానీ, ప్రజాస్వామ్యంకానీ

సైనిక నియంతృత్వం కానీ- స్వేచ్ఛ లేకుండా జీవించేవారే. ఓటుహక్కు వుంది. వాక్ స్వాతంత్ర్యం వుంది, అనే మాటలేవీ బూర్జువా వ్యవస్థలో నిజమైన స్వేచ్ఛలేదనే నగ్న సత్యాన్ని దాచలేవు

మానవ స్వేచ్ఛను గొప్పగా పేర్కొనే బూర్జువా తతంగమంతా స్వంతలాభార్జన కోసం చెప్పే వ్యక్తి స్వేచ్ఛయే. ఆస్తి యాజమాన్యంలో సంపూర్ణ స్వేచ్ఛ అనగానే- వున్నవాళ్ళు, లేనివాళ్ళుగా సమాజం విడిపోతుంది. అడవి జంతువుల సూత్రాలే పని చేస్తాయి. లేనివాళ్ళు ఉన్నవాళ్ళ ఆస్తిని ఆక్రమించవచ్చు. ఇక్కడే రాజ్యాంగం వెలసి బూర్జువా యంత్రాంగాన్ని కాపాడే రక్షక యంత్రాంగంగా రూపొందింది. దరిద్రుల స్వేచ్ఛాయుతమైన కోరికలనుంచి దోపిడీదారులను కాపాడేందుకు పోలీసువంటి సంస్థలు వెలిశాయి. ఈ విధంగా బూర్జువా స్వేచ్ఛ సహజంగా బూర్జువా నిర్బంధాలకు దారితీసింది. చట్టాలు, విద్య, అన్నీ ఆస్తి హక్కు యొక్క పవిత్రతను కాపాడడానికే నిలుస్తాయి. ఈ విధంగా బూర్జువా స్వేచ్ఛ అసత్యంమీద, దోపిడీ మీద నిర్మాణం అయింది. కాలక్రమంలో తన అంతర్ వైరుధ్యాలవల్లనే అది బద్దలుకాక తప్పదు.

మానవుడు తానేం చేయగలడో తెలుసుకోవడానికి విజ్ఞానశాస్త్రం సాధనం. మానవుడు తానేం చేయకోరుతున్నాడో నేర్చుకునే సాధనం కళ. మొదటిది బాహ్యవాస్తవికతను అన్వేషిస్తుంది. రెండవది మానవ హృదయం యొక్క సారాంశాన్ని పరిశీలిస్తుంది. బూర్జువా విధానం సౌందర్యం పట్ల కండ్లుమూసుకొని, విజ్ఞానశాస్త్రానికి వెన్ను చూపి, కూలిపోయే దాకా తన బుద్ధిహీనతనే అనుసరిస్తూ వుంటుంది. అది స్వేచ్ఛను బంగారు శిలువమీద నిలువునా హత్యచేస్తుంది. ఎవరికోసం యిలా చేస్తున్నావు- అంటే- అది యిట్లా జవాబిస్తుంది: " 'వ్యక్తిగత స్వేచ్ఛ' కోసం" ।

(క్రిస్టొఫర్ కాడ్వెల్ 'లిబర్టి' వ్యాసానికి స్వేచ్ఛానుసరణ : టి. వి. ఎస్.)

విజ్ఞప్తి

చందాలు, విరాళాలు, పుస్తకాల కోసం డబ్బు - చెక్కుల ద్వారా పంపేపుడు పాఠకులు, ఏజెంట్లు, అభిమానులు Pay to......అని వున్నచోట SRJANA అని కాని SRIJANA అని కాని SRUJANA అని కాని రాయవలసిందిగా కోరుతున్నాము. S. R. JANA అని రాయవద్దు. వ్యక్తుల పేర డబ్బు పంపవద్దని కూడా మనవి.

లేఖలు :

"సృజన" గురించి

'సృజన' ప్రజల పత్రిక అని భావించి, దాని నాలుగు ఇష్యూలు చూసి ఈ లేఖ వ్రాస్తున్నాము.

దోపిడికి గురిచేయబడే వారందరు ప్రజలే. ఇందులో అనేక రకాలవాళ్లున్నారు. 'పండితులు, మేధావులు, అక్షరజ్ఞానం మాత్రమే కలవారు, అక్షరజ్ఞానం లేనివారు మొదటి రెండు రకాల వారిని ఒదిలిపెడితె చివరివారే మన సమాజంలో ఎక్కువ. అటు వంటప్పుడు ప్రజా పత్రికలల్లో, చదివినా లేదా విన్నా అర్థమగు వాడుకభాష మాత్రమే వాడబడాలి. అట్లుకాక సామాన్య ప్రజ అర్థం చేసుకోలేని కఠిన పద ప్రయోగాలతో గూడిన సమాసాలుగల వ్యాసమైనా, కథ అయినా చివరకు గేయమైనా ప్రచురింపబడితె దాని భావము ఎందరికి అర్థమవుతుంది ?

ప్రజల తరఫున నిలిచే పుస్తకాలను పత్రికలలో పరిచయం చేయుట పరిపాటి. ప్రశంసనీయమే. పరిచయ వాక్యాలు చదివి చివరకు తిప్పలుపడి ఆ పుస్తకం కొంటే 'జైలు కోకిల' లాగ సామాన్యునికి అర్థంకాకపోతే ఆ పరిచయం చేసిన పరిశీలకుని అవస్థకు అర్థముందా ? కావున మీ ప్రతి ఇష్యూలో పుస్తక పరిచయం తప్పక చేయాలని ఆశిస్తాం. కాని సామాన్యునికి అర్థం అయ్యే పుస్తకాలను మాత్రమే పరిచయం చేయాలని కోరుతున్నాం.

నేడు మన దేశంలో ప్రజలు అర్థవలస, అర్థభూస్వామ్య వ్యవస్థలో మ్రగ్గుతున్నారు. వారి బాధలు, సమస్యలు కోకొల్లలు కావున ప్రజా పత్రికలలో వారి సమస్యలు ప్రతిబింబించుటే సరిపోదు. అందులో సిద్ధాంత అవగాహనతో కూడిన పరిష్కారమార్గం ఉండాలి.

సామాన్య ప్రజలు విదేశీ కథలకంటె తమ నిత్యజీవితంలో అనుభవిస్తున్న సంఘటనల వంటి స్వదేశీ కథలను త్వరగా అర్థంచేసుకోగలరు. కావున మేధావులు, ప్రజల సమస్యలతో, విదేశీ కథలతో ప్రభావితులై, సిద్ధాంత అవగాహనచే స్వదేశీ కథలను రాయాలి. అటువంటి వాటికే ఈ పత్రికలో ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. అంతమాత్రం చేత అనువాదాలు వేయవద్దని కాదు. కొన్ని పత్రికల అనువాదంగానో, సామాన్యులకు సరిగా అర్థంకానిదిగానో 'సృజన' వెలువడకూడదనేది మా అభిమతము.

ప్రజల పత్రికలు ప్రజలు కొనుక్కోగలిగే వెలకే అందుబాటులో ఉండాలి. అప్పుడే వాటి ఆశయం నెరవేరుతుంది. లేకుంటే చెట్టుపేరు చెప్పి కాయలు అమ్మినట్లుంటుంది. ఈ రోజుల్లో చాలామంది మేధావులనుకునేవారు వామపక్ష భావాలు గల

వారిగా పోజులుపెట్టి వారి విజ్ఞానాన్ని అధిక ధరలకు అమ్ముకుంటూ ఉన్నరు చైతన్యవంతమయిన సమాజం వారిని తప్పక గుర్తిస్తుంది. వెలివేస్తుంది. కావున సాధ్యమయినంత వరకు 'సృజన' వెల తగ్గించి అందరికి అందుబాటులో ఉంచుతారని ఆశిస్తాం.

సృజనలో పాఠకుల లేఖలతోపాటుగా, 'చర్చావేదిక' లాంటి శీర్షికలకు గూడ చోటిస్తే పాఠకులకు, సంపాదకులకు ఒకరితో ఒకరికి సన్నిహిత సంబంధాలు పెరిగే అవకాశం ఉంటుంది. వీటితో పాటుగా 'నేటి సమస్య' అను శీర్షిక క్రింద వ్యాసాలు ప్రచురించితే బాగుంటుందనేది మా అభిప్రాయం.

— కె. సుందరమూర్తి
డి. లక్ష్మీనారాయణ
(కొమాళ్ళ)

"సృజన" పేరులోనే వున్నది మంచి అర్థము. ఈ పత్రికను చదువు వారికి కొంత సాహిత్యములో అనుభవముంటేనే అర్థము కాగలదు. కావి సామాన్య ప్రజానీకానికి అర్థము కాదు. కఠినమైన భాషలో గాక సులభశైలిలో ముద్రణ వేయించితే బాగుండునేమో అని నా అనుభవము. ఎందుకనగా నా దగ్గరనుండి మన ప్రజామిత్రులు కొంతమంది 'సృజన'ను తీసుకవెళ్ళి చదివినారు. కాని వారికి అర్థము కాలేదు అని అన్నారు. కొన్నిటిని మాత్రము విపులీకరించినాను. ఆశయసిద్ధికోసం ఎన్ని విప్లవ రచనలురాసి ప్రచారముచేసినా లాభముండదేమో. ప్రజలలో చైతన్యము కలగాలంటె సులభశైలిలో వుండడము ఎంతేవి అవసరము, అలా వుంటేనే ప్రజలలో చైతన్యము కాగలదు. అనుకున్న ఆశయాలు తప్పక సిద్ధించుతాయని నా అనుభవము, కోరిక.

— యం. గంగారాం
(భోజన్నపేట)

ప్రజలలో "నా ఖర్మ; దేవుడు నాకీ పూట యీ గంజినీళ్ళే రాసిపెట్టాడు" అనే భావాలు వారిని చైతన్యవంతులను చేయటానికి ఎంత తీవ్రమైన ప్రతిబంధకాలౌతున్నాయో మీరు అనుభవంద్వారా గ్రహించేవుంటారు. అట్టడుగున పడివున్న వారిలోను, అత్యధిక విద్యావంతులైన నిరుద్యోగులలోను చైతన్యరాహిత్యానికి కారణం యీ "ఖర్మ సిద్ధాంతమే"నని నా నమ్మకం. అందువలన ఆ సిద్ధాంతానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపర్చడం నేను ప్రధాన కర్తవ్యంగా భావిస్తున్నాను. దేవుడనే ఆ మత్తు నుండి వారు బయటపడిననాడు, బాబాల బండారం, స్వాముల మోసాలు అర్థమైననాడు వారి

దైన్య, హైన్య స్థితికి కారణం వారికి స్పష్టంగా అర్థమౌతుంది. అందువలన 'సృజన'లో యీ 'మత్తుమందు'కు వ్యతిరేకంగా కూడ ప్రచారం చేయటమనేది మంచిదని నేను భావిస్తున్నాను.

— కె. ఎల్. కాంతారావు
(రావినూతల)

సంపాదకీయం గురించి

నవంబర్ 'సృజన'లో సంపాదకీయంగురించి వచ్చిన విమర్శను చదివింతర్వాత ఇది రాయాలనిపించింది. "చైనాలో జరుగుతున్న పరిణామాలమీద తొందరపడి తీర్పు చెప్పటం మంచిదికాదు"– ఇది రాయటానికి కారణంగా సంపాదకులకు పవిత్రభావాన్ని అంటగట్టారు ఏలూరు పాఠకులు. అంతేగాని ఈనాడు చైనాని గురించి తెలిసిందెంత, తెలిసిందాంట్లో సరైందెంత, అసలీ పరిణామాలు దేన్ని ప్రతిబింబిస్తాయి. వాటి వెనకాలుండే కారణాలేంటి– వగైరాలను గురించి ఆలోచించడానికి, ఓ నిర్ణయానికి రావడానికి మనముందున్న సమాచారం ఎంత? అన్నది ఆలోచించారా? కావలసినదానికన్నా ఎక్కువే సమాచారం మనముందున్నది అన్నారు. అది నిజమేనా? సమాచారం తెలీనప్పుడు, తెలిసిందాకా ఆగుదాం అన్నది తటస్థవైఖరా? అవకాశవాదమా? అదే అవకాశవాదం అయితే ఏమాత్రం తెలిసినా ఓ నిర్ణయానికి వచ్చి తీర్పు చెప్పటం గతితార్కికపద్ధతా? ఉన్న వాస్తవం కళ్ళముందు కనిపించేంత వాస్తవంగా వుందా? బూర్జువా పేపర్లలోవచ్చే న్యూస్ ఐటమ్స్ని బట్టిగానీ, పెకింగ్ రివ్యూల్లోవచ్చే కమిటెడ్ సమాచారాన్ని బట్టిగానీ గాకుండా, చైనాలోవున్న నాయకత్వం ఆచరణనిబట్టి దాన్ని గురించి ఒక అవగాహన ఏర్పరచుకోవాలి.

సంపాదకులకి పవిత్ర భావం అడ్డుపడితే వీరికేభావం అడ్డుపడింది– విషయాలు చెప్పడానికి? అసలు విమర్శించేపుడు అది నిర్మాణాత్మకంగా వుండాలన్నది వీరికి తెలియాలి.

— సి. రవి.

మల్లిక్ ఉత్తరం పై

సృజన రెండవ సంచిక తప్పితే మిగతా రెండు సంచికలు పేలవంగా ఉన్నాయని మల్లిక్ అన్నారు. (నవంబరు సంచిక). కళారూపము, వస్తువు రెండూ లోపించిన సాహిత్య పత్రికగా ఉందని దుయ్యబట్టారు. కాని ఇది మరీ అన్యాయము.

ప్రత్యేకించి ఆయా శీర్షికలను విడమరచి చెప్పకుండా పత్రికను పూర్తిగా జనరలైజ్‌చేసి చెప్పడం జరిగింది.

ఇటీవలికాలంలో జరిగిన, జరుగుతున్న పరిణామాలను, ఉద్యమాలను 'సృజన' ప్రతిబింబించుట లేదనే విషయంలో నేను ఏకీభవిస్తున్నాను. 'సృజన' విప్లవ రాజకీయాలకు అంటీ ముట్టకుండా ఉండడం సమర్థనీయముకాదు.

ఇక- చైనా సాహిత్యం మరియు అందలి విశిష్టరచనల్ని కొన్నింటిని ప్రచురించినంత మాత్రాన దానిని విదేశీ పార్టీపై గుడ్డి అభిమానంగా మల్లిక్ అభివర్ణించడం సరియైనది కాదనే భావించాలి. ఎంతోకాలంగా వెలుగు చూడని చైనా సాహిత్యం కనీసం 'సృజన'ద్వారానైనా చూడగలుగుతున్నందుకు సంతోషించాలి.

— కిరణ్మయి
(విజయవాడ)

సృజన ప్రజాసమస్యలను ప్రతిబింబిస్తూ లేదని మల్లిక్ రాసారు. మరి వారి దృష్టిలో ప్రజా సమస్యలంటే కమీషన్ల విచారణల తంతులే కాబోలు. స్వదేశీ సాహిత్యంలో వచ్చే సృజనాత్మకమైన సాహిత్యాన్ని యెలాగూ 'సృజన' ప్రచురిస్తూనేవున్నది. ప్రపంచ విప్లవోద్యమానికి పెట్టనిగోడవలె నిలచి నిరంతరం విప్లవశ్రేణులను ప్రోత్సాహపరుస్తున్న జనచైనా సాహిత్యం, జనచైనా కమ్యూనిస్టుపార్టీ అంటే మల్లిక్‌గారికి అంత భయమెందుకో- లేక ద్వేషమా? ఇకపోతె- 'సండే' లో వచ్చిన సమాచారం లాంటి విభిన్న విప్లవ గ్రూపుల వార్తలు అందజేస్తారనుకొంటాను.

— క్రాంతికుమార్
(తెనాలి)

జైరామ్ లేఖపై

అక్టోబర్ సంచికలో 'చైతన్య సాహితి' గురించి జైరామ్ లేఖ చదివింతర్వాత 'చైతన్య సాహితి' కార్యదర్శిగా వుండిన నేను కొన్ని వాస్తవాలను వివరించదలచాను.

'చైతన్య సాహితి' స్థాపించడంలో జైరామ్‌పాత్ర నామమాత్రమే ఇంజనీరింగ్ కాలేజి, ఆర్ట్స్ కాలేజి విద్యార్థులు, స్థానిక రచయితలు కొందరు చేసిన సమిష్టి కృషి మూలకంగానే అనంతపురంలో ఈ 'చైతన్య సాహితి' ఏర్పరుపబడింది.

జైరామ్ అప్పుడు 'విరసం' కన్వీనరుగా వుండేవాడు- ఇది స్థాపించిన అప్పటి ఉద్దేశం కేవలం శ్రీశ్రీని, కొందరు విప్లవ రచయితలని అనంతపురం ఆహ్వానించి, సభ ఏర్పాటుచేయడంవరకే.

అప్పటికీ శ్రీ పరిటాల శ్రీరాములు 'చైతన్య సాహితి'తో పరిచయం పొందలేద న్నది వాస్తవమే.

'రక్త గానం' వెలువరించిన క్రెడిట్ జైరామ్ తనదిగా చెప్పుకొన్నాడు. కానీ 'రక్త గానం' 'బందూక్' పుస్తకాల ప్రచురణ ఏ ఒక్క వ్యక్తి కృషికాదనీ, అనంతా సమిష్టి కృషివల్లే జరిగిందని చెపుతున్నా-

ఒకటి మాత్రం నిజం— 'చైతన్య సాహితి'ని విచ్ఛిన్నం చేయడానికి తీవ్రంగా కృషి చేసిన వారిలో శ్రీ జైరామ్, శ్రీ నారాయణచౌదరి చరిత్రలో నిలిచిపోతారనే సత్యం ఇప్పటి 'చైతన్య సాహితి'తో అంతో యింతో సంబంధమున్న ప్రతివారికీతెలుసు.

'చైతన్య సాహితి' తర్వాతి కాలంలో పరిటాల శ్రీరాములుగార్ని అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగింది.

'చైతన్య సాహితి' ఎన్నో కార్యక్రమాల్ని సాహిత్యరంగంలో నెరవేర్చింది. ఇవేవీ ఏదో ఒక వ్యక్తి ప్రతిభవల్లకానీ, ఎవరో ఒకరి కృషివల్లకానీ జరగలేదు

సమిష్టికృషి, నిరంతర దీక్ష, కార్యసాధనపట్ల అందరికీ వున్న నిజాయితీవల్ల 'చైతన్య సాహితి' తన కార్యక్రమాలు నెరవేర్చింది.

— ముదార్ వేణు
(అనంతపురం)

'ఎదురు తిరిగితే....' కథపై చర్చ - అభిప్రాయాలు :

"ఎదురు తిరిగితే" కథలో రచయిత చెప్పదలచుకున్నది గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య, పెత్తందారివర్గాలు పేదవర్గాలను విచక్షణారహితంగా దోపిడీచేస్తున్నారనీ, దోపిడీని సహించలేక, భరించలేక కొంరడు లాంటి వాళ్ళు ఎదురుతిరుగుతున్నారని.

సి.బి. రామశాస్త్రి, కె. రాంమోహన్‌రాజుగారలు ఈ కథపై కొన్ని విషయాలు చెప్పారు- రాజకీయ చైతన్యంలేని తిరుగుబాటు, వ్యక్తిగా తిరుగబడడం కేవలం నిష్ప్రయోజనం అని.

ఈ కథలో నా కింకొక ముఖ్య లోపం కనిపిస్తున్నది. భూస్వామ్య వర్గాలు పేద ప్రజలను ఎలా హింసిస్తున్నాయో కథలో ప్రధానంగా చెప్పాల్సిందిపోయి, పేద ప్రజల మధ్య జరిగే చిన్న చిన్న తగవులకు ప్రాధాన్యత ఇచ్చి వాళ్ళలో ఐక్యతలేదని పేదప్రజలపై జరిగే దోపిడీకి పేదప్రజలు కూడ కారకులే అంటూ; కథను ఏ ప్రధాన సమస్యమీద కేంద్రీకరించాలో ఆ సమస్యమీద కేంద్రీకరించకుండా చిన్న విషయాలపై, పేదప్రజలు వ్యవహరిస్తున్న పద్ధతులపై- కథ నడవడం, భూస్వామ్యవర్గాల దోపిడీని దాని స్వరూప స్వభావాలను సరిగ్గా చిత్రించకపోవడం ప్రధాన లోపంగా కన్పిస్తున్నది

— నర్సింహాయ్య

తుఫాను

తుఫాను బాధితుల కోసమని
ఆఫీసులో అంతరితో పాటు విరాళమిచ్చి,
అసలు మాట సరే- ఈ నెల వడ్డీ కూడా యిచ్చుకోలేనని
మార్వాడీ చేతులు పట్టుకున్న- నేను-
మా ముగ్గురు పిల్లలూ బలవంతంగా చందాలు తీసుకుపోయి
నాలుగు రోజుల నా ఉదయం నాస్తా కాస్తా ఎగరగొట్టిన వేళ-
యింటికి వచ్చిన వాళ్ళకు
కొంచెం చినిగిన నా బట్టల జత ఒకటిచ్చి
నాకు రెండే జతలు మిగిల్చిన నా భార్యతో-
బస్సులో, బాటలో, పేటలో
చందాలంటూ నన్ను వేటాడుతున్న వాళ్ళమధ్య-
నిలబడి-
నేస్తం! నేను నీ కోసం నిరీక్షిస్తున్నాను.

ఈ చందాలన్నీ బాధితుల దాకా పోయినా పోకున్నా
తుఫానును ఎదుర్కో-లేని ప్రభుత్వం-
పదవుల పంపకంలో పడి తుఫాను బాధితుల నాదుకోలేని ప్రభుత్వం-
ప్రజలది కాదని ప్రకటిస్తున్నాను.

దశాబ్దం క్రింద నా జాతిలో మళ్ళీ చైతన్యం తెచ్చి
మా మెదళ్ళలో తుఫాను సృష్టించి
ఆయుధ మందించి అరిని చూపించి
జీవన పోరాటంలో మము దించిన నువు-
పేదల బతుకుల్లో ఆకలి తుఫాను సృష్టించి
వేల మందిని చంపుతున్న ఈ వర్గస్వభావాన్ని
మరోమారు మా ముందుంచావ్
మా తుపాకుల్లో మందు దట్టించావ్.

శవాలకు నైతం ఓట్లున్నాయని
రాజ్యాంగంలో రాయించుకుని వుంటే-
రాష్ట్రమా ?- కేంద్రమా ?
ఎవరు శవాలు ఎత్తేయాలనే ప్రశ్నే తలెత్తేది కాదు;

నిన్న కులం బలంతో, కల్లు వాసనతో, నోట్ల నిషాతో చెలరేగి
బీదలను సజీవంగా బ్యాలెట్ పెట్టెలలో సమాధిచేసి గెలిచిన 'వేప్'లు-
ఇవాళ ఈ శవాలతో యింకా లాభసాటి వ్యాపారం జరిపేవి-
పోటీలు పడి.

శాంతి భద్రతల పేరున- ఎదురుదాడుల పేరున
ఎందరో అమాయకుల హతమార్చి పూడ్చేసిన
పోలీసుకు, సైన్యాలకు
ఇవాళ ఈ శవాలను తీసేయ రూల్స్ అడ్డుపడుతున్నాయి.

పార్టీ పాచిక లాటలో ఢిల్లీలో జలగా,
'స్వంత సేవ'లో మునిగిన దాని బలగం
నిర్లక్ష్యం తుఫానులో నిరుపేదల హత్య
ఎంత బాగ జరిగిందా అని ఏరియల్ సర్వే చేస్తున్నారు.

రెండేళ్ళ క్రింద రెండు నిండు ప్రాణాలను పురితీసిన
ఈ వ్యవస్థ ఆస్థానంలో - తుఫానుపై చర్చనాడు
అమాత్యు లందరూ గైర్‌హాజర్.

రాత్రిళ్ళు దొంగతనాలు చేయించి
పొద్దున 'పహారా హుంషార్' అనే
పోలీసు నీతిని నిలువునా పాతేయడం
జెండాలు మార్చిన పార్టీలవల్లా-
రంగు వెలసిన రివిజనిస్ట్ జెండాలవల్లా- కాదని
మరోసారి మాకు తెలిసింది.

ఈ అథోజగత్ సోదరులు కార్చిన కన్నీరు
ఆవిరై, మేఘమై, కుంభవృష్టియై
బంజారా హిల్స్, నౌబత్ పహాడ్‌లను ముంచేదాకానే-
ఓ ఝుంఝూ! -
కష్టాలూ, కరువులూ, కన్నీళ్ళూ.

— జీన్

(4వ పేజీ తరువాయి)
తెలియదు కాని వెంగళరావు మాత్రం రాష్ట్రంలో ఒక పక్క తుఫాన్ వరదలకు శవాలు కుప్పలు కుప్పలుగా పేరుకుపోతుంటే మాజీ ప్రధానమంత్రి, కాంగ్రెస్ అధ్యక్షుల ఇళ్ళలో మంతనాలు జరిపాడు- తన ముఠా రాజకీయాల కోసం.

1864లో సంభవించిన ఉప్పెన ప్రమాదంలో సుమారు 35,000 ప్రజలు చనిపోతే ఈనాడు 100 సంవత్సరాల తరువాత కూడా సాయుధ దళాలు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండి ఆనాటికంటె కొన్నిరెట్లు ఆధిక్యతతో జననష్టం, ఆస్తినష్టం వాటిల్లడానికి ప్రభుత్వం యొక్క క్రూరవైఖరే కారణం.

(ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థవారి కరపత్రం నుంచి)

ముఖ్యమంత్రివర్యులు "సైన్యం సహాయానికి ఆర్తనాదం చేయక, పోలీసులను పిలిపించగలనని విజయవాడలో, గుంటూరులో చెప్పి, హైద్రాబాద్ వచ్చారు. పోలీసు బలగాలు ఆ ప్రాంతాలకు చేరేసరికి మరొక 48 గంటలయింది. ఆ తర్వాత కూడ పెక్కు గ్రామాలు జలమయం"గా ఉన్నాయి. "ఆ దశలో కూడ ముఖ్యమంత్రి, ఆయన ప్రభుత్వం సైనికుల సహాయం అవసరమనుకోలేదు. పైగా సహాయంచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సైనికాధికారులు చేసిన విజ్ఞప్తులు పెడచెవినిబెట్టారు... పోలీసులు వెళ్ళి సివిల్ అధికారులతో సమావేశాలు జరిపి, కుళ్ళిపోయి కంపుకొడుతున్న శవాలను పాతిపెట్టడం కానీ, కాల్చివేయడం కానీ తమ శక్తికి మించిన పని కాగలదని చెప్పడం జరిగింది... ఆ తర్వాత, ఈ శవాలను తొలగించేందుకు రావలసినదిగా సైన్యాన్ని కోరగా వారు అంగీకరించలేదు... కుళ్ళు వాసనకొడుతూ, కదల్చటానికి వీలులేకుండా మురిగిపోయిన శవాలు తొలగించేందుకు సైన్యంలో వేరేబృందాలు ఉంటాయి. ఆ బృందాలను పంపమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరటం జరగలేదు... పార్లమెంటులో ఈ భీభత్సంపై చర్చ జరిగినపుడు సీనియర్ మంత్రులు ఒక్కరూ లేకపోవడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వేలెత్తి" చూపుతున్నది.

"రేడియోలో, పత్రికలలో ప్రకటించడమే కాక, 19వ తేదీ మధ్యాహ్నం కనీసం మూడు సార్లు (రాష్ట్ర) చీఫ్ సెక్రటరీ కార్యాలయానికి టెలిఫోన్ చేసిన వాతావరణ శాస్త్రజ్ఞులు మహావిపత్తు రానున్నదని ముందుగా హెచ్చరించారు... ఉస్మానియా ఆసుపత్రిలో శుక్రవారం నాడు ఆపరేషన్ చేయించుకున్న తన మామగారి సేవలో తలమునకలైన ప్రభుత్వ కార్యదర్శి ఈ హెచ్చరికలపై అవసరమైన చర్యలు తీసుకోలేదు"

(శ్రీ ఆదిరాజు వెంకటేశ్వరరావు లేఖనుంచి: 'జనధర్మ' 1-12-77 సంచిక)

యుద్ధప్రాతిపదికమీద జరుగవలసిన సహాయ చర్యలు మందకొడిగా సాగుతున్నాయి. శవాల దగ్గర కాచుకొనే రాబందులు, గద్దలు, నక్కలలాంటి ఈ పాలక వర్గాలు, తుఫానుకు గురియైన ప్రజలకు సోదర ప్రజలనుండి దూరదూరాలనుండివస్తున్న సహాయ సహకారాలను సరియైన వేళలో సంపూర్ణంగా అందిస్తారా అనేది అనుమానమే.

(మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీ,
వరంగల్ జిల్లా కమిటీవారి పత్రికా ప్రకటన నుంచి)

నష్టం ఈ రకంగా యింత పెద్ద యెత్తున వుంటుందని వూహించలేకపోయినా రాబోయే తుఫాను గురించి మనకి ముందే తెలుసు. చెప్పివచ్చిన ముప్పునుండి విశాల ప్రజానీకాన్ని కాపాడలేక పోయిన బాధ్యత ఖచ్చితంగా ప్రభుత్వమే వహించాలి. తిరిగి తుఫాను బాధితులకు- ఆ బాధాసర్పదష్టులకు అందవలసిన సహాయక చర్యలుచాలా మందకొడిగా జరుగుతున్నట్టు విమర్శలు వస్తున్నాయి. అందువల్ల ప్రపంచం నలుమూలలనుండి వస్తున్న సహాయ సహకారాలను సంపూర్ణంగా ప్రజలకు అందించాలని రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ డిమాండ్ చేస్తున్నది.

అయినా ఈ సహాయక చర్యలు ఎంతవరకు ప్రజల్ని చేరుతాయి అన్నది ప్రజలందరి అనుమానమే. అందుకే దేశం నలుమూలలావున్న అన్ని స్వచ్ఛంద సంస్థలు, సంస్థ కార్యకర్తలు, తుఫానుకు బయటవున్న ప్రజలు- తమ పూర్తి సహకారాన్ని తుఫాను బాధితులకు అందజేయాలి.

(రాడికల్ స్టూడెంట్స్ యూనియన్, వరంగల్‌వారి
పత్రికా ప్రకటన నుంచి)

చివరి అట్టలోని శపథం—

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ, భారత కమ్యూనిస్టు విప్లవకారుల
సమైక్యతా కేంద్రం (మా.లె.)వారి కరపత్రం నుంచి

కథలు కావాలి

ప్రజా జీవితాన్ని, ప్రజా పోరాటాలను చిత్రించే సృజనాత్మకమైన, కళాత్మకమైన కథలు పంపించ వలసిందిగా రచయితలను కోరుతున్నాం.

'సృజన' ఎలా వుండాలని మీరు కోరుకుంటున్నారో తెలపండి

— సం.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam.
J.P.N. Road, Warangal - 506002 (A.P.)
Working Editor: Varavararao

SRJANA Telugu Monthly **Dec. 77** **H/WL-1**
Regd. No. with Registrar of News Papers 10953/67

"ప్రకృతియొక్క దయాదాక్షిణ్యాలకు ప్రజలను వదలి కనీస భద్రతాచర్యలు కూడా చేయకుండా వుండిపోయి, పెనుతుపానుయొక్క విషపుకోరలమధ్య నలిగి హతంకావలసిన స్థితికల్పించిన ఈ దుర్మార్గమైన, నరహంతకమైన ప్రభుత్వం పట్ల ప్రజల్లో జ్వలిస్తున్న ద్వేషాగ్నిని మేము ముక్తకంఠంతో బలపరుస్తున్నాము. జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని దృఢంగా అనేక రెట్లు విప్లవ దీక్షతో ముందుకు తీసుకుపోతామని, ప్రియతమ ప్రజలు అసహాయంగా ప్రాణాలు కోల్పోయే పరిస్థితులకు మొత్తంగా స్వస్తి చెప్పడానికి అవసరమైన అన్నిత్యాగాలు చేస్తామని శపథం చేస్తున్నాము. ప్రాణాలు కోల్పోయిన- దుర్భరమైన బాధల్లోకి నెట్టబడిన- మనప్రియతమ కామ్రేడ్స్‌కు, కుటుంబాలకు, ప్రజలకు మేము చేయగల అత్యున్నత సేవ యిదొక్కటే."

●

తుపానులో ప్రాణాలు కోల్పోయిన
తీవ్ర కష్టనష్టాలకు గురైన ప్రజలందరికీ
'సృజన' ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నది

●

SRJANA
Hanamkonda - 506 001

Yearly Subscription
Rs. 15/-

This issue
Rs. 1-50